




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..

హైదరాబాద్ | 3 బుధవారం | సెప్టెంబర్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 350

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


## ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ భూకంపం...

1,411కు పెరిగిన మృతుల సంఖ్య



2

## సుగాలి ప్రీతి కేసు సీబీఐకు అప్పగింత?

ఏపీ సర్కార్ నిర్ణయం



2

## కేసీఆర్, హరీశ్‌లపై వచ్చే నెల 7 వరకు చర్యలొద్దు



2

# దారితప్పిన బీఆర్ఎస్!

- కవిత సస్పెన్షన్‌తో బీఆర్ఎస్‌లో కలకలం
- కేటీఆర్ బలపడుతుండగా కవిత బలహీనత
- కేసీఆర్ మౌనం -నాయకత్వంపై ప్రశ్నలు
- కాళేశ్వరం వ్యాఖ్యలతో మరింత ముదిరిన వివాదం
- హరీష్ రావు - సంతోష్‌పై కవిత ఆరోపణలు
- "నాపై దుష్టగ్రహాలు" - కవిత భావోద్వేగ వ్యాఖ్య
- పార్టీ శ్రేణుల్లో మరింత పెరుగుతున్న విభేదాలు
- లోకల్ బాడీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలహీన సంకేతాలు

2



హైదరాబాద్-నవభూమిబ్యూరో

బిఆర్ ఎస్ పార్టీ దారి తప్పిందా? బీఆర్ఎస్ పార్టీలో కవిత కేటీఆర్ ల మధ్య జరుగుతున్న ప్రచ్ఛన్న యుద్ధాన్ని కెసిఆర్ ఆపలేకపోయారా? కవిత పైన సస్పెన్షన్ వేటు వేసి పార్టీ పరిస్థితిని మరింత దిగజార్చారా? కవిత వేరే కుంపటి పెడితే బిఆర్ఎస్ పార్టీకి నష్టం కాదా? స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కవిత వ్యవహారంలో కెసిఆర్ తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయం పార్టీ కొంప ముంచుతుందా? అంటే అవును అన్న సమాధానమే వస్తుంది. కేసీఆర్ గీత దాటిన సొంత బిడ్డలు ఒకప్పుడు కెసిఆర్ గీసిన గీత దాటని బీఆర్ఎస్ పార్టీలో పరిణామాలు కెసిఆర్ మాటకు విలువ లేదు అన్న భావన కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఒక్క మాట చెబితే ఆగాల్సిన చోట కన్న బిడ్డలే కయ్యానికి కాలు దువ్వి పార్టీని నాశనం చేసిన పరిస్థితి కనిపిస్తుంది. ఒకప్పుడు కెసిఆర్ ఏది చెబితే అదే శాసనం, కానీ ఇప్పుడు కెసిఆర్ చెప్పిన మాట కూతురే వినే పరిస్థితి లేదు. కొడుకు, కూతురును కంట్రోల్ చెయ్యలేని కేసీఆర్ కొడుకు కేటీఆర్ కి కూడా కెసిఆర్ చెప్పలేకపోతున్నాడు అన్న భావన తాజా పరిస్థితులతో కనిపిస్తుంది. కేటీఆర్ చెప్పిన దానికి తలూపటమే తప్ప సొంత నిర్ణయాలు అధినేత తీసుకోలేకపోతున్నారన్న చర్చ కూడా సాగుతుంది. పార్టీలో కోవర్టులు ఉన్నారని కవిత నోరు తెరిచిన నాడే కవితను పిలిచి వివాదానికి చెక్ పెట్టాల్సిన అధినేత కేసీఆర్ ఆ పని చెయ్యలేదు. ఫలితంగా కవిత పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతూనే ఉన్నారు. పదేపదే వారిని టార్గెట్ చేసిన కవిత కవిత కెసిఆర్ మంచోడే, ఆయన చుట్టూ ఉండే వాళ్ళే దుష్ట గ్రహాలు, దెయ్యాలు, రాక్షసులు అంటూ సంతోష్ తదితరులను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి సి ఘోష కమిషన్ నివేదిక పై అసెంబ్లీలో చర్చ జరిగిన తర్వాత సిబిఐ ఎంక్వయిరీకి ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయించడంతో కవిత హరీష్ రావును, సంతోష్ ను టార్గెట్ చేసి వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కు పార్టీ పై గ్రిప్ లేదు కెసిఆర్ పై సిబిఐ ఎంక్వయిరీ అంటే తనకు ఒళ్ళు మండి పోతుందని, దీనంతటికీ కారణం హరీష్ రావే అని ఆమె టార్గెట్ చేశారు. కవిత వ్యాఖ్యలతో సీరియస్ స్టెప్ తీసుకున్న అధినేత బి ఆర్ ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేశారు. అయితే ఈ

# డాలర్‌తో రూపాయి ఢమాల్

- చారిత్రాత్మక కనిష్టానికి పతనం!
- డాలర్‌తో పోలిస్తే మరింత క్షీణించిన రూపాయి
- 88.16 వద్ద సరికొత్త జీవితకాల కనిష్ఠానికి పతనం
- అమెరికా టారిఫ్‌లు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణే ప్రధాన కారణం
- గత మూడు రోజుల్లో 2.4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వెనక్కి
- టారిఫ్‌లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- రికార్డు పతనంలోనూ లాభాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు

2

వాషింగ్టన్-నవభూమి బ్యూరో

అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోతుండటం, అమెరికా టారిఫ్‌ల ప్రభావంతో రూపాయి తీవ్ర ఒత్తిడికి గురవుతోంది. మంగళవారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి మరో 6 పైసలు బలహీనపడి 88.16 వద్ద సరికొత్త రికార్డు కనిష్ఠ స్థాయికి చేరింది.నేడు ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి 88.14 వద్ద ప్రారంభమై, వెంటనే 88.16 స్థాయికి పడిపోయింది. నిన్న కూడా రూపాయి 88.10 వద్ద ఆల్-టైమ్ కనిష్ఠ స్థాయిలోనే ముగిసింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 88.33 అనే అత్యంత కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అమెరికా విధిస్తున్న అధిక టారిఫ్‌లు, విదేశీ పెట్టుబడిదారులు వెనక్కి తగ్గడం వంటి అంశాలు రూపాయి పతనానికి ప్రధాన



కారణంగా నిలుస్తున్నాయి.

ఈ పరిణామాలపై సీఆర్ ఫారెక్స్ అడ్వైజర్స్ ఎండీ అమిత్ పబారి మాట్లాడుతూ, "అమెరికా టారిఫ్‌ల వల్ల భారత ఎగుమతుల పోటీతత్వం దెబ్బతింటోంది. దీంతో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు వేచిచూసే ధోరణిలో లేరు. కేవలం గత మూడు ట్రేడింగ్ సెషన్లలోనే భారత ఈక్విటీల నుంచి 2.4 బిలియన్ డాలర్లు వెనక్కి

# కవిత గెంటివేత!



- బీఆర్ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేసిన అధినేత కేసీఆర్
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసే యోచనలో కవిత
- నేడు భవిష్యత్ కార్యాచరణపై కీలక ప్రకటన
- హరీశ్ రావు, జగదీశ్ రెడ్డిలకు వ్యతిరేకంగా కవిత మద్దతుదారుల నినాదాలు
- కవితపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన బీఆర్ఎస్ మహిళా నేతలు
- తెలంగాణ జాగృతి వేదికగా కొత్త ప్రయాణం సాగించే అవకాశం
- కొత్త పార్టీ స్థాపించబోతున్నట్లు సోషల్ మీడియాలో ప్రచారం

**కొత్త పార్టీ** 2

హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన కుమార్తె, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. ఈ అనూహ్య పరిణామం తర్వాత కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తన తదుపరి రాజకీయ ప్రయాణంపై ఆమె బుధవారం ఓ మీడియా సమావేశంలో కీలక ప్రకటన చేయనున్నారు.

కవిత సస్పెన్షన్ వార్త తెలియగానే, హైదరాబాద్‌లోని ఆమె నివాసం వద్దకు మద్దతుదారులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఆమెకు సంఘీభావం తెలుపుతూ... బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు టి. హరీశ్ రావు, జగదీశ్ రెడ్డిలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ పరిణామం పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.


గత కొంతకాలంగా కవిత, పార్టీ వైఖరికి భిన్నంగా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను ఆమె బహిరంగంగా సమర్థించారు. అంతేకాకుండా, సింగరేణి కార్మిక సంఘం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలిగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నికను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. తాను స్థాపించిన తెలంగాణ జాగృతి వేదికగా పలు నిరసన కార్యక్రమాలు చేపట్టడం వంటి పరిణామాలు సస్పెన్షన్‌కు దారితీసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

అన్నిటికంటే ముఖ్యంగా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందనేలా ఆమె వ్యాఖ్యలు ఉండడం బీఆర్ఎస్ అధిష్ఠానాన్ని ఇబ్బందికర వాతావరణంలోకి నెట్టింది. హరీశ్ రావు, సంతోష్ ల వల్లే కేసీఆర్ కు అవినీతి మరక అంటిందని కవిత వ్యాఖ్యానించడం తెలిసిందే. వాళ్లిద్దరి వల్లే కేసీఆర్ సీబీఐ ఎంక్వైరీ ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, కేసీఆర్ మాత్రం కవిత

## ప్రతి 50కి.మీలకు ఒక పోర్టు

ఏపీని నెంబర్ వన్‌గా మారుస్తాం - సీఎం

- ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే లక్ష్యం
- ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్‌లో సీఎం
- స్వర్ణాంధ్ర-2047 దృష్టిపథంలో పోర్టుల ప్రాధాన్యం
- ప్రతి 50 కి.మీ.లకు ఒక పోర్టు - భవిష్యత్ ప్రణాళికలు
- ఎయిర్ కార్గో, రైలు కనెక్టివిటీకి ప్రత్యేక ప్రాధాన్యం
- గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ ఉత్పత్తిలో ఏపీ ముందంజ
- ఏఐ, డ్రోన్లు, రోబోటిక్స్‌తో టెక్నాలజీ విప్లవం
- నదుల అనుసంధానంపై చంద్రబాబు దృష్టి
- డిఫెన్స్, షిప్ బిల్డింగ్, డేటా హబ్ వైపు కొత్త అడుగులు



2

అమరావతి-నవభూమిబ్యూరో

ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ లాజిస్టిక్స్ కేంద్రంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరిగిన 'ఈస్ట్ కోస్ట్ మారీటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్'లో ఆయన పాల్గొన్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రముఖ పారిశ్రామిక ప్రతినిధులతో.. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలలో భాగంగా ఏపీని ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ హబ్‌గా మార్చే దిశగా చర్చలు జరిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రజలందరి సహకారం అవసరమని కోరారు. ఆరు నెలల్లో మరోసారి విశాఖపట్నంలో ఇలాంటి సమ్మిట్ నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. ఈ సమ్మిట్‌లోనే ఎయిర్ కార్గో ఫోరం ఇండియా లోగోను చంద్రబాబు ఆవిష్కరించారు. దక్షిణాదిలో నెంబర్‌వన్ రాష్ట్రంగా ఏపీ.. భవిష్యత్తులో రోడ్లు, రైలు, సముద్రం, ఎయిర్ లాజిస్టిక్స్ విస్తృతంగా అభివృద్ధి చెందుతాయని చంద్రబాబు తెలిపారు. దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ రాష్ట్రంగా అవతరిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ఉన్న 1,053 కిలోమీటర్ల తీరప్రాంతం ఒక ప్రధాన ఆస్తి అని పేర్కొన్నారు. లాజిస్టిక్స్ రంగంలో ఎయిర్ కార్గో, రైలు

## శాంతి చర్చలకు రెడీ

- సింధూ నదీ జలాలు విడుదల చేయండి
- షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు ఎస్‌సిఓలో
- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు
- శాంతి, దౌత్య సంబంధాలు, స్థానిక సహకారం తదితర అంశాలకు పాకిస్థాన్ కట్టుబడి ఉంది

2



**బీజింగ్-నవభూమి:** చైనాలోని తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో జరిగిన షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పలు విషయాలు ప్రస్తావించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్ పై భారత్ కఠిన చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సింధూ నదీ జలా పంపిణీని భారత్ నిలిపివేసింది. దీనిపై పాకిస్థాన్ పలుసార్లు భారత్ కు లేఖలు రాసింది. అయితే ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ కఠినంగా వ్యవహరిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. అయితే షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు ఎస్‌సిఓ లో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పలు అంతర్జాతీయ చట్టాల ప్రకారం సింధూ నదీ జలాల నిలిపివేత కారణంగా స్థానికంగా ఇరు దేశాల సంబంధాలు దెబ్బతింటాయన్నారు. ఈ మేరకు సరిహద్దు దేశాలతో శాంతి చర్చలకు తాము సిద్ధమన్న సంకేతాన్ని బయటపెట్టారు. శాంతి, దౌత్య సంబంధాలు, స్థానిక

## విదేశీయులపై కేంద్రం కఠిన వైఖరి



- నేర చరిత్ర ఉంటే దేశంలోకి నో ఎంట్రీ!
- వారి కోసం ప్రత్యేక నిర్బంధ శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- సరిహద్దుల్లో అక్రమ వలసదారులను అడ్డుకోవాలని సూచన
- పాక్, చైనా, అఫ్ఘనిస్థాన్ దేశస్థులకు కొన్ని ప్రాంతాల్లో ప్రవేశం బంద్
- భారత్‌లో పనిచేసే విదేశీ ఉద్యోగులకు సైతం కొత్త షరతులు

2

## కొడంగల్ వైద్య కళాశాలకు అనుమతులు



- 50 ఎంబీబీఎస్ సీట్లకు ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్

2

**హైదరాబాద్-నవభూమి:** కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు మంజూరు చేసింది. 50 ఎంబీబీఎస్ సీట్లతో కళాశాలను ప్రారంభించుకునేందుకు

## నటి రన్యారావుకు రూ.102 కోట్ల జరిమానా

- బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయిన కన్నడ నటి రన్యారావు
- డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ రూ.102 కోట్ల జరిమానా విధింపు
- తరుణ్ కొండరాజుకు రూ.63 కోట్లు, ఆభరణాల వ్యాపారులు సాహిల్ సకరియా, భరత్ కుమార్ జైన్‌లకు చెరో రూ.56 కోట్లు జరిమానా



**బెంగళూరు-నవభూమి:** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్ట్ అయిన కన్నడ నటి రన్యారావుకు డీఆర్ఐ (డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు రూ.102 కోట్ల జరిమానా విధించారు. ఇదే కేసులో నిందితులుగా ఉన్న హోటల్ నిర్వాహకుడు తరుణ్ కొండరాజుకు రూ.63 కోట్లు, ఆభరణాల వ్యాపారులు సాహిల్ సకరియా, భరత్ కుమార్ జైన్‌లకు చెరో రూ.56 కోట్లు జరిమానా విధించారు. మంగళవారం బెంగళూరు సెంట్రల్ జైలుకు వచ్చిన డీఆర్ఐ అధికారులు ఈ మేరకు నలుగురు నిందితులకు ఒక్కొక్కరికి 250 పేజీల నోటీసులతోపాటు 2,500 పేజీల అనుబంధ పత్రాలను అందజేశారు. నలుగురికీ కలిపి వివరణాత్మక నోటీసులు, అనుబంధ పత్రాలు మొత్తం 11 వేల పేజీలు అందజేశామని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి.

**అత్యాచారం కేసులో అరెస్టైన ఆప్ ఎమ్మెల్యే.. పోలీసులనే కాల్చి కస్టడీ నుంచి పరార్** 3

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
బుధవారం
03 । సెప్టెంబర్ । 2025

# ఉద్యోగుల ఆరోగ్య పథకంపై వారంలో విధివిధానాలు

నవ వార్త



**హైదరాబాద్-నవభూమి:** ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించిన విధివిధానాలను వారం రోజుల్లో ఖరారు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఉద్యోగుల ఐకాస వెల్లడించింది. దీంతో తాము తలపెట్టిన బస్సుయాత్ర, చలో హైదరాబాద్ కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలపై సచివాలయంలో మంగళవారం ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీ సమావేశం నిర్వహించింది. అనంతరం ఐకాస చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు విలేకరుల సమావేశంలో భేటీ వివరాలను వెల్లడించారు. డిప్యూటీ సీఎం, ఉప సంఘం చైర్మన్ భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ రామకృష్ణారావు సమక్షంలో జరిగిన సమావేశంలో ఉద్యోగులు కోరుతున్న నగదు రహిత చికిత్స అందించేందుకు వీలుగా ఆరోగ్య పథకం అమలుకు ఈనెల 8వ తేదీలోపు విధివిధానాలను ప్రకటిస్తామన్న హామీ లభించిందని వెల్లడించారు. ఆపై వీలైనంత త్వరగా ఉద్యోగులకు ఆరోగ్యకార్డులు జారీ చేస్తామని చెప్పారని తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి గతంలో ఇచ్చి న హామీ మేరకు ప్రతి నెలా రూ.700 కోట్లు చెల్లిస్తామని చెప్పారని వెల్లడించారు. నర్సింగ్ డైరెక్టరేట్‌ను త్వరలో ఏర్పాటు చేస్తామని, విజిలెన్స్, ఏసీబీ కేసులతో రెండేళ్లకుపైగా సస్పెన్షన్‌లో ఉన్నవారికి దశలవారీగా పోస్టింగులు ఇవ్వనున్నట్లు చెప్పారని వెల్లడించారు. ఉద్యోగులు, ప్రభు త్వం వేరు కాదని.. సుపరిపాలన కోసం అందరం కలిసి పని చేద్దామని భట్టి విక్రమార్క తమతో అన్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రతిపాదించిన 63 డిమాండ్లలో 25కు పైగా ప్రభుత్వం నెరవేర్చిందని, మిగిలిన సమస్యలనూ ద శలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# మళ్లీ భారీ భూకంపం

## 1,411కు పెరిగిన మృతుల సంఖ్య



**ఆఫ్ఘనిస్థాన్-నవభూమి:** ఆఫ్ఘనిస్థాన్‌లో ప్రకృతి సృష్టించిన ప్రళయానికి భారీ సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సెప్టెంబర్ 1న సంభవించిన శక్తివంతమైన భూకంపం కారణంగా ఇప్పటివరకు కనీసం 1,411 మంది మరణించారని, మరో 3,100 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారని తాలిబన్ ప్రభుత్వ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ మంగళవారం ప్రకటించారు. ఈ ప్రకృతి విపత్తు ఆఫ్ఘనిస్థాన్‌ను తీవ్ర విషాదంలోకి నెట్టింది. రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో నమోదైన ఈ భూకంపం ధాటికి 5,400 కంటే ఎక్కువ ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ముజాహిద్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు. దీంతో వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ముఖ్యంగా మట్టి, కలపతో నిర్మించిన ఇళ్లు ఎక్కువగా ఉండటంతో అవి భూ ప్రకంపనలకు తట్టుకోలేక పేకమేడల్లా కూలిపోయాయి. గ్రామాలకు గ్రామాలే నేలమట్టం కావడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. చాలామంది నిద్రలోనే ప్రాణాలు కోల్పోవడం పెను విషాదానికి కారణమైంది. ప్రస్తుతం మారుమూల పర్వత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు, సరైన దారులు లేకపోవడం వల్ల సహాయక బృందాలు ఘటనా స్థలాలకు చేరుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఈ పరిస్థితిపై ఐక్యరాజ్యసమితి అధికారి ఇంద్రికా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న ఆఫ్ఘనిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం ఆదుకోవాలని ఇంద్రికా విజ్ఞప్తి చేశారు. మరోవైపు, 2021లో అధికారం చేపట్టిన తర్వాత తాలిబన్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న మూడో అతిపెద్ద భూకంపం ఇది. అంతర్జాతీయ సహాయం కోసం తాలిబన్లు పిలుపునిచ్చినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇతర సంక్షోభాలు, మహిళల హక్కులపై వారు విధిస్తున్న ఆంక్షల కారణంగా ఆఫ్ఘనిస్తాన్‌కు అందే విదేశీ సాయం గణనీయంగా తగ్గిపోయింది.

నేను అలా జరిగితే ఇలా కుర్చీలో కూర్చొనే వాళ్లున్నారు! సీఎం కుర్చీపై రేవంత్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ ఆయనకు ముఖ్యమంత్రి కుర్చీపై అపనమ్మకం పోలేదని స్పష్టమవుతున్నది.

# నేను అలా జరిగితే ఇలా కుర్చీలో కూర్చొనే వాళ్లున్నారు!

## రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్-నవభూమి:** సీఎం కుర్చీపై రేవంత్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ ఆయనకు ముఖ్యమంత్రి కుర్చీపై అపనమ్మకం పోలేదని స్పష్టమవుతున్నది. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ సుభాష్ పాలేకర్‌కు అవార్డు అందజేశారు. పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తాను ఇలా పక్కకు జరిగితే, అలా కుర్చీలో కూర్చొనే వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 'మనం ఎవరినైనా మొదటివారం లోపలికి రానిస్తే.. రెండో వారంలో మనం కాసేపు ఇలా జరిగి అలా పక్కకు పోతే ఆ కుర్చీలో కూర్చొనేవాళ్లున్నారు. నేనే నడుపుతాలే అనే వాళ్లు ఉన్నారు. నేను అనుభవంతో ఇవన్నీ చెబుతున్నాను' అంటూ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. రేవంత్‌రెడ్డి తన సీఎం కుర్చీ గురించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ ఆయనకు కుర్చీపై అపనమ్మకం పోలేదని ఈ వ్యాఖ్యలతో స్పష్టమవుతున్నదని అభిప్రాయపడుతున్నారు.

# ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లకు క్యాబినెట్ హోదా

**అమరావతి-నవభూమి:** ముగ్గురు కార్పొరేషన్ చైర్మన్లకు రాష్ట్ర ప్రభుత్వం క్యాబినెట్ హోదా కల్పించింది. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్ .జవహర్, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కు క్యాబినెట్ హోదా కల్పిస్తూ సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా క్యాబినెట్ హోదాలోనే ప్రొటోకాల్ అమలు చేయనున్నారు. అదే హోదాలో వేతనాలు, అలవెన్సులు అందించనున్నారు.

**18 మంది చైర్మన్లకు వేతనాలు**

ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన పలువురు కార్పొరేషన్ చైర్మన్లకు వేతనాలు, అలవెన్సులను నిర్ణయించింది. హ్యాండీక్రాఫ్ట్ చైర్మన్, గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్, మహిళా కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, భవన, ఇతర నిర్మాణ పనుల వర్కర్ల వెల్ఫేర్ బోర్డు చైర్మన్.. ఇలా 12 మంది చైర్మన్లకు ఏ కేటగిరి కింద వేతనాలు, అలవెన్సులు ఇవ్వడానికి నిర్ణయించింది. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీతో పాటు మరో ఐదు కార్పొరేషన్ల చైర్మన్లకు బి కేటగిరి కింద వేతనాలు అందించడానికి ఉత్తర్వులు జారీ చేసింది.

# తనయుడి వర్ధంతి నాడే తల్లి మృతి

**ఒంగోలు-నవభూమి:** తనయుడి వర్ధంతి రోజే తల్లి మృతిచెందారు. ఈ ఘటనతో కుటుంబసభ్యులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి భద్రతా అధికారిగా ఉన్న అద్దంకి సాల్మన్‌కేరి వెస్లీ ఆయనతోపాటు 2009లో నంద్యాల జిల్లా పావురాలగుట్టలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన 16 వర్ధంతి మంగళవారం. ఆ రోజే ఆయన తల్లి కమల వెస్లీ(94) వయోభారంతో మృతి చెందారు. కాగా వర్ధంతి నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట వెస్లీ విగ్రహానికి పోలీసు శాఖ తరఫున ఎస్పీ ఏఆర్.దామోదర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం స్థానిక మిరియాలపాలెంలోని వెస్లీ స్వగృహంలో కమల వెస్లీ భౌతికాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ఎస్పీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ప్రతి 50కి.మీలకు ఒక పోర్టు

(1వపేజీ తరువాయి)కనెక్టివిటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రస్తుతం 90 శాతం కార్గో బల్క్ రూపంలో రవాణా అవుతున్నప్పటికీ, ఎయిర్ కార్గో ద్వారా వేగంగా సరకు పంపిణీ చేయవచ్చని వివరించారు. 50కి.మీ లకు ఒక పోర్టు.."ఏపీలో ప్రధాని మోదీ గోల్ కోసం కష్టపడుతున్న సీఎం చంద్రబాబు!" ప్రస్తుతం ఏపీలో ఆరు పోర్టులు ఉన్నాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని చంద్రబాబు వివరించారు. 2046 నాటికి అన్ని పోర్టులు పూర్తయ్యేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు ఏర్పాటు చేయడం లక్ష్యమని తెలిపారు. ఫార్మా, ఆక్వా, వ్యవసాయ రంగాల్లో ఏపీ ముందంజలో ఉందని, పోర్టుల ఆధారంగా ఆర్థికాభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రం టెక్నాలజీ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఇళ్లపైనే విద్యుదుత్పత్తి జరుగుతోందని, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెరగడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. ఏఐ, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్లు, రోబోటిక్స్, ఐవోటీ, సెన్సార్స్ వినియోగం పెరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించామని, "వన్ ఫ్యామిలీ - వన్ ఆంత్రప్రెన్యూర్" లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దేశంలో నదుల అనుసంధానం అత్యవసరమని చంద్రబాబు అన్నారు. గంగా నుంచి కావేరీ వరకు నదులను అనుసంధానం చేయడం ద్వారా నీటి భద్రత సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. భారత్ షిప్‌బిల్డింగ్ రంగంలో వెనుకబడిందని అన్నారు. ఏపీలో మూడు, నాలుగు ప్రాంతాలను షిప్ నిర్మాణానికి కేటాయించామని చెప్పారు. ముందుకు వచ్చే సంస్థలతో కలిసి పనిచేయడానికి ప్రభుత్వం సిద్ధమని తెలిపారు. రాష్ట్రంలో డిఫెన్స్, మెరైన్ షిప్ బిల్డింగ్, కంటైనర్ టెర్మినల్స్ ఏర్పాటుకు కూడా ప్రణాళికలు ఉన్నాయని వెల్లడించారు. మంచి ప్రతిపాదనలతో ముందుకు వచ్చే వారికి ప్రభుత్వం వయబిలిటీ ఫండింగ్ ద్వారా మద్దతు ఇస్తుందని చంద్రబాబు తెలిపారు. లాంగ్ టర్మ్ పార్టనర్స్ లాంగ్ టర్మ్ ప్లాంట్‌లతో రావాలని సూచించారు. విశాఖలో డేటా సెంటర్ రాబోతోందని, వైజాగ్ డేటా హబ్‌గా మారుతుందని చెప్పారు. అలాగే జీఎంఆర్ సంస్థ ఏవియేషన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతుందని వివరించారు.

# కవిత గెంటివేత!

(1వపేజీ తరువాయి)పార్టీ లైన్ దాటిందన్న ఉద్దేశంతో సస్పెన్షన్ వేటు వేశారు.

మరోవైపు, కవిత సస్పెన్షన్‌ను బీఆర్ఎస్ మహిళా నేతలు సమర్థించారు. కుమార్తె కంటే పార్టీయే గొప్పదని కేసీఆర్ నిరూపించారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. పార్టీ తనకు ఇచ్చిన ఎంపీ, ఎమ్మెల్సీ పదవులను మరిచిపోయి, పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా కవిత వ్యవహరించారని వారు విమర్శించారు. పార్టీకి ద్రోహం చేసిన వారిలో కవిత ఒకరిగా మిగిలిపోతారని మాజీ ఎమ్మెల్యే జి. సునీత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ భవిష్యత్తును కవిత స్వయంగా నాశనం చేసుకున్నారని ఆమె అన్నారు. రేపటి మీడియా సమావేశంలో కవిత ఎలాంటి నిర్ణయం ప్రకటిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్న కవిత!.. సర్వత్ర ఉత్కంఠ**

తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆ పార్టీ ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో, కవిత సంచలన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తన ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేయాలని ఆమె దాదాపుగా నిర్ణయించుకున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీ తనపై అనర్హత వేటు వేయాలని ఫిర్యాదు చేయకముందే, తానే స్వయంగా ఎమ్మెల్సీ పదవిని వదులుకోవాలని కవిత యోచిస్తున్నారని ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. పార్టీతో అన్ని సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలనే ఉద్దేశంతోనే ఆమె ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. సస్పెన్షన్ అనంతరం తన ముఖ్య అనుచరులతో విస్తృతంగా చర్చలు జరిపిన కవిత, ఈ మేరకు ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

ఇంతటితో ఆగకుండా, త్వరలోనే సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ప్రకటించే యోచనలో కవిత ఉన్నట్లు ఆమె అనుచరులు బలంగా చెబుతున్నారు. దీనిపై పూర్తి స్పష్టత ఇచ్చేందుకు ఆమె రేపు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నారు. కవిత ఎలాంటి ప్రకటన చేయనున్నారనే ఉత్కంఠ సర్వత్ర నెలకొంది.

# సుగాలి ప్రీతి కేసు సీబీఐకు అప్పగింత?

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలన సృష్టించిన సుగాలి ప్రీతి కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుగాలి ప్రీతి కేసును సీబీఐకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీబీఐకు లేఖ రాయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసుపై దృష్టి పెట్టిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులతో మాట్లాడి కేసు దర్యాప్తు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతిపక్షంలో ఉండగా కూడా సుగాలి ప్రీతి కుటుంబాన్ని పరామర్శించేందుకు పవన్ కళ్యాణ్ కర్నూలు వెళ్ళిన సంగతి తెలిసిందే. పవన్ ఒత్తిడితో ఈ కేసుపై గత వైసీపీ ప్రభుత్వం ముందుకు కదిలింది. కానీ అప్పటికే సాక్ష్యాధారాలను లేకుండా చేశారని అధికారులు ఆరోపించారు. దీనితో కూటమి ప్రభుత్వం ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలని నిర్ణయించింది. ఎల్లుండి జరిగే కేబినెట్ సమావేశంలో కూడా ఈ అంశంపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అయితే తాజాగా.. ఈ కేసుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించిన విషయం తెలిసిందే. వైసీపీ హయాంలో తాను చేసిన పోరాటాన్ని.. సుగాలి ప్రీతి తల్లి మర్చిపోవడం బాధాకరమని అన్నారు. ఆపదలో ఉంటే.. చేయి అందించిన తననే ఇలా దూషించడం సరైందా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వాన్ని, సీఎంను ప్రశ్నించే ధైర్యం ఎవరికీ లేనప్పుడు .. సుగాలి ప్రీతి తల్లి పడే బాధను చూసి జనసేన పోరాడిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. పోరాటం కారణంగానే సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగించారన్నారు. అలాగే జనసేన పార్టీ పోరాటంతోనే సుగాలి ప్రీతి కుటుంబానికి.. దిన్నెదేవరపాడులో 5 ఎకరాల పొలం, కర్నూలులో 5 సెంట్ల స్థలం.. సుగాలి ప్రీతి తండ్రికి ఉద్యోగం వచ్చిందని పవన్ కళ్యాణ్ చెప్పుకొచ్చారు.

# విదేశీయులపై కేంద్రం కఠిన వైఖరి

(1వపేజీ తరువాయి)దేశ భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌లో గతంలో నేరాలకు పాల్పడి, దేశ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్న విదేశీయులు తిరిగి దేశంలోకి ప్రవేశించకుండా కఠిన చర్యలు చేపట్టాలని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో భారత్‌కు వచ్చి గూఢచర్యం, ఉగ్రవాద కార్యకలాపాలు, హత్యలు, అత్యాచారాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి దోషులుగా తేలిన విదేశీ పౌరులను గుర్తించి, వారిని మళ్లీ దేశంలోకి అడుగుపెట్టనీయకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్రాలదేనని హోంశాఖ స్పష్టం చేసింది. ఒకవేళ అలాంటి వారు దేశంలో ఎక్కడైనా కనిపిస్తే తక్షణమే అదుపులోకి తీసుకోవాలని సూచించింది. ఇందుకోసం ఇటీవల అమల్లోకి తెచ్చిన ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం (2025) ప్రకారం ప్రత్యేక హోల్డింగ్ సెంటర్లు లేదా నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

సరిహద్దుల వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేయాలని హోంశాఖ ఆదేశించింది. అక్రమ వలసదారులు దేశంలోకి చొరబడకుండా నిరోధించేందుకు సరిహద్దు రక్షణ దళాలు, కోస్ట్ గార్డులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపింది. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, చైనా, పాకిస్థాన్‌లలో జన్మించిన వారికి భారత్‌లోని కొన్ని సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో పర్యటించడంపై నిషేధం విధించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, నాగాలాండ్, మణిపూర్, మిజోరాం, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, లడఖ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రదేశాలకు వారు వెళ్లకుండా చూడాలని పేర్కొంది. అంతేకాకుండా, భారత్‌లో ఉద్యోగం చేయడానికి సరైన వీసా ఉన్న విదేశీయులు సైతం స్థానిక అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, నీరు, పెట్రోలియం వంటి కీలక రంగాల్లోని ప్రైవేటు సంస్థల్లో చేరకూడదని కొత్త షరతు విధించింది. పర్వతారోహణ వంటి కార్యక్రమాలు చేపట్టాలంటే కూడా తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది.

# కేసీఆర్, హరీశ్‌లపై వచ్చే నెల 7 వరకు చర్యలొద్దు

**హైదరాబాద్-నవభూమి:** జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నివేదిక, విజిలెన్స్ విభాగం నివేదిక, ఇతర అంశాల ఆధారంగా కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికకు, తాము సీబీఐ ద ర్యాప్తు కోరడానికి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ రెండూ వేర్వేరు అంశాలని పేర్కొంది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐను స్వతంత్రంగా మొత్తం కేసును మొదటి నుంచి దర్యాప్తు చేయాలని కోరామని వెల్లడించింది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ దర్యాప్తు ఉండబోదని స్పష్టం చేసింది. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించేందుకు తామిచ్చిన జీవోలో అక్రమాలకు ఎవరు బాధ్యులు? ఎవరిపై దర్యాప్తు చేయాలి? అని ఏ పేర్లనూ ప్రస్తావిస్తూ అడగలేదని తెలిపింది. ఘోష్ కమిషన్ నివేదికపై శాసనసభలో చర్చించామని, అయితే నివేదిక ఆధారంగా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపింది. చర్యలు తీసుకుంటే అందుకు సంబంధించిన చర్యా నివేదికను శాసనసభలో పెడతామని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

కాళేశ్వరం కమిషన్ నివేదికను కొట్టేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో మంగళవారం వాడీవేడిగా వాదనలు జరిగాయి. నివేదికను శాసనసభలో చర్చించినప్పటికీ తదుపరి ఎలాంటి చర్యలు తీసుకోకుండా అడ్డుకోవాలని కొద్దిరోజుల క్రితం కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన మధ్యంతర దరఖాస్తులపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ని వేదికపై చర్యలు తీసుకున్నారా? తీసుకోబోతున్నారా? నిర్ణయం పెండింగ్‌లో ఉందా? చెప్పాలని సోమవా రం హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సంగతి తెలిసిందే. మంగళవారం ఈ అంశంపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సీబీఐ దర్యాప్తు కోరుతూ జారీచేసిన జీవో, సీబీఐ ఎంట్రీపై నిషేధం ఎత్తివేతకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ధర్మాసనానికి అందజేశారు. కాళేశ్వరం నివేదికలోని అంశాల ఆధారంగా సీబీ ఐ దర్యాప్తును కోరలేదని, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ తదితర నివేదికల ఆధారంగా కోరామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం సీబీ ఐ దర్యాప్తు విషయంలో ఎలాంటి జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. తాము విచారిస్తున్నది పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించిన అంశమ ని, పిటిషనర్లు కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ పిటిషన్లు వేశారని ప్రస్తావించింది. సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం వేరే విషయమని, కావాలంటే దాన్ని సవాల్ చేస్తూ విడిగా పిటిషన్లు వేసుకోవచ్చని సూచించింది. కమిషన్ నివేదికలోని అంశాలను ఆధారంగా చేసుకొని పిటిషనర్లపై వచ్చే విచారణ తేదీ వరకు ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ కౌంటర్ల కోసం తదుపరి విచారణ అక్టోబరు 7కు వాయిదా పడింది.

కసీఆర్ తరఫున హాజరైన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది దామ శేషాద్రి నాయుడు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను వాదనలు వినిపిస్తుంటే అడ్డుకోవడాన్ని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తన క్లయింట్(కేసీఆర్)ను ఎదుర్కొనే దమ్ము లేదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కమిషన్ నివేదికను ముందు పెట్టుకుని కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసే విధంగా రచ్చ చేయాలని ప్రయత్నిస్తు న్నారని ఆరోపించారు. కమిషన్ నివేదిక న్యాయ సమీక్షకు నిలబడే పరిస్థితి కనిపించకపోవడంతో సీబీఐ దర్యాప్తునకు సదరు నివేదిక ఆధారం కాదంటూ తెలివి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

ఘోష్ కమిషన్ నివేదికను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు అయింది. నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి(రిటైర్డ్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# దారితప్పిన బీఆర్ఎస్

(1వపేజీ తరువాయి)వ్యవహారం అంతా కెసిఆర్ కు పార్టీ పైన గ్రిప్ లేదన్న విషయాన్ని స్పష్టం చేస్తుంది. కేసీఆర్ చేతులెత్తే శారా? కొడుకును, కూతుర్నే కంట్రోల్ చేయలేని కేసీఆర్, పార్టీని ఏ విధంగా కంట్రోల్ చేస్తాడు అన్న అభిప్రాయానికి కారణమవుతుంది. మరీ ముఖ్యంగా దశాబ్దకాలం అప్రతిహతంగా తెలంగాణ రాష్ట్రంలో తిరుగులేని నాయకు డిగా పాలన సాగించిన కేసీఆర్ ప్రస్తుతమున్న పరిస్థితులతో చేతులెత్తేసినట్టు కనిపిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు తీసుకున్న ఈ నిర్ణయం బిఆర్ఎస్ పార్టీని నిండా ముంచేసే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. %ూశ్రీంశీ =ఖుం ఋఱశ్రీఋఎ అవఌం%: రైల్వే ఉద్యోగులకు బంపర్ న్యూస్.. వారికి కోటి రూపాయలు! పార్టీ దారి తప్పిందా? కేసీఆర్ ఏం చేస్తారు ? బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి అయిపోయిందని, పార్టీ దారి తప్పిందని, అధినేత చేతుల్లో ఏమీ లేదు అన్న సంకేతాలు పార్టీ శ్రేణుల దాకా వెళుతున్నాయి. గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్న బీఆర్ఎస్, అధినేత కెసిఆర్ ఈ పరిస్థితుల నుంచి బయట పడతారా? మళ్లీ పార్టీని దూకుడుగా ముందుకు తీసుకు వెళ్ళ గలుగుతారా? అనేది తెలియాల్సి ఉంది.

# డాలర్‌తో రూపాయి ధమాల్

(1వపేజీ తరువాయి)వెళ్లిపోయాయి. ఇది కరెన్సీ, ఈక్విటీ మార్కెట్లలో తీవ్ర అస్థిరతకు కారణమవుతోంది" అని వివరించారు. సోమవారం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,429.71 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించినట్లు ఎక్స్ఛేంజ్ డేటా స్పష్టం చేస్తోంది. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ విషయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ తన టారిఫ్‌లను సున్నాకు తగ్గించడానికి ముందుకు వచ్చిందని, కానీ ఇప్పటికే చాలా ఆలస్యమైందని ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో పోస్ట్ చేశారు. భారత్ ఎక్కువగా రష్యా నుంచే చమురు, సైనిక ఉత్పత్తులను కొనుగోలు చేస్తోందని, అమెరికాతో చాలా తక్కువ వ్యాపారం చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. రూపాయి పడిపోతున్నప్పటికీ దేశీయ స్టాక్ మార్కెట్లు మాత్రం లాభాల్లో ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ 207 పాయింట్లు పెరిగి 80,571 వద్ద, నిఫ్టీ 60 పాయింట్ల లాభంతో 24,685 వద్ద కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ 0.08 శాతం పెరగ్గా, బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 68.45 డాలర్ల వద్ద ఉంది. నిపుణుల అంచనా ప్రకారం రూపాయికి 88.50 వద్ద నిరోధం, 87.50 వద్ద మద్దతు లభించే అవకాశం ఉంది.


# శాంతి చర్చలకు రెడీ

(1వపేజీ తరువాయి)సహకారం తదితర అంశాలకు పాకిస్థాన్ కట్టుబడి ఉందని తెలిపారు. భారత్- పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించి శాంతిని నెలకొల్పేందుకు ఎస్‌సిఓ దేశాల మద్దతు అవసరం అని పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. సరిహద్దు దేశాలతో పాకిస్థాన్ ఎప్పుడూ శాంతిని, స్థిరమై సంబంధాలను కోరుకుంటుందన్నారు. ఎస్‌సిఓ ఫ్రేమ్ వర్క్ కింద పాకిస్థాన్ శాంతిని కోరుకుంటోందన్నారు. ఇక ఏప్రిల్ 22 న జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమంలో 26 మంది టూరిస్టులు మృతి చెందారు. దీంతో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ పై భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ ప్రాంతాల్లోని 9 కీలక ఉగ్రవాద స్థావరాలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేయడమే కాకుండా వందలాది మంది టెర్రరిస్టులను హతమార్చింది. అంతేకాక పాకిస్థాన్ పై భారత్ కఠిన ఆంక్షలు అమలు చేసింది. సింధూ నదీ జలాల పంపిణీ నిలిపివేత, అటారీ- వాఘా బోర్డర్ మూసివేత, ఇరు దేశాల మధ్య వాణిజ్యం రద్దు, వీసాల జారీ రద్దు, గగనతలం మూసివేత.. తదితర నిర్ణయాలతో పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బ కొట్టింది. ఈ క్రమంలో భారత్- పాకిస్థాన్ మధ్య ప్రస్తుతం ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# కొడంగల్ వైద్య కళాశాలకు అనుమతులు

(1వపేజీ తరువాయి)పచ్చజెండా ఊపింది. ఈ మేరకు మంగళవారం అధికారికంగా సమాచారం ఇచ్చింది. ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు మొదలుకానున్నాయి. కొడంగల్ కాలేజీకి అనుమతులు రావడంతో తెలంగాణలో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 35కు, వాటిలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 4,100కు పెరిగింది. గత ఏడాది 8 కాలేజీలు, ఈ ఏడాది మరో కాలేజీకి అనుమతులు సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరేంద్రకుమార్‌ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం 200 పడకల తాండూరు జిల్లా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా చూపించి కొడంగల్ వైద్య కళాశాలకు అనుమతులు పొందింది. మాతాశిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్)లో పడకలను కూడా కలిపితే మొత్తం 320 పడకలు అవుతాయని పేర్కొంది. కాలేజీ ఏర్పాటుకు అవసరమైన పడకల సంఖ్య, ఓపీ, ఐపీ ఉండటంతో ఎన్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. తాండూరులోనే నర్సింగ్ కాలేజీ కోసం నిర్మించిన భవనాలను ప్రస్తుతానికి వైద్య కళాశాల కోసం వినియోగించనున్నారు. ప్రభుత్వం వైద్య కళాశాల, బోధనాస్పత్రికి శాశ్వత భవన నిర్మాణాల కోసం తాండూరు-కొడంగల్ మధ్య అప్పాయపల్లిలో 20 ఎకరాల భూమిని కేటాయించింది. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్తగా 30 వైద్య కళాశాలలు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం జిల్లాకు ఒక వైద్య కళాశాల అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర ఏర్పాటుకు ముందే తెలంగాణలో 5 ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నాయి.

# 1070 హైడ్రా టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి..



**హైదరాబాద్-నవభూమి:** ప్రజలకు మరింత చేరువయ్యేందుకు హైడ్రా టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణ/కబ్జాలు, విపత్తుల నిర్వహణ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ 1070ను కేటాయించింది. ఇప్పటి వరకు ప్రజావాణి, ఎక్స్ ద్వారానే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉండగా.. తాజాగా ఈ అవకాశం కల్పిస్తున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.



# ఐసీయూలో నవజాత శిశువు వేళ్లు కొరికిన ఎలుకలు



**ముంబై- నవభూమి:** మధ్యప్రదేశ్‌లో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇండోర్ లో గల ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎలుకలు స్వైర విహారం చేశాయి. ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో ఇద్దరు నవజాత శిశువులను కొరికాయి. ఎలుకల దాడిలో ఓ చిన్నారి వేళ్లు, మరో శిశువు తల, భుజాలపై గాయాలయ్యాయి. రాష్ట్రంలోని అతిపెద్ద ఆస్పత్రుల్లో ఒకటైన మహారాజా యశ్వంతరావు చికిత్సాలయంలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో ఈ ఘటన చోటు చేసుకుంది. చిన్నారులిద్దరూ వారం వయసుగల వారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ యాదవ్ తెలిపారు. 'ఆస్పత్రిలోని నర్సింగ్ సిబ్బంది గాయపడిన శిశువులను చూసి యాజమాన్యానికి సమాచారం అందించింది. ఆ తర్వాత యూనిట్‌లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను పరిశీలించగా.. నవజాత శిశువుల దగ్గర ఎలుకలు కనిపించాయి. గత 48 గంటల్లో ఓ శిశువు వేళ్లను ఎలుకలు కొరకగా.. మరో శిశువు తల, భుజంపై గాయాలయ్యాయి. ప్రస్తుతం ఇద్దరు చిన్నారుల ఆరోగ్యం స్థిరంగా ఉంది' అని డాక్టర్ అశోక్ యాదవ్ వివరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 | హైదరాబాద్
బుధవారం
03 | సెప్టెంబర్ | 2025


# 17 ఏళ్ల బాలుడితో ఇద్దరు పిల్లల తల్లి ప్రేమాయణం..



**చెన్నై-నవభూమి:** అప్పటికే ఆమెకు పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. భర్త, బిడ్డలతో హాయిగా గడపాల్సిన ఆమె తనకంటే 10 ఏళ్ల చిన్నవాడైన ఓ మైనర్ బాలుడి ప్రేమలో పడింది. చాలా రోజులుగా వివాహేతర సంబంధం కూడా కొనసాగిస్తోంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో మాత్రమే అతడిని కలవాల్సి రావడం.. కష్టంగా తోచడంతో ఇంట్లోంచి పారిపోదామని చెప్పింది. అందుకు బాలుడు కూడా అంగీకరించగా.. 17 ఏళ్ల బాలుడితో 27 ఏళ్ల వివాహిత పారిపోయింది. దాదాపు 600 కిలో మీటర్ల ప్రయాణించి అతడితో కాపురం పెట్టింది. మరి చివరకు ఏమైందంటే?పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని అలప్పుళా జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. 27 ఏళ్ల మహిళకు కొన్నేళ్ల క్రితమే పెళ్లి కాగా ఇద్దరు పిల్లలు కూడా పుట్టారు. ఇంతకాలం భర్తతో సంతోషంగానే ఉన్న ఈమెకు కొన్ని నెలల క్రితం 17 ఏళ్ల బాలుడు పరిచయం అయ్యాడు. కొన్ని రోజుల్లోనే వీరిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. అదికాస్తా వివాహేతర సంబంధానికి దారి తీసింది. అతడితో గడపాలనిపించినప్పుడుల్లా.. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి అతడిని పిలిపించుకునేది. ఇలా ఇన్నాళ్లు కాలం వెళ్లదీస్తూ వచ్చారు. కానీ అతడితో ఎక్కువ సమయం గడపలేకపోతున్నందుకు తెగ ఫీలైన మహిళ.. ఇంట్లోంచి పారిపోదాం, కలిసుందామని బాలుడితో చెప్పింది.

మహిళ మాటలు విన్న బాలుడు ఆమెతో వెళ్లేందుకు అంగీకరించాడు. ఇలా ఇద్దరూ కలిసి 15 రోజుల క్రితం కేరళలోని అలప్పుళా నుంచి దాదాపు 600 కిలో మీటర్లు ప్రయాణించి కర్ణాటకలోని కొల్లూర్‌కు చేరుకున్నారు. అయితే రోజంతా బాలుడు కనిపించకపోవడంతో భయపడ్డ అతడి తల్లిదండ్రులు వెంటనే వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ బాలుడి వద్ద ఫోన్ లేకపోవడంతో విషయం వెలుగులోకి రాలేదు. కానీ స్థానికులను విచారించగా.. బాలుడు ఎక్కువగా పారిపోయిన మహిళతో మాట్లాడేవాడని తెలుసుకున్నారు. వారి ఇంటికి వెళ్లగా ఆమె కూడా కనిపించకపోవడంతో.. ఇద్దరూ కలిసే పారిపోయారనే నిర్ణయానికి వచ్చారు. కానీ మహిళ వద్ద కూడా ఫోన్ లేకపోవడంతో.. ఎక్కడికి వెళ్లారనే దానిపై క్లారిటీ రాలేదు. అయితే ఇంట్లోంచి పారిపోయిన 12 రోజుల తర్వాత సదరు మహిళ.. తన బంధువులకు ఓ మెసేజ్ పంపించింది. తాను బెంగళూరులో ఉన్నట్లు చెప్పి.. తనకు ఇక భర్త అవసరం లేదని వివరించింది. దీంతో బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. మెసేజీ వచ్చిన నెంబర్ ఆధారంగా పోలీసులు ఆమె జాడను గుర్తించారు. వెంటనే బాలుడు సహా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇరు కుటుంబాలను రప్పించి మాట్లాడారు. ఈక్రమంలోనే మహిళ తనకు భర్త వద్దని.. బాలుడితోనే ఉంటానని చెప్పింది. కానీ తల్లిదండ్రులతో మాట్లాడిన బాలుడు.. ఆమె పిలిస్తేనే వెళ్లాలని చెప్పడంతో కథ మలుపు తిరిగింది.

## ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. లేఆఫ్స్ వేళ వేతనాలు పెంచిన టీసీఎస్




**న్యూఢిల్లీ-నవభూమి:** పెద్ద ఎత్తున ఉద్యోగులకు లేఆఫ్స్ ప్రకటించి షాకిచ్చిన భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ఇప్పుడు తీపి కబురు చెప్పింది. ఉద్యోగుల వేతనాలు పెంచింది . ఇందుకు సంబంధించిన ఇంక్రిమెంట్ లెటర్లను తమ ఉద్యోగులకు సోమవారం సాయంత్రం నుంచే టీసీఎస్ పంపించడం మొదలు పెట్టినట్లు ఈ వ్యవహారానికి సంబంధం ఉన్న వ్యక్తులను ఊటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంది. ఈ పెంపు సెప్టెంబర్ నెల నుంచే వర్తిస్తుందని తెలిపినట్లు సదరు వ్యక్తులు వెల్లడించారు. ఉద్యోగి పని తీరు, కేటగిరీని బట్టి 4.5 శాతం నుంచి 7 శాతం వరకూ వేతనాలు పెంచినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.కాగా, ఇటీవలే టీసీఎస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే దాదాపు 80 శాతం ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు టీసీఎస్ ప్రకటించింది. జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు సెప్టెంబర్ 1 నుంచి వేతన పెంపులను అమలు చేయనున్నట్టు ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్‌లో టీసీఎస్ సీహెచ్‌ఆర్‌వో మిలింద్ లక్కడ్ తెలిపారు. అందుకు అనుగుణంగానే వేతన పెంపును అమలు చేసినట్లు సమాచారం. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ప్రపంచ వ్యాప్తంగా టీసీఎస్‌లో 613,069 మంది ఉద్యోగులు ఉన్నారు.

## కార్టూనిస్టు హేమంత్ మాల్వియాకు ముందస్తు బెయిల్ మంజూరీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్ఎస్ఎస్‌పై అభ్యంతరకర కార్టూన్లు వేసిన కార్టూనిస్టు హేమంత్ మాల్వియాకు సుప్రీంకోర్టు ఇవాళ ముందస్తు బెయిల్ మంజూరీ చేసింది. తన కార్టూన్ పట్ల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లలో మాల్వియా క్షమాపణలు చెప్పినట్లు జస్టిస్ అరవింద్ కుమార ఎన్వీఅంజారి తెలిపారు. ఒకవేళ కార్టూనిస్టు దర్యాప్తునకు సహకరించకుంటే అప్పుడు బెయిల్ ను రద్దు చేసే స్వేచ్ఛను పోలీసులకు కోర్టు వదిలేసింది. మాల్వియా తరపున వృందా గ్రోవర్ వాదించారు. క్షమాపణలు చెప్పామని, కానీ ఇప్పటి వరకు పిటీషనర్‌కు సమన్లు ఇవ్వలేదన్నారు. అన్ని ఆధారాలు సేకరించిన తర్వాత సమన్లు ఇస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నాటరాజ్ తెలిపారు.

ఓ లాయర్, ఆర్ఎస్ఎస్ వర్కర్ వినయ్ జోషీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాల్వియాపై మే నెలలో కేసు బుక్ చేశారు. మతపరమైన మనోభావాలను దెబ్బతీసినట్లు ఆ ఫిర్యాదులో ఆరోపించారు. అభ్యంతరకరమైన కార్టూన్లను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి డిస్టర్బ్ చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

## వెల్లివిరిసిన మతసామరస్యం.. మసీదులో గణనాథుడు..!

**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా హిందువులు మాత్రమే వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. కానీ ఆ గ్రామంలో మాత్రం ముస్లిం సోదరులు మసీదు లో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. నిత్యపూజలు చేస్తున్నారు. మహారాష్ట్ర లోని సాంగ్లీ జిల్లా లోగల గోటి?ండీ గ్రామం లో చోటుచేసుకున్న ఈ ఘటన మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.అయితే గోటి?ండి గ్రామానికి ముస్లిం సోదరులు ఈసారి మాత్రమే కాదు, ప్రతి ఏటా మసీదులో గణేశుడి విగ్రహాన్ని పెట్టి పూజలు చేస్తున్నారు. 1980లో ఈ సంప్రదాయం ప్రారంభమైంది. ఎందుకంటే 1980లో గోటి?ండి గ్రామంలో భారీ వర్షం కారణంగా వరదలు రావడంతో.. ఆరుబయట మండపంలో ఉన్న గణేశుడి విగ్రహాన్ని గ్రామంలోని మసీదులోకి మార్చారు. ఆ తర్వాత నిమజ్జనం వరకు అక్కడే పూజలు చేశారు.ఇక అప్పటి నుంచి ప్రతి ఏడాది మసీదులోనే వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. హిందూముస్లింలు ఉమ్మడిగా ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఒకసారి బక్రీద్, వినాయక చవితి ఒకేసారి వచ్చాయి. అప్పుడు ముస్లింలు నమాజ్ మాత్రమే చేసి, కుర్బానీ (గొర్రెలను బలిచ్చే ప్రక్రియ) కి దూరంగా ఉన్నారు.

## రెండు గంటల వర్షం.. 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. బీజేపీ ప్రభుత్వంపై విపక్షాల విమర్శలు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షం అతలాకుతలం చేసింది. సోమవారం సాయంత్రం ఢిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షానికి నగరం మొత్తం స్తంభించిపోయింది. ముఖ్యంగా హర్యానా రాష్ట్రం గురుగ్రామ్ నగరం అస్తవ్యస్తమైన విషయం తెలిసిందే. భారీ వర్షానికి ఢిల్లీ-గురుగ్రామ్ జాతీయ రహదారిపై దాదాపు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ తలెత్తింది. దీంతో వాహనదారులు రోడ్లపై ముందుకు కదలేక ఆరు గంటలపాటు నరకయాతన అనుభవించారు.

## తల్లిపై అభ్యంతరకర వ్యాఖ్యలు.. తొలిసారి స్పందించిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బిహార్‌లో నిర్వహిస్తోన్న ఓటర్ అధికార్ యాత్రలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, ఈ అంశంపై మోదీ మొదటిసారి స్పందించారు. ఆర్జేడీ-కాంగ్రెస్ వేదికపై చనిపోయిన తన తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమెకు రాజకీయాలతో ఏం సంబంధం అని ప్రశ్నించారు. కేవలం తన తల్లికి మాత్రమే కాదని, దేశంలోని ప్రతి తల్లికి, సోదరికి జరిగిన అవమానమని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు. బిహార్ ప్రభుత్వ జీవికనిధి శాఖ సహకార సంఘ్ లిమిటెడ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం కాన్ఫరెన్స్‌లో మోదీ మాట్లాడుతూ.. ఇటీవల బిహార్‌లో ఆర్జేడీ- కాంగ్రెస్ పార్టీ వేదికపై తన తల్లిని అవమానించారని అన్నారు. కొందరు తన తల్లిని దూషించారని, ఇది కేవలం ఆమెకు జరిగిన అవమానం మాత్రమే కాదని, దేశంలోని మహిళలందరికీ జరిగిన అవమానమని మండిపడ్డారు. ఆ వ్యాఖ్యలను తనను ఎంతగానో బాధించాయని, తనలాగే బిహార్ ప్రజలు కూడా ఆవేదన చెందారనే విషయం కూడా తెలుసని చెప్పారు.తమను పెంచేందుకు తన తల్లి హీరాబెన్ ఎంతో కష్టపడ్డారని మోదీ వివరించారు. 'అనారోగ్యాన్ని సైతం లెక్కచేయక మమ్మల్ని పెంచేందుకు అమ్మ కష్టపడుతూనే ఉండేది. ప్రతి పైసా కూడబెట్టి మాకు బట్టలు కొనేది.. దేశంలో మంది అలాంటి కోట్లాది మంది తల్లులు ఉన్నారు. తల్లి స్థానం చాలా గొప్పది' అని మోదీ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌లపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజ కుటుంబాల్లో పుట్టినవాళ్లు.. పేద తల్లి కష్టాలు, ఆమె కొడుకు చేసే పోరాటాలను అర్థం చేసుకోలేరని దుయ్యబట్టారు. గోల్డెన్ స్పూన్‌తో పుట్టిన వాళ్లంతా బిహార్‌లో తమ కుటుంబాలకే అధికారం దక్కాలనే స్వార్థంతో ఉన్నారని మోదీ ధ్వజమెత్తారు. పేద తల్లి కడుపున పుట్టిన బిడ్డను ప్రజలను ఆశీర్వదించి, ప్రధాన మంత్రిని చేస్తే... పెత్తందార్లు జీర్ణించుకోలేకపోతున్నారని మోదీ మండిపడ్డారు.కాగా, బిహార్‌లోని దర్భాంగా జిల్లాలో ఇటీవల రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్ నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ కార్యకర్తలు ప్రధాని, ఆయన తల్లిని ఉద్దేశించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఆరోపించింది. సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్ కాగా.. దీనిపై బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు.మరోవైపు, ఈ అంశంపై బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. 'ఇది అవమానం, ద్వేషం, క్రూరత్వం అన్ని పరిమితులను దాటింది. ఇది ఎంత తప్పు అంటే రాహుల్,తేజస్వి చెవులు పట్టుకుని క్షమాపణ చెప్పడానికి ప్రయత్నించినా బీహార్ ప్రజలు వారిని క్షమించరు. చాలా సిగ్గుచేటు' అని ఎక్స్‌లో బీజేపీ ట్వీట్ చేసింది. దీనికి కాంగ్రెస్ కౌంటర్ ఇస్తూ... కుట్రపూరితంగా బీజేపీ ఏజెంట్లు కాంగ్రెస్ కార్యక్రమంలోకి ప్రవేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖేరా అన్నారు. మా యాత్రతో నిరాశకు గురైన బీజేపీ.. ప్రజల దృష్టిని మళ్లించాలనుకుంటోందని ఆరోపించారు.

## అత్యాచారం కేసులో అరెస్టైన ఆప్ ఎమ్మెల్యే..
# పోలీసులనే కాల్చి కస్టడీ నుంచి పరార్



**న్యూఢిల్లీ-నవభూమి:** పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన ఎమ్మెల్యేపై వచ్చిన అత్యాచారం ఆరోపణలతో మంగళవారం రోజు ఉదయం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. జీపులో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్తుండగా.. ఎమ్మెల్యే అనుచరులు వచ్చి ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. ఈక్రమంలోనే పోలీసులపై కాల్పులు జరిపారు. ఎమ్మెల్యేకు కూడా గన్ ఇవ్వగా.. ఆయన కూడా పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. ఆపై అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయారు. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగిందంటే?

పటియాలాలోని సనూర్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న హర్మీత్ పఠాన్‌మజ్రాపై.. జిరాక్‌పూర్‌కు చెందిన ఓ మహిళ అత్యాచారం ఆరోపణలు చేసింది. ఈమేరకు ఎమ్మెల్యే హర్మీత్ సింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముఖ్యంగా తనకు విడాకులు అయ్యాయని చెబుతూ.. తనతో అక్రమ సంబంధం కొనసాగించాడని ఆరోపించింది. ఆ తర్వాత తనపై బెదిరింపులకు పాల్పడ్డట్లు వివరించింది. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఎమ్మెల్యేను అరెస్ట్ చేశారు. మంగళవారం రోజు ఉదయమే కర్నాల్ వెళ్లి మరీ ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు. జీపులో ఎక్కించుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్తుండగా.. మధ్యలో ఆయన అనుచరులు వచ్చారు. పోలీసుల వాహనాన్ని అడ్డుకుని కాల్పులు జరిపారు. ఎమ్మెల్యే పఠాన్‌మజ్రాను తమవైపు లాక్కొని ఆయనకు కూడా ఓ తుపాకీ ఇచ్చారు. ఆపై ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ కూడా పోలీసులపై కాల్పులు జరిపారు. చివరకు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు తీవ్ర గాయాలు కాగా.. వెంటనే వారిద్దరినీ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు మరికొంత మంది పోలీసులను పిలిపించుకుని మరీ.. ఎమ్మెల్యే, ఆయన అనుచరులను పట్టుకునేందుకు తీవ్రంగా గాలిస్తున్నారు.అయితే ఈ ఆరోపణలను ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ తీవ్రంగా ఖండించారు. ఇది తనపై జరిగిన రాజకీయ కుట్రగా అభివర్ణించారు. అరెస్టుకు ముందే ఫేస్‌బుక్‌లో ఓ వీడియోలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఆప్ సర్కారుపై కూడా తీవ్ర విమర్శలు చేశారు. పంజాబ్ వరదలను ఎదుర్కోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. ఢిల్లీలోని ఆప్ పంజాబ్‌ను చట్టవిరుద్ధంగా పాలిస్తోందని ఆరోపించారు.అయితే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడడం వల్లే తనను అరెస్ట్ చేయించారని హర్మీత్ పఠాన్‌మజ్రా అన్నారు. తన గొంతు నొక్కడానికే ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని చెప్పుకొచ్చారు. కానీ తాను మాత్రం ఇలాంటి వాటికి అస్సలే బెదరనని.. తాను చెప్పాలనుకున్నది, చేయాలనుకున్నది కచ్చితంగా చేస్తానని వివరించారు. ముఖ్యంగా ప్రజల తరపున పోరాడేందుకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటానని చెప్పుకొచ్చారు.

## పిల్లల్ని చదివించేదెలా.. 1వ తరగతికి
# రూ.7.35 లక్షల ఫీజు, పేరెంట్స్ ఆందోళన



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు.. తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్ల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. సామాన్యుల సంగతి పక్కన పెడితే.. నెలకు లక్షకుపైగా సంపాదించేవారు కూడా పిల్లల స్కూల్ ఫీజులు కట్టే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. అడ్డగోలుగా పెంచుతూ.. కట్టడి లేని ప్రైవేటు ఫీజులతో చదువుకోవడం కాకుండా చదువు'కొనడం' అవుతోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రతీ సంవత్సరం.. స్కూళ్లు ప్రారంభమయ్యే సమయంలో అధిక ఫీజుల గురించి ఆందోళనలు, నిరసనలు, వ్యతిరేకతలు వ్యక్తం అవుతూనే ఉంటాయి. ఆ తర్వాత అంతా గప్ చుప్ అయిపోవడంతో మళ్లీ ఏడాది వరకు ఫీజుల మాటే ఉండదు. తాజాగా కర్ణాటక రాజధాని బెంగళూరులోని ఓ స్కూల్‌లో ఒకటో తరగతికి రూ.7.35 లక్షల ఫీజుకు సంబంధించిన వివరాలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.బెంగళూరులోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్ ఫీజు వివరాలకు సంబంధించిన ఓ రిసిప్ట్.. సోషల్ మీడియాలో తెగ వైరల్ కావడంతో.. అది చూసిన తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకటో తరగతికే ఏడాదికి రూ. 7.35 లక్షలకు పైగా ఫీజు ఉంటే.. పిల్లలను చదివించేది ఎలా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. హార్దిక్ పాండ్యా అనే వ్యక్తి.. ఎక్స్‌లో పోస్ట్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 2025-26 అకడమిక్ ఇయర్‌కు సంబంధించిన ఫీజు స్ట్రక్చర్ షేర్ చేయడంతో ఇప్పుడు వైరల్ అవుతోంది.ఈ స్కూల్ ఫీజు రిసిప్ట్ నెట్టింట వైరల్ కావడంతో నెటిజన్ల తీవ్రంగా స్పందిస్తున్నారు. ఇలాంటి ఫీజులు ఉంటే.. ధనవంతులు కూడా తమ పిల్లలను అలాంటి స్కూల్‌లకు పంపించే పరిస్థితి ఉండదని పేర్కొంటున్నారు. ఏడాదికి రూ.50 లక్షల ప్యాకేజీ ఉండే.. సాఫ్ట్‌వేర్ జంటలు కూడా తమ ఇద్దరు పిల్లలను చదివించేందుకు.. ఫీజులు భరించడం చాలా కష్టమని ఒక నెటిజన్ కామెంట్ చేశాడు. విద్య అనేది ఒక ప్రాథమిక మానవ హక్కు అని.. ఈ రకంగా భారీగా ధరలు నిర్ణయించడం సమాజంలో భారీగా అసమానతలను పెంచుతుందని ఇంకో నెటిజన్ విమర్శించాడు.మరోవైపు.. స్కూల్ ఫీజులకు సంబంధించి నెట్టింట ఇంకో చర్చ కూడా జరుగుతోంది. స్థానిక స్కూల్ ఫీజులు, ఇంటర్నేషనల్ స్కూల్ ఫీజులకు మధ్య వ్యత్యాసాలను నెటిజన్లు చర్చిస్తున్నారు. బెంగళూరు నగరంలోని స్కూల్ ఫీజులు ఆకాశాన్ని అంటుతున్నట్లు అనిపించినా.. చెన్నైలోని అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏడాది ఫీజు రూ. 27 లక్షలు ఉందని మరికొందరు నెటిజన్లు పేర్కొన్నారు.

## భారత విపణిలో టెస్లాకు నిరాశే.. ఆశించిన స్థాయిలో లేని బుకింగ్స్..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంఛ్ చేసింది. ఎన్నో అంచనాలతో భారత విపణిలోకి అడుగుపెట్టిన టెస్లాకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం.

బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం.. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. ఎందుకంటే టెస్లా ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు గంటల్లోనే ఇన్ని కార్లను విక్రయిస్తుంది. దీంతో భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీకి చెందిన కీలక వ్యక్తులను ఊటంకిస్తూ బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది.టెస్లా భారత్‌లో ఈ ఏడాది 350 నుంచి 500 కార్లను డెలివరీ చేయాలని ప్లాన్ చేసుకుంది. ఇందు కోసం మొదటి బ్యాచ్ షాంఘై నుంచి ఈ నెల మొదట్లో భారత్‌కు చేరుకోవచ్చని సమాచారం. ఈ వాహనాల డెలివరీలను ప్రస్తుతానికి ముంబై, ఢిల్లీ, పుణే, గురుగ్రామ్ నగరాలకే పరిమితం చేయాలని కంపెనీ భావిస్తోంది. పూర్తి చెల్లింపుల తర్వాతే కార్లను డెలివరీ చేయనుంది.ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది.వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది టాక్.

## ఉత్తరాఖండ్‌కు రెడ్ అలర్ట్.. 10 జిల్లాల్లో పాఠశాలల మూసివేత




**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దేశరాజధాని ఢిల్లీ సహా ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, జమ్ము కశ్మీర్ తదితర రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలకు వాగులు, వంకలు, నదులు ప్రమాదకరస్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ము కశ్మీర్ రాష్ట్రాల్లో అనేక చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఈ భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ అలర్ట్ ఇచ్చింది. ఐఎండీ అలర్ట్‌తో అధికారులు అప్రమత్తమయ్యారు. అనేక జిల్లాల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు.ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్, ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికలతో అప్రమత్తమైన అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పలు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించారు. క్లౌడ్‌బరస్ట్‌లు, ఆకస్మిక వరదల దృష్ట్యా పౌరి గర్వాల్, ఉత్తరకాశి, చమోలి, రుద్రప్రయాగ్, నైనిటాల్, ఉధమ్‌సింగ్ నగర్, అల్మోరా, చంపావత్, పిథోరగఢ్, బాగేశ్వర్ జిల్లాల్లోని 12వ తరగతి వరకు ఉన్న అన్ని పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు.భారీ వర్షాలకు జనజీవనం స్తంభించిపోయింది. అనేక చోట్ల రోడ్లు, వంతెనలు కొట్టుకుపోయాయి. అనేక ఇళ్లు ధ్వంసమయ్యాయి. కొండచరియలు విరిగిపడటంతో అనేక రోడ్లు బ్లాక్ అయ్యాయి. కాంచన్ గంగా, భనేర్పాని, కామెడ, థానా థరాలి ప్రాంతంలోని అనేక మార్గాలను మూసివేసినట్లు చమోలి పోలీసులు తెలిపారు. మరోవైపు పరిస్థితి ప్రమాదకరంగానే ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
బుధవారం
03 । సెప్టెంబర్ । 2025



## ఆజాద్ మైదాన్ వదిలివెళ్లాలని ఉద్యమకారుడు మనోజ్‌కు నోటీసులు




ముంబై -నవభూమి: ఓబీసీ కేటగిరీలో మరాఠాలకు కోటా ఇవ్వాలని కోరుతూ సామాజి కార్యకర్త మనోజ్ జరాంజే ముంబైలో నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. మనోజ్‌తో పాటు అతని బృందానికి మంగళవారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆజాద్ మైదాన్‌ను విడిచి వెళ్లాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. నిరాహార దీక్ష ఇవ్వాల్టికి అయిదో రోజుకు చేరుకున్నది. నిరసన ప్రదర్శన కోసం కేవలం 5వేల మందికి పర్మిషన్ ఇవ్వగా, ముంబైలోని ఆజాద్ మైదాన్‌కు సుమారు 40 వేల మంది నిరసనకారులు చేరుకున్నట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. బాంబే హైకోర్టు మార్గదర్శకాలను బేఖాతరు చేయడం వల్ల ముంబై పోలీసులు ఇవాళ నోటీసులు ఇచ్చారు. ముంబై వీధుల నుంచి మరాఠా కోటా మద్దతుదారులు వెళ్లిపోవాలని హైకోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. మరాఠా కోటీ ఉద్యమం వల్ల ముంబై నగరం స్తంభించిపోయినట్లు కోర్టు చెప్పింది. మంగళవారం మధ్యాహ్నం వరకు సిటీ మొత్తం క్లీన్ కావాలని కోర్టు ఆదేశించింది.



## కవిత రాజకీయ భవిష్యత్తు తెలంగాణలో కొత్త సమీకరణ

తెలంగాణ రాజకీయాల్లో కొత్త వాతావరణం పుట్టుకొస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత తన పదవి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నారనే వార్తలు కేవలం గుసగుసలు మాత్రమే కాదు, వాస్తవానికి దారితీసే సంకేతాలు. ఈ పరిణామం కేవలం ఒక నాయకురాలి వ్యక్తిగత నిర్ణయం మాత్రమే కాదు, తెలంగాణ రాజకీయాల్లో ఏర్పడుతున్న కొత్త సమీకరణాలకు నాంది పలికే అవకాశం ఉంది. ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు, కవిత వ్యక్తిగత రాజకీయ జీవితం, కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించిన అంశాలు ఈ నేపథ్యంలో పరిశీలనీయంగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన బీఆర్ఎస్ పార్టీ, గత దశాబ్ద కాలంగా రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా ప్రభావితం చేస్తూ వచ్చింది. ఈ పార్టీని స్థాపించిన కే.చంద్రశేఖర్ రావు తన తెలివితేటలు, వ్యూహాత్మక ఆలోచనలతో 2014, 2018 ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో పటిష్ట స్థానం సంపాదించారు. అయితే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎదుర్కొన్న పరాజయం పార్టీ లోపల అసంతృప్తి విత్తనాలు నాటింది. ఎన్నికల తరువాత క్రమంగా బీఆర్ఎస్ లో చీలికలు వెలుగుచూస్తున్నాయి. కవిత సస్పెన్షన్ ఆ చీలికలలో ఒక పెద్ద మలుపు అని చెప్పవచ్చు.

కవిత రాజకీయ ప్రస్థానం ఎప్పుడూ ప్రత్యేక చర్చనీయాంశమే. రాష్ట్రంలో స్త్రీ శక్తిని ప్రతినిధ్యం వహించే ఒక ప్రధాన నాయకురాలిగా ఆమె పేరు నిలిచింది. నిబంధనలతోనో, పార్టీ నిర్ణయాలతోనో కట్టుబడి ఉండే నాయకురాలిగా కాకుండా, స్వతంత్ర వైఖరితో వ్యవహరించడమే ఆమె ప్రత్యేకత. పార్లమెంట్ సభ్యురాలిగా, ఎమ్మెల్సీగా, అంతర్జాతీయ వేదికలపై మహిళా ప్రతినిధిగా కవిత గుర్తింపు పొందారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆమె రాజకీయ జీవితం వరుస సవాళ్లను ఎదుర్కొంటూ సాగింది. ముఖ్యంగా డిల్లీ లిక్కర్ కేసు వివాదం, పార్టీ లోపలి అసంతృప్తి, అధిష్టానం తీసుకున్న నిర్ణయాలు కవిత భవిష్యత్తును అనేక ప్రశ్నార్థక చిహ్నాలతో నింపాయి.ఇటీవల బీఆర్ఎస్ అధిష్టానం ప్రకటించిన కవిత సస్పెన్షన్ పార్టీ లోపలే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైంది. పార్టీకి నష్టం కలిగించే విధంగా కవిత ప్రవర్తిస్తున్నారన్న కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారిక ప్రకటన వెలువడింది. కానీ ఈ నిర్ణయాన్ని కవిత అనుచరులు రాజకీయ ప్రతీకారంగా అభివర్ణిస్తున్నారు. కవితను ఒక విభిన్న స్వరంగా భావించే వారు ఆమె సస్పెన్షన్ వెనుక లోతైన అంతర్గత వ్యూహాలు ఉన్నాయని నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలోనే కవిత ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలనే నిర్ణయం తీసుకోవడం ఒక రాజకీయ సంచలనంగా మారింది.ఇక్కడ ఒక ముఖ్యమైన అంశం కవిత కొత్త పార్టీపై వస్తున్న ఊహాగానాలు. ఆమె అనుచరులు ఈ విషయాన్ని మరింత బలపరుస్తూ ఉన్నారు. త్వరలోనే కవిత కొత్త పార్టీ స్థాపనను ప్రకటిస్తారని వారు చెబుతున్నారు. కొత్త పార్టీ అనగానే అది కేవలం వ్యక్తిగత ఆవేశం కాదు, ఒక రాజకీయ ఖాళీని భర్తీ చేసే ప్రయత్నం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, బీజేపీ పెరుగుతున్నా, బీఆర్ఎస్ బలహీన పడుతున్నా, ఒక కొత్త శక్తికి స్థలం ఉంది. కవిత ఆ ఖాళీని ఆక్రమించాలనుకోవడం సహజమే.తెలంగాణ రాజకీయాల్లో మహిళా నాయకత్వం అనే అంశం కూడా ఈ సందర్భంలో కీలకమవుతుంది. ఇప్పటివరకు ఈ రాష్ట్రంలో పెద్ద స్థాయిలో మహిళా పార్టీలు లేదా స్త్రీ ఆధిపత్యం ఉన్న నాయకత్వం కనిపించలేదు. కవిత ఆ ఖాళీని తనదైన శైలిలో భర్తీ చేసే అవకాశం ఉంది. మహిళా సమస్యలు, యువత సమస్యలు, ఆవిష్కరణలు, సామాజిక ఉద్యమాలపై ఆమె దృష్టి పెట్టి కొత్త రాజకీయ అజెండాను సృష్టించగలరు. ఇది కేవలం ఆమెకే కాకుండా రాష్ట్ర రాజకీయాలకు కూడా ఒక కొత్త మలుపు అవుతుంది.కవిత నిర్ణయం బీఆర్ఎస్ భవిష్యత్తుపై కూడా విస్తృత ప్రభావం చూపుతుంది. ఇప్పటికే ఈ పార్టీ పరాజయంతో దెబ్బతిన్న మానసిక స్థితిలో ఉంది. నాయకత్వంపై విమర్శలు, కార్యకర్తల్లో అసంతృప్తి, ప్రతిపక్షాల పెరుగుతున్న ఒత్తిడి %ఖశ్రీశ్రీ ఎశీఎఎఱఅవఎ%, బీఆర్ఎస్ లో అస్థిరత వాతావరణం ఏర్పడింది. ఈ పరిస్థితిలో కవిత లాంటి సీనియర్ నాయకురాలు పార్టీని వదిలిపెట్టడం బీఆర్ఎస్ ఇమేజ్‌కు పెద్ద దెబ్బ అవుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తి వైదొలగడం మాత్రమే కాదు, పార్టీ లోపల ఉన్న అసమ్మతి స్వరాలన్నింటికీ ఒక ప్రేరణగా మారవచ్చు.అయితే కవిత కొత్త పార్టీ నిజంగా విజయం సాధిస్తుందా అన్న ప్రశ్నను విస్మరించలేం. తెలంగాణలో ఇప్పటికే మూడు ప్రధాన శక్తులు ఉన్నాయి. కాంగ్రెస్ అధికారంలో ఉంది, బీజేపీ కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించుకుంటూ రాష్ట్రంలో వృద్ధి చెందుతోంది, బీఆర్ఎస్ ఇంకా బలహీనమైందనిపించినా, గ్రామీణ స్థాయిలో మద్దతు ఉంది. ఈ పరిస్థితిలో ఒక కొత్త పార్టీకి స్థిరమైన స్థానం సంపాదించడం సులభం కాదు. కానీ రాజకీయాల్లో ఖాళీలు ఎప్పుడూ ఉండవు, కొత్త శక్తులు కొత్త పరిస్థితులను సృష్టించగలవు. కవిత కూడా తన వ్యూహాలను జాగ్రత్తగా అమలు చేస్తే, ముఖ్యంగా యువత, మహిళలను ఆకర్షించే విధంగా కొత్త పార్టీని తీర్చిదిద్దితే, ఒక కొత్త శక్తిగా నిలబడే అవకాశం ఉంది.మొత్తం మీద కవిత నిర్ణయం కేవలం వ్యక్తిగతం కాదు, తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు సంబంధించినది. ఒకవైపు బీఆర్ఎస్ బలహీనత, మరోవైపు కాంగ్రెస్ ఎదుగుదల, బీజేపీ వ్యూహాలు%ఖశ్రీశ్రీ ఎశీఎఎఱఅవఎ%, ఈ రాష్ట్ర రాజకీయాలు కొత్త దిశలో ప్రయాణిస్తున్నాయి. ఈ పరిస్థితిలో కవిత తన భవిష్యత్ కార్యాచరణను ప్రకటించడం ఒక కీలక ఘట్టం అవుతుంది. అది కేవలం ఆమె భవిష్యత్తునే కాకుండా, మొత్తం రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలు ఒక పార్టీ లేదా ఒక రాష్ట్ర భవిష్యత్తును మలుపు తిప్పగలవు. కవిత నిర్ణయం కూడా అలాంటి ఘట్టమే అవుతుందా అనే ప్రశ్నకు సమాధానం రాబోయే రోజుల్లో తెలుస్తుంది. కానీ ఈ పరిణామం తెలంగాణ రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన మలుపుగా మిగిలిపోతుందనడంలో సందేహం లేదు.

# టెక్నాలజీ వరమా...శాపమా?




ఇటీవల అమెరికాలో చోటుచేసుకున్న ఒక హృదయవిదారక ఘటన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. సెప్టెంబర్ 1 - 2025 న దిన పత్రికల్లో వచ్చిన ఈ వార్త చదివిన ప్రతివారూ తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. అమెరికాలో ఓ వ్యక్తి, తన వ్యక్తిగత సమస్యలకు చాట్‌జీపీటీ ఇచ్చిన సలహా నమ్మి, కన్నతల్లినే హత్య చేశాడు. ఈ సంఘటన ఒక్క కుటుంబాన్ని మాత్రమే కాకుండా, ఆధునిక టెక్నాలజీ వినియోగంపై సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది.

**టెక్నాలజీ అనుగ్రహమా? ప్రమాదమా?**

మనమందరం టెక్నాలజీని సౌకర్యాల కోసం వాడుతున్నాం. వృత్తిపరమైన పనుల నుంచి విద్య, వైద్య సలహాలు, వ్యక్తిగత సందేహాలు, సృజనాత్మకత వరకు అన్ని రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (%ూ×%) జీవితంలో ఒక భాగమైంది. కానీ అదే టెక్నాలజీ ఇచ్చిన తప్పుడు సలహావల్ల, నిండు జీవితం నాశనమై పోయింది. సెప్టెంబర్ 1, 2025 నాటి పత్రికల్లో వచ్చిన వార్తే దానికి ప్రత్యక్ష ఉదాహరణ.

**మానసిక సమస్యలు, వర్చువల్ ఆధారం**

ఈ సంఘటనలో హత్యకు పాల్పడిన వ్యక్తి మానసిక స్థితి అస్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణ సమస్యలు వచ్చినప్పుడు కూడా చాలా మంది స్నేహితులు, కుటుంబ సభ్యులు కాకుండా, ఆన్‌లైన్‌లో, ఏ ఐ ద్వారా సమాధానాలు వెతుకుతారు. ఇదొక కొత్త చెడ్డ అలవాటు. కానీ సమస్య ఏమిటంటే, ఏ ఐ



మోడల్‌లు వైద్యులు, మనోవైద్యులు లేదా చట్టపర నిపుణులు కాదని చాలామంది గుర్తించరు.

ఏ ఐ ఇచ్చిన సమాధానాలను మానసిక సమస్యలతో ఉన్నవారు తప్పుగా అర్థం చేసుకోవడం లేదా వక్రీకరించడం వల్ల తీవ్ర పరిణామాలు సంభవిస్తాయి. ఏఐ పరిమితులు.ఏఐ వ్యవస్థలు హింస, ఆత్మహత్య, హత్య వంటి విషయాలపై ప్రత్యక్ష సలహా ఇవ్వకుండా రూపొందించబడ్డాయి. అయినప్పటికీ, భాషలోని సంక్లిష్టత, యూజర్ మానసిక స్థితి, లేదా తప్పుగా అర్థం చేసుకోవడం వల్ల అనుకోని పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంది.

అందుకే ఏఐ ని మానసిక సమస్యలకు, వ్యక్తిగత విభేదాలకు లేదా న్యాయ సంబంధిత అంశాలకు ప్రత్యక్ష పరిష్కారంగా తీసుకోవడం పరమ మూరత్వం.

నైతిక బాధ్యత

ఈ సంఘటన మన ముందు మూడు ముఖ్యమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది:

1. దీనికి ఏఐ డెవలపర్ల బాధ్యత ఎంతవరకు ఉంటుంది? ఏఐ ఇచ్చే సమాధానాలు సురక్షితమా అని నిరంతరం పరీక్షించుకోవాల్సిన బాధ్యత ఎవరిది.?
2. ప్రభుత్వాల పాత్ర ఏమిటి? టెక్నాలజీ వినియోగానికి చట్టపరమైన నియంత్రణలు అవసరమా?
3. వ్యక్తుల బాధ్యత? ఎలాంటి టెక్నాలజీ అయినా, అది ఒక సాధనమే. దాన్ని ఎలా వాడాలో నిర్ణయించేది మనుషులే.

**భారతీయ సమాజానికి గుణపాఠం**

భారతదేశం కూడా డిజిటల్ యుగంలో వేగంగా దూసుకెళ్తోంది. విద్యార్థులు, యువత, ఉద్యోగులు.. అందరూ రోజువారీగా ఏఐ ని వాడుతున్నారు. ఈరోజు అమెరికాలో జరిగిన సంఘటన మనకు ఓ గట్టి హెచ్చరిక.మన పిల్లలు ఏఐ ని ఏ విధంగా వాడుతున్నారో తల్లిదండ్రులు గమనించాలి.మానసిక సమస్యలు వస్తే కౌన్సిలర్లు, వైద్యుల దగ్గర సహాయం పొందడం తప్పనిసరి.ఏఐ కేవలం ఒక ఉపకరణం మాత్రమే, అది మానవ సంబంధాల స్థానాన్ని భర్తీ చేయలేదని గుర్తుంచుకోవాలి.

**మానవ సంబంధాల ప్రాధాన్యం**

ఈ ఘటనలో ఒక విషాదం దాగి ఉంది. ఆ వ్యక్తి తన సమస్యలను తన భార్యతో, కుటుంబంతో లేదా స్నేహితులతో పంచుకుంటే ఈ దుస్థితి వచ్చేది కాదేమో. మానవ సంబంధాలను పక్కనబెట్టి, వర్చువల్ టెక్నాలజీని ఆశ్రయించడం ఎంత ఘోరానికి దారితీస్తుందో ఈ సంఘటన చెబుతోంది.

సెప్టెంబర్ 1, 2025 అమెరికా ఘటన ప్రపంచానికి ఒక కఠినమైన గుణపాఠం చెబుతోంది. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా, అది ఒక సాధనమే. మనిషి నైతికత, బాధ్యత, మానవత్వం లేకుండా టెక్నాలజీ వినియోగం ముప్పుకలిగిస్తుంది.

భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా ఉండాలంటే, ఏఐ పై అవగాహన, నియంత్రణ, మానవ సంబంధాలను బలోపేతం చేయడం చాలా అవసరం.

**సామాజిక బాధ్యత**

ఈ సంఘటనను కేవలం అమెరికాకు సంబంధించిన ఘటనగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఒక సామాజిక సమస్యగా చూడాలి. డిజిటల్ వేదికలు, సోషల్ మీడియా, ఏఐ మోడల్స్ అన్నీ మనుషుల మధ్య సంబంధాలను తగ్గిస్తూ, వాస్తవం కంటే వర్చువల్ ప్రపంచానికి ప్రాధాన్యం పెంచుతున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఒంటరితనం, మానసిక అస్థిరత, కుటుంబ విభేదాలు మరింతగా పెరిగే ప్రమాదం ఉంది. కాబట్టి సమాజం మొత్తంగా టెక్నాలజీని ఎలా వాడాలో అవగాహన కల్పించడం అత్యవసరం.

**భవిష్యత్ దారి**

టెక్నాలజీని పూర్తిగా నిరాకరించడం అసాధ్యం, అలాంటి అవసరం కూడా లేదు. కానీ సురక్షిత వినియోగానికి నిబంధనలు, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు తప్పనిసరి. విద్యా సంస్థల్లోనూ, ఉద్యోగ స్థలాల్లోనూ ఏఐ వినియోగంపై పాఠాలు ఉండాలి. పిల్లలు, యువత ఏఐ తో ఎలా వ్యవహరించాలో, దాని పరిమితులు ఏమిటో వారికి చెప్పాలి. ప్రభుత్వాలు నియంత్రణలు తీసుకువస్తే, కుటుంబాలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తే, వ్యక్తులు బాధ్యతతో వ్యవహరిస్తే టెక్నాలజీ నిజమైన అనుగ్రహంగా మారుతుంది. లేకపోతే పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశాలను కొట్టిపారేయలేం. తస్మాత్ జాగ్రత్త.

**- యండి. ఉస్మాన్ ఖాన్**
**సీనియర్ జర్నలిస్ట్**

# ఆఫ్ఘనిస్తాన్లో ప్రకృతి ఆగ్రహం, మానవ నిర్మిత విధ్వంసం



ఆఫ్ఘనిస్తాన్, గత వైభవానికి, ప్రస్తుత విషాదానికి ఒక నిలువుటద్దం. ఒకప్పుడు గొప్ప నాగరికతలు వర్ధిల్లిన ఈ భూమి, గడచిన నాలుగు దశాబ్దాలుగా నిరంతర యుద్ధాలు, అంతర్గత కలహాలు, మానవతా సంక్షోభాల కబంధ హస్తాల్లో చిక్కుకుంది. ఈ మానవ నిర్మిత విలయానికి ప్రకృతి ఆగ్రహం తోడైనప్పుడు, అది ఒక భయంకరమైన విషాదానికి దారి తీస్తుంది. 2025 ఆగస్టు 31న ఆఫ్ఘనిస్తాన్‌లో సంభవించిన భూకంపం అలాంటిదే. రిక్టర్ స్కేల్‌పై కేవలం 6.0 తీవ్రత ఉన్నప్పటికీ, ఈ భూకంపం 800 మందికి పైగా అమాయక ప్రజల ప్రాణాలను బలిగొంది. ఇది కేవలం ఒక ప్రకృతి వైపరీత్యం కాదు, మానవ వైఫల్యం, రాజకీయ నిర్లక్ష్యం, అంతర్జాతీయ సమాజ నిశ్శబ్ద వైఖరి కలగలిసి సృష్టించిన ఒక భయంకరమైన విషాదం.కారణాలు:

భూకంపాలు అన్ని దేశాల్లోనూ సంభవిస్తాయి. కానీ అవి కలిగించే విధ్వంసం ఆయా దేశాల భౌగోళిక మానవ నిర్మిత పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఆఫ్ఘనిస్తాన్ భూకంపాలకు నిలయంగా ఉండటానికి ప్రధాన కారణం దాని అసాధారణ భౌగోళిక స్థానం. ఈ దేశం ప్రపంచంలోనే అత్యంత క్రియాశీలక టెక్టోనిక్ ప్రాంతాలలో ఒకటైన భారత యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్ల మధ్య ఉంది. ఈ ప్లేట్లు నిరంతరం ఒకదానితో ఒకటి రాపిడికి గురవుతూ, భూమి లోపల తీవ్రమైన ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. ఈ ఒత్తిడి ఒక్కసారిగా విడుదలైనప్పుడు, భూకంపాలు సంభవిస్తాయి. ఇది ఒక శాశ్వత భౌగోళిక సత్యం. అయితే, 2025లో పక్టికాలో సంభవించిన భూకంప ప్రత్యేకత దాని తీవ్రత కాదు, దాని 'షాల్లో ఫోకస్'. భూకంపం భూమి ఉపరితలం నుంచి కేవలం 8-10 కిలోమీటర్ల లోతులో సంభవించడం వల్ల, దాని శక్తి



అత్యంత తీవ్రంగా ఉపరితలంపై వ్యాపించింది. లోతైన భూకంపం అయితే, దాని శక్తి భూమి లోపల కొన్ని వందల కిలోమీటర్ల వరకు విస్తరించి, ఉపరితలంపై తీవ్రత తగ్గుతుంది. కానీ ఇప్పుడు సంభవించిన భూకంప ఫోకస్ తక్కువ లోతులో ఉండటం వల్ల విధ్వంసం అనూహ్యంగా పెరిగింది. ఇది కేవలం ప్రకృతి ఆగ్రహం మాత్రమే కాదు, మానవత్వపు నిస్సహాయతను కూడా వెల్లడి చేసింది.విషాదాన్ని పెంచిన మానవ వైఫల్యం:

భూకంపం ప్రకృతి వైపరీత్యం కావచ్చు, కానీ ప్రాణనష్టం ఎక్కువగా ఉండటానికి కారణం మానవ వైఫల్యం. భూకంపాలు తరచుగా వచ్చే జపాన్, చిలీ, టర్కీ వంటి దేశాలు కూడా ఒకప్పుడు భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. కానీ ఆ దేశాలు గత అనుభవాల నుండి పాఠాలు నేర్చుకొని, కఠినమైన భవన నిర్మాణ నియమావళిని అమలు చేశాయి. సాధారణ గృహాలు కూడా భూకంపాల ఒత్తిడిని తట్టుకునేలా నిర్మించబడతాయి. కానీ ఆఫ్ఘనిస్తాన్‌లో పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నం. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ళు సాధారణంగా మట్టి, మట్టి ఇటుకలు, సరిగా పటిష్టం చేయని రాళ్లతో కట్టబడతాయి. ఒక చిన్న ప్రకంపన చాలు, మొత్తం గోడలు కూలిపోయి నిద్రలో ఉన్న ప్రజలను సమాధి చేస్తాయి.

ఈ బలహీనమైన నిర్మాణాలకు తోడు, పటిష్టమైన విపత్తు నిర్వహణ వ్యవస్థ లేకపోవడం, సహాయక చర్యలు ఆలస్యం కావడానికి ప్రధాన కారణం. దశాబ్దాలుగా కొనసాగుతున్న అంతర్యుద్ధాలు, రాజకీయ అస్థిరత, తీవ్రమైన ఆర్థిక క్షీణత దేశాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీశాయి. 2021లో తాలిబాన్ అధికారాన్ని చేపట్టిన తర్వాత అంతర్జాతీయ సమాజంతో సంబంధాలు తెగిపోయాయి. ఫలితంగా, అత్యవసర సహాయం ఆలస్యంగా చేరుకుంది. అలాగే, కొండ ప్రాంతాలు, దుర్గమమైన రహదారులు సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకోవడానికి అడ్డంకులుగా మారాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించడానికి అత్యంత కీలకమైన మొదటి కొన్ని గంటలు వృథా అయ్యాయి, ఫలితంగా ప్రాణనష్టం ఊహించనంతగా పెరిగింది.

**చరిత్ర నుండి మనం నేర్చుకున్నది ఏంటి?**

2025లో సంభవించిన ఈ భూకంపం ఆఫ్ఘనిస్తాన్‌కు కొత్త కాదు. ఈ దేశ చరిత్రలో అనేక విధ్వంసకర భూకంపాలు సంభవించాయి. ఉదాహరణకు 1998 తఖర్ భూకంపం, 2015 హిందూకుష్ భూకంపం, 2022 పక్టికా భూకంపం, 2023 హెరాత్ భూకంపం కూడా భారీ ప్రాణనష్టాన్ని మిగిల్చాయి. ఈ భూకంపాలు ఆఫ్ఘనిస్తాన్ ప్రజలకు సహజ విపత్తు అనేది కేవలం ఒక అత్యవసర పరిస్థితి కాదని, అది వారి జీవితంలో ఒక నిరంతర భాగమని స్పష్టం చేశాయి. ప్రతీసారీ విషాదం సంభవించినప్పుడు ప్రపంచ దేశాలు సహాయం కోసం ముందుకు వచ్చాయి, కానీ భవిష్యత్తు కోసం శాశ్వత పరిష్కారాలను అందించడంలో విఫలమయ్యాయి.

ఈ విషాదం నుండి మనం నేర్చుకున్నది ఏంటి? కేవలం విపత్తు జరిగినప్పుడు స్పందించడం కాదు, అది జరగకుండా నివారించడమే అసలైన పరిష్కారం. ముందుచూపుతో అడుగులు-ప్రపంచం సహకరించాల్సిన సమయం:

ఆఫ్ఘనిస్తాన్ ఈ విషాద వలయం నుండి బయటపడాలంటే, కేవలం అత్యవసర సహాయం సరిపోదు. అంతర్జాతీయ సమాజం దీర్ఘకాలికంగా, వ్యూహాత్మకంగా సహాయం అందించాలి. ఇది కేవలం ఆహారం, వస్త్రాలు, వైద్య సామాగ్రికి పరిమితం కాకుండా, దేశం యొక్క మౌలిక సదుపాయాలను తిరిగి నిర్మించడానికి విపత్తు నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరచడానికి ఉపయోగపడాలి. భూకంపాలను తట్టుకునేలా బలమైన నిర్మాణాలను ప్రోత్సహించాలి. స్థానిక సాంకేతికతలతో, తక్కువ ఖర్చుతో కూడిన ఇళ్లను నిర్మించడానికి వారికి సహాయం చేయాలి. అంతర్జాతీయ నిపుణులు ఆఫ్ఘనిస్తాన్ ఇంజనీర్లకు శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ మార్పు సాధ్యమవుతుంది. భూకంపాల గురించి ప్రజలకు ముందుగా హెచ్చరికలు జారీ చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. సహాయక బృందాలకు శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం, అత్యవసర సామాగ్రిని నిల్వ చేయడం చాలా అవసరం. పాఠశాలలు, గ్రామాలు, ఇతర సంస్థల ద్వారా భూకంపాల సమయంలో ఎలా వ్యవహరించాలో ప్రజలకు అవగాహన కల్పించాలి. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, అంతర్జాతీయ సమాజం మానవతా దృక్పథంతో ఆఫ్ఘనిస్తాన్‌కు సహాయం అందించాలి. తాలిబాన్ ప్రభుత్వం కూడా ప్రపంచ దేశాలతో తిరిగి సంబంధాలను ఏర్పరచుకొని, విపత్తు నిర్వహణకు అవసరమైన ఆర్థిక సాంకేతిక సహాయాన్ని పొందాలి. 2025 భూకంపం కేవలం ఆఫ్ఘనిస్తాన్‌కు మాత్రమే ఒక విషాదం కాదు. ఇది ప్రపంచ మానవత్వానికి ఒక పరీక్ష. ఈ విషాదం నుండి మనం పాఠాలు నేర్చుకొని, భవిష్యత్తులో వచ్చే భూకంపాలను తట్టుకునేలా ఆఫ్ఘనిస్తాన్‌కు బలం చేకూర్చాలి. లేకపోతే, భౌగోళిక శక్తులు మానవ దుర్బలత్వం కలిసి ఇలాంటి అనేక విషాదాలను సృష్టిస్తూనే ఉంటాయి.

**డి జె మోహన రావు**
**8247045230**


# యూరియా కొరత - రైతు సంక్షోభానికి ప్రతిబింబం




తెలంగాణ పల్లెలు ఈ వానాకాలంలో మళ్లీ ఒకే సమస్యతో విలవిల్లాడుతున్నాయి - అది యూరియా కొరత. వ్యవసాయంలో ఎరువుల అవసరాన్ని మాటల్లో చెప్పలేం. ఒక విత్తనం మొలకెత్తి పుష్టిగా పెరగడానికి, ఆకు పచ్చగా నిలవడానికి, దానిని మట్టిలో బలంగా నిలిపేందుకు యూరియా వంటి ఎరువులు అవసరం. అయితే ఈ అతి అవసరమైన ఎరువు అందుబాటులో లేక రైతులు తల పట్టుకునే పరిస్థితి నెలకొంది. ఇది కేవలం ఒక సాధారణ కొరత సమస్య కాదుబీ ఇది మన వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న లోతైన సంక్షోభానికి ప్రతిబింబం.ఈ సమస్యకు అనేక కోణాలున్నాయి. కేంద్రం నుంచి ఎరువుల పంపిణీ విధానం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయం, రామగుండం ప్లాంట్ ఉత్పత్తి లోటు, అంతర్జాతీయ మార్కెట్ ధరలు, దిగుమతి ఆలస్యం, సరఫరా కేంద్రాల్లో లంచాలు, బ్లాక్ మార్కెటింగ్ %-% అన్నీ కలిసిపోవడం వల్ల రైతు చివరికి తలబాధ పడుతున్నాడు. ఒక ఎకరానికి పంట వేసిన రైతు కనీసం నాలుగైదు సంచుల యూరియా కావాలి. కానీ ఒక సంచి కోసం గంటల తరబడి క్యూ లో నిలబడినా దొరకని దుస్థితి. దొరికినా, ఎంఆర్‌పి ధర కంటే ఎక్కువకు కొనేలా పరిస్థితులు.ఇక ఈ సమస్య కొత్తది కాదు. దాదాపు ప్రతి వానాకాలం వచ్చేసరికి రైతు మొదటి మాట లిలి"ఎరువు దొరుకుతుందా?"లిలి అన్నదే. ఈ ప్రశ్నకు ప్రభుత్వాల దగ్గర సరైన సమాధానం లేదు. అధికారికంగా చూస్తే రాష్ట్రానికి అవసరమైన యూరియా క్వోటా కేంద్రం కేటాయించినదానికంటే తక్కువగానే వస్తోంది. ఎక్కడో మధ్యలో రవాణా, సరఫరా ఆలస్యమవుతోంది. మరోవైపు, డిమాండ్ అనూహ్యంగా పెరుగుతుంది. పత్తి, వరి, మక్క, సోయా అన్నీ పంటలకు యూరియా అవసరం. రైతు పంట పండించాలన్న తపనతో ఎరువును వెతుక్కుంటూ తిరగాల్సి వస్తోంది.ఈ పరిస్థితి రైతు జీవితంపై ఎంతటి మానసిక ఒత్తిడిని మోపుతుందో ఊహించాలి. విత్తనం వేసిన తర్వాత వర్షం పడితే పంట మొలకెత్తుతుంది. మొలక ఎగసి రాగానే ఎరువులు వేయాలి. ఆ దశలో ఎరువులు అందుబాటులో లేకపోతే పంట దెబ్బతింటుంది. అంటే రైతు పెట్టిన మొత్తం ఖర్చు, శ్రమ, ఆశలు అన్నీ నీటిలో కలిసిపోతాయి. ఇది కేవలం ఆర్థిక నష్టమే కాదుబీ రైతు మనసులో ఓటమి భావన, నిరాశ, భవిష్యత్తుపై భయం పెరుగుతాయి. కొన్నిసార్లు రైతు ఆత్మహత్యల వెనుక కూడా ఇలాంటి నిర్లక్ష్యమే కారణం అవుతుంది.ఈ సమస్యలో రాజకీయ కోణం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. కేంద్రం రాష్ట్రానికి తగినంత యూరియా కేటాయించలేదని రాష్ట్రం ఆరోపిస్తుంది. రాష్ట్రం సరైన ప్రణాళికతో పంపిణీ చేయలేదని కేంద్రం వాదిస్తుంది. రైతు మాత్రం ఈ బరిలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాడు. అసలు ప్రశ్న ఏంటంటే - రైతు పంటను రక్షించడంలో ఎవరు ముందడుగు వేస్తారు? రైతు కష్టాన్ని తగ్గించడంలో ఎవరు నిజమైన శ్రద్ధ చూపుతారు?రామగుండం ఎరువుల కర్మాగారం తెలంగాణకు ఆశగా భావించబడింది. ఇది పూర్తిస్థాయిలో పనిచేస్తే రాష్ట్రానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుంది. కానీ ఇంధన సరఫరా సమస్యలు, యంత్రాంగ లోపాలు, నిర్వహణ సమస్యలు తరచుగా ఉత్పత్తిని ప్రభావితం చేస్తున్నాయి. ఫలితంగా స్థానిక అవసరాలకే సరిపడని స్థితి. అంతర్జాతీయంగా యూరియా దిగుమతులు కూడా తలపెట్టినంతగా లభించడం లేదు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచ ఎరువుల మార్కెట్‌లో సరఫరా సవాళ్లు పెరిగాయి. ఈ ప్రభావం భారత మార్కెట్‌పై కూడా పడుతోంది.ఈ సమస్యలో మరో ముఖ్యమైన అంశం బ్లాక్ మార్కెటింగ్. డిమాండ్ ఎక్కువ, సరఫరా తక్కువ అనే పరిస్థితిలో దళారీలు, మధ్యవర్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 266 కే సంచి దొరకాల్సి ఉండగా, రైతు అది రూ. 400-500కైనా కొనాల్సిన పరిస్థితి. ఈ దోపిడీని అరికట్టడానికి చట్టపరమైన చర్యలు ఉన్నా, వాటి అమలు తేలికగా ఉండడం లేదు. స్థానిక స్థాయిలో కొంతమంది అధికారులు, రాజకీయ నాయకుల మద్దతుతో ఈ బ్లాక్ మార్కెట్ సుస్థిరంగా కొనసాగుతోంది. రైతు మాత్రం బలవంతంగా దాని బారిన పడుతున్నాడు. మొదటిగా, యూరియా సరఫరాలో కేంద్రం-రాష్ట్రం మధ్య సమన్వయం తప్పనిసరి. ఎన్ని టన్నులు అవసరం అవుతాయి, ఎప్పుడు సరఫరా కావాలి, ఏ జిల్లాకు ఎంత పంపిణీ చేయాలి అన్నది ముందుగానే స్పష్టమైన ప్రణాళికతో ఉండాలి. రెండవది, రామగుండం వంటి దేశీయ ప్లాంట్లను పూర్తి సామర్థ్యంతో నడిపించాలి. అవసరమైతే కొత్త ఉత్పత్తి యూనిట్లను ఏర్పాటు చేయాలి. మూడవది, ఎరువుల ప్రత్యామ్నాయాలపై రైతులకు అవగాహన కల్పించాలి. సేంద్రీయ ఎరువులు, జైవ ఎరువులు, మిశ్రమ ఎరువులు ఇవన్నీ రైతుకు సహాయకం అవుతాయి. నాలుగవది, పంపిణీ వ్యవస్థలో పారదర్శకత ఉండాలి. ప్రతి రైతు అవసరమైనంత ఎరువును సమయానికి పొందేలా ఆధార్ ఆధారిత డిజిటల్ పద్ధతులను మరింత సమర్థంగా ఉపయోగించాలి. ఐదవది, బ్లాక్ మార్కెటింగ్‌కి పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పనిసరి.

చివరగా, రైతు నమ్మకాన్ని కాపాడటం అత్యంత ప్రధానమైంది. రైతు ఈ దేశానికి అన్నదాత. అతని సమస్యలను తేలికగా తీసుకుంటే, మన ఆహార భద్రతకే ప్రమాదం ఏర్పడుతుంది. యూరియా కొరతను కేవలం ఒక వాణిజ్య సమస్యగా కాక, రైతు జీవితమరణ సమస్యగా ప్రభుత్వాలు చూడాలి. పంట కాలం చిన్నదిబీ ఒక వారం ఆలస్యం రైతుకు సంవత్సరం నష్టంగా మారుతుంది.

కాబట్టి ఈ రోజు అవసరం - తక్షణ చర్య. ఎరువుల సరఫరాలో ప్రభుత్వాలు తమ బాధ్యతను నిర్లక్ష్యం చేయకుండా, సమగ్ర వ్యూహంతో ముందుకు రావాలి. రైతు కష్టాన్ని తగ్గించడమే నిజమైన రాజకీయ కర్తవ్యమని గుర్తించాలి. యూరియా కొరత ఇకపై పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం కనుగొనడం మనందరి కర్తవ్యంగా మిగలాలి.



## విమానాన్ని ఢీ కొట్టిన పక్షి.. ఎమర్జెన్సీ ల్యాండింగ్




**న్యూఢిల్లీ -నవభూమి:** ఇండిగో విమానాన్ని పక్షి ఢీ కొట్టింది దీంతో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఆ సమయంలో విమానంలో దాదాపు 270 మందికిపైగా ప్రయాణికులు ఉన్నారు. వారంతా సేఫ్‌గానే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇండిగోకు చెందిన 6%జు%812 విమానం మంగళవారం ఉదయం 272 మంది ప్రయాణికులతో నాగ్‌పూర్ నుంచి కోల్‌కతా బయల్దేరింది అయితే, విమానం టేకాఫ్ అయిన తర్వాత పక్షి ఢీ కొట్టింది. దీంతో అప్రమత్తమైన పైలట్ ముందు జాగ్రత్తగా విమానాన్ని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదని నాగ్‌పూర్ ఎయిర్‌పోర్ట్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. తనిఖీల అనంతరం మరిన్ని వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

# ఉపరాష్ట్రపతి నివాసాన్ని వీడిన దన్కడ్



**ముంబై-నవభూమి:** మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ దన?డ్ తన అధికారిక నివాసాన్ని ఖాళీ చేశారు. అయితే సర్కారు మాజీ ఉపరాష్ట్రపతికి కేటాయించిన ప్రభుత్వ బంగ్లాకు వెళ్లడానికి బదులుగా.. తన పాత స్నేహితుడైన ఇండియన్ నేషనల్ లోక్ దళ్ అధ్యక్షుడు అభయ్ చౌతాలా ఫామ్‌హౌస్‌కు మకాం మార్చారు. దీంతో దేశవ్యాప్తంగా మళ్లీ చర్చ మొదలైంది. అసలు ఆయన ఎందుకు సర్కారు బంగ్లాకు వెళ్లలేదు, స్నేహితుడి ఫామ్‌హౌస్‌కు ఎందుకు వెళ్లారని ప్రశ్నిస్తున్నారు. మదేశంలో రెండో అత్యున్నత రాజ్యాంగ పదవికి రాజీనామా చేసిన తర్వాత నుంచి దన?డ్ ఎక్కడా కనిపించలేదు. కానీ తాజాగా ఈయన ఇళ్ల మారడానే వార్త రావడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. జగదీప్ దన?డ్ సోమవారం రోజు సాయంత్రం తన అధికారిక నివాసాన్ని వీడినట్లు అధికారులు ప్రకటించారు. లాగే దక్షిణ ఢిల్లీ ఛతర్‌పూర్ గద్దైపూర్‌లో ఉన్న తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌కు మారినట్లు వెల్లడించారు. అయితే ఈ ప్రైవేటు ఫామ్‌హౌస్ జాతీయ లోక్‌దళ్ నేత అభయ్ చౌతాలాకు చెందినదని అధికారిక వర్గాలు తెలిపాయి. మాజీ ఉపరాష్ట్రపతిగా దన?డ్ ఢిల్లీలో టైప్-8 బంగళా పొందేందుకు అర్హులు. కానీ ఆయనకు అధికారిక బస ఏర్పాటు చేసే వరకు తాత్కాలిక ప్రాతిపదికన ఫామ్‌హౌస్‌లో నివసిస్తారని ఆ వర్గాలు వివరించాయి. అయితే అభయ్ చౌతాలాతో దన?డ్‌కు చాలా కాలంగా మంచి అనుబంధం ఉంది. అభయ్ చౌతాలా తాత, మాజీ ఉప ప్రధాన మంత్రి దేవిలాల్‌ను జగదీప్ దన?డ్ తన రాజకీయ గురువుగా భావిస్తారు. ఒకప్పుడు న్యాయవాదిగా ఉన్న దన?డ్‌ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది దేవిలాలే. వారి మధ్య ఉన్న బలమైన సంబంధాలను అభయ్ చౌతాలా కూడా ధ్రువీకరించారు. "మా ఇద్దరి మధ్య పాత కుటుంబ బంధాలు ఉన్నాయి. ఆయన మా కుటుంబ సభ్యుడి వంటివారు. ఆయన ఎక్కడికి మకాం మారుస్తున్నారని నేను అడిగినప్పుడు, ఆయన ఆలోచిస్తున్నానని చెప్పారు. నేను వెంటనే మా ఇంటిని తన ఇల్లుగా భావించి ఉండమని చెప్పాను. కొత్త అధికారిక నివాసం కేటాయించి సిద్ధమయ్యే వరకు ఆయన మా ఇంట్లోనే ఉండవచ్చు" అని అభయ్ చౌతాలా తెలిపారు. జులై 21వ తేదీన జగదీప్ దన?డ్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలను పేర్కొంటూ ఆకస్మికంగా పదవి నుంచి తప్పుకున్నారు. ఒక ఉపరాష్ట్రపతి.. పదవీ కాలం ముగియకముందే రాజీనామా చేయడం అసాధారణమైన విషయం కాగా అంతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన రాజీనామా వెనుక ఏదో పెద్ద కారణమే ఉందని ప్రతిపక్షాలు చెప్పుకొచ్చాయి. ముఖ్యంగా రాజీనామా తర్వాత నుంచి దన?డ్ బహిరంగంగా కనిపించకపోవడంతో.. అంతా ఆయనకు ఏమైందో చెప్పాలంటూ సర్కారును అడిగారు. ముఖ్యంగా అమిత్ షా, ప్రధాని మోదీలనే నేరుగా ప్రశ్నించారు. మాజీ ఉపరాష్ట్రపతిగా దన?డ్ కొన్ని ప్రత్యేక సౌకర్యాలకు అర్హులు. వీటిలో నెలకు రెండు లక్షల రూపాయల పెన్షన్, టైప్-8 బంగ్లాతో పాటు వ్యక్తిగత సిబ్బంది ఇతర సేవలు పొందవచ్చు. ప్రస్తుతం ఆయనకు ఏపీజే అబ్దుల్ కలాం రోడ్డులో ఒక టైప్-8 బంగ్లా కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే దానికి మరమ్మతులు చేసి.. నివాసయోగ్యంగా మార్చడానికి కనీసం మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఆయన అభయ్ చౌతాలా ఫామ్‌హౌస్‌లోకి మకాం మార్చారు. ఈ మూడు నెలలు ఆయన అక్కడే ఉండబోతున్నారు. మరోవైపు ఉపరాష్ట్రపతి భవనాన్ని ఆయన వారసుడి కోసం సిద్ధం చేస్తున్నారు.

## రైల్వే ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.కోటి ప్రమాద బీమా



**ముంబై-నవభూమి:** రైల్వే ఉద్యోగులకు భారతీయ రైల్వేస్ శుభవార్త చెప్పింది. ఉద్యోగులకు, వారి కుటుంబాలకు భారీ మొత్తంలో బీమా రక్షణ కల్పించింది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో దీనికి సంబంధించిన ఒప్పందం కుదిరినట్లు తెలిపింది. రైల్వే మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్ ఉన్న ఉద్యోగులు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.కోటి ప్రమాద బీమా కవరేజీని పొందనున్నారు. అంతేకాదు ఎస్‌బీఐ శాలరీ ఖాతాలు కలిగిన రైల్వే ఉద్యోగులు రూ. 10 లక్షల సహజ మరణ బీమాకు కూడా అర్హులే. ఎటువంటి ప్రీమియం చెల్లింపులు లేదా వైద్య పరీక్షలు లేకుండా ఈ బీమా రైల్వే ఉద్యోగులకు వర్తిస్తుందని రైల్వే మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. రైల్వేలో దాదాపు ఏడు లక్షల మంది ఉద్యోగులకు జీతాలు ఎస్‌బీఐ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. వారందరికీ ఈ బీమా ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. ఈ అవగాహన ఒప్పందం రూ.కోటి ప్రమాద బీమా కవర్‌తోపాటు పలు బీమా రక్షణలను కూడా అందిస్తుంది. వీటిలో రూ. 1.60 కోట్ల విమాన ప్రమాద మరణ కవరేజీ మొదలైనవి ఉన్నాయి. భారతీయ రైల్వేలకు వెన్నెముకగా ఉన్న శ్రామిక శక్తికి మద్దతు ఇచ్చేందుకే ఈ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## సీఎం సిద్ధూ సంచలన కామెంట్స్.. బీజేపీది రాజకీయ యాత్ర



**బెంగళూరు - నవభూమి:** బీజేపీ చేపట్టిన చలో ధర్మస్థల.. అదొక రాజకీయ యాత్ర అని, తద్వారా ఎలాంటి లాభం లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. కేవలం వారు రాజకీయలబ్ధికోసమే యాత్ర చేశారన్నారు. మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ధర్మస్థల, చాముండి కొండలు, దసరా ఉత్సవాల విషయంలో బీజేపి బూటకపు నిరసన సాగిస్తోందన్నారు.


బెంగళూరు: బీజేపీ చేపట్టిన చలో ధర్మస్థల.. అదొక రాజకీయ యాత్ర అని, తద్వారా ఎలాంటి లాభం లేదని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. కేవలం వారు రాజకీయలబ్ధికోసమే యాత్ర చేశారన్నారు. మైసూరులో మీడియాతో మాట్లాడిన ఆయన ధర్మస్థల, చాముండి కొండలు, దసరా ఉత్సవాల విషయంలో బీజేపీ బూటకపు నిరసన సాగిస్తోందన్నారు. హిందువులను ఆకర్షించుకోవాలని వారు ప్రయత్నిస్తున్నారన్నారు. అయితే అది తప్పు అని గుర్తిస్తారన్నారు. ధర్మస్థల పట్ల మాకు అపారమైన గౌరవం ఉందన్నారు. సిట్ ఏర్పాటు చేసినప్పుడు వ్యతిరేకించని బీజేపీ, ఇప్పుడు లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందన్నారు. తానూ ఓ హిందువేనని, మా పల్లెలో రామమందిరం నిర్మించలేదా అన్నారు. బాను ముస్తాక్ ఓ కన్నడ రచయిత్రి అని, అంతర్జాతీయస్థాయిలో గౌరవం పొందారని, ఆమెతో దసరా ఉత్సవాలు ప్రారంభించడంలో తప్పేముందన్నారు. చాముండి కొండలు హిందువుల ఆస్తి అనుకున్నా దసరా పండుగ నాడహబ్బ (రాష్ట్ర పండుగ) అని అందరూ కలసి జరుపుకొనే వేడుక అన్నారు.

## మాజీసీఎం ఈపీఎస్ సంచలన కామెంట్స్.. ఆయన ఏమన్నారంటే..



**చెన్నై- నవభూమి:** 'మక్కళై కాప్పోమ్. ..తమిళగత్తై మీడ్పోమ్' పేరుతో తాను చేపట్టిన పర్యటన వంద నియోజక వర్గాల్లో విజయవంతంగా పూర్తయిందని, అన్ని చోట్లా మహిళలు, యువత తనకు ఘనస్వాగతం పలుకుతున్నారని, వీరి స్పందన చూస్తుంటే శాసనసభ ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తామనే నమ్మకం కలుగుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. సోమవారం సాయంత్రం మదురై నగరం నుంచి రెండో విడత పర్యటన ప్రారంభిస్తున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి నియోజకవర్గంలోనూ తన రోడ్‌షోలకు లక్షలాదిమంది ప్రజలు వస్తుండడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున ఇప్పటికి 100 నియోజకవర్గాలలో ప్రచార పర్యటించానని చెప్పారు. జూలై 7న కోవై నియోజకవర్గం వర్గం మేట్టుపాళయంలో తన ప్రచారం ప్రారంభమైందని, ఇటీవలే ఆర్కాడు నియోజకవర్గంలో పర్యటన ముగించానని, దీంతో వంద నియోజకవర్గాల్లో పర్యటన పరిసమాప్తమైందని చెప్పారు.

## పోటెత్తుతున్న తుంగభద్ర..




**బెంగళూరు - నవభూమి:** తుంగభద్ర నదికి నీరు ఎక్కువగా పోటు ఎత్తడం రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రతిసారి నదికి నీరు పోటెత్తడం వల్ల నదిఒడ్డున వుండే మోటార్లలో నీరు చేరుకుని మోటార్లు ధ్వంసమై రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. నదికి గత రెండు మూడు రోజులుగా 80 వేలకుపైగా నీరు నదికి రావడంతో అధికారులు గంగావతి, కంప్లి మధ్య కోటే తుంగభద్ర వంతెన పై ఎప్పుడూ నిలబెడతారోనని ఆందోళన చెందుతున్నారు. ఈ యేడాది పలుసార్లు కోటే వద్ద వంతెనపై వాహనాలు బంద్ చేయడంతో చాలా వరకు ఇబ్బందులకు గురయ్యామని తెలిపారు. ప్రస్తుతానికి మాత్రం వంతెనపై రాకపోకలు బంద్ చేపట్టలేదు. ఏ సమయంలో నదికి నీరు ఎక్కువగా పోటెత్తుతాయోనని దిగులు

## మరాఠాల రిజర్వేషన్ల పోరుతో స్తంభించిన ముంబయి..



**న్యూఢిల్లీ -నవభూమి:** విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కోరుతూ మరాఠాలు చేపట్టిన నిరసనలతో ముంబయి నగరం అట్టుడుకుతోంది. సామాజిక ఉద్యమకారుడు మనోజ్ జరాంగే నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరింది. దీంతో మరాఠాల ఉద్యమం తీవ్రరూపం దాలుస్తోంది. ఈ నేపథ్యంలో స్పందించిన బాంబే హైకోర్టు .. తీవ్ర ట్రాఫిక్ జామ్‌కు కారణం కావడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం (సెప్టెంబర్ 2)లోగా ఆందోళనకారులు ముంబయి వీధులను విడిచి వెళ్లాలని ఆదేశించింది. ఆజాద్ మైదానంలో మరాఠా రిజర్వేషన్ల ఆందోళన నిర్వహించగా.. మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. దీంతో సీఎస్టీ, ఫోర్ట్, చర్చిగేట్ సహా అనే మార్గాల్లో ట్రాఫిక్ స్తంభించింది. పలుచోట్ల రహదారులపై బైఠాయించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై అసహనం వ్యక్తం చేసిన హైకోర్టు.. ఆందోళనకారుల తీరుపై మండిపడింది. శాంతియుతంగా నిరసనలు సాగించడం లేదని, నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని వ్యాఖ్యానించింది .ఈ క్రమంలో ఉద్యమకారుడు మనోజ్ జరాంగే పాటిల్, అతడి మద్దతుదారులు మంగళవారం మధ్యాహ్నంలోగా ముంబయి వీధులను ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆందోళనకారుల సంఖ్య 5 వేల మందికి మించరాదని హుకుం జారీచేసింది. అయితే, బ్రౌబర్నే లేదా వాంఖడే స్టేడియంలో ఆందోళనకు అనుమతించాలన్న మరాఠాల తరఫున లాయర్ అభ్యర్థనను తిరస్కరించింది. విచారణ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది, అడ్వకేట్ జనరల్ డాక్టర్ బీరేంద్ర సరాఫ్.. నిరసనకారులు ప్రతి నియమాన్ని ఉల్లంఘించారని, వారికి ఒక రోజు నిరసన తెలిపేందుకు అనుమతి ఇచ్చినప్పటికీ, గడువు ముగిసిపోయి, వెనక్కి తగ్గడానికి నిరాకరిస్తున్నారని ఎత్తి చూపారు. ఆజాద్ మైదానంలో ఆందోళన కొనసాగించడానికి పోలీసులు నిరసనకారులకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదని సరాఫ్ వివరించారు. కాగా, ఆందోళన కారణంగా ముంబయివాసులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేస్తుందో చెప్పాలని కోర్టు సరాఫ్‌ను పలుసార్లు అడిగింది. నిరసనకారుల నుంచి తీవ్రమైన బెదిరింపులు వస్తున్నాయని, వారిని బలవంతంగా పంపడానికి పోలీసులు ఏవైనా కఠినమైన చర్యలు తీసుకుంటే "ప్రతిచర్య ఉండొచ్చ అని సరాఫ్ వాదించారు. గణపతి ఉత్సవాల సమయంలో ప్రజల భద్రతను నిర్ధారించాల్సిన అవసరం ఉన్నందున ముంబయి విధుల్లో ఉన్న పోలీసులు ఇప్పటికే ఇబ్బందుల్లో ఉన్నారని, వీధుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా నిరసనకారులు రోడ్డుపై నుంచి వెళ్లిపోవాలని కూడా కోరుతున్నారని తెలిపారు. ఇదిలా ఉండగా తమ వర్గానికి 10 శాతం రిజర్వేషన్ల డిమాండ్ నెరవేరే వరకూ నిరసనలు విరమించబోమని, ముంబయి విడిచి వెళ్లేదిలేదని మనోజ్ జరాంగే తెగేసి చెప్పారు. శుక్రవారం ఒక్క రోజే 45 వేల మంది ముంబయికి చేరుకున్నట్టు పోలీసులు అంచనా వేశారు.

## భారత పర్యటనకు వచ్చిన జర్మన్ విదేశాంగ మంత్రి వాడేఫుల్



**బెంగళూరు - నవభూమి:** జర్మన్ విదేశాంగ మంత్రి జోహన్ డేవిడ్ వాడేఫుల్ రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం ఈ ఉదయం (మంగళవారం) బెంగళూరు చేరుకున్నారు. రేపు కూడా వాడేఫుల్ పర్యటన భారత్ లో కొనసాగుతుంది. ఆయన భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను సందర్శించి, ఆ తర్వాత ఢిల్లీకి బయలుదేరుతారు. రేపు (సెప్టెంబర్ 3)న కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్‌ను వాడేఫుల్ కలుస్తారు. ఆ తర్వాత న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తో సమావేశమవుతారు. అదే రోజు ఆయన జర్మనీకి తిరుగు ప్రయాణమవుతారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, ప్రపంచ వేదికపై భారతదేశం కీలక భాగస్వామిగా పోషిస్తున్న పాత్రను తన పర్యటనకు ముందు వాడేఫుల్ తన ఎక్స్ పోస్టులో వెల్లడించారు. జర్మనీ - భారత్ మధ్య సన్నిహిత రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను ఆయన తన సందేశంలో నొక్కిచెప్పారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఎంతో శక్తివంతమైందని కూడా వాడేఫుల్ అన్నారు. భద్రతా సహకారం, ఆవిష్కరణ, సాంకేతికత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు వంటి వాటిపై ద్వైపాక్షిక సంబంధాలు అత్యంత కీలకమని ఆయన వెల్లడించారు.

## మోదీకి పుతిన్ లిఫ్ట్.. గంట పాటు ఏకాంతంగా సంభాషణ..



**:షాంఘై-నవభూమి:** షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సుకు హాజరైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు ఒకే కారులో ప్రయాణించిన ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. ఎస్‌సీఓ సదస్సు ముగిసిన తర్వాత అక్కడ నుంచి వచ్చేస్తున్న సమయంలో పుతిన్ తన వాహనం ఆరుస్ లిమోజిన్‌లో మోదీకి లిఫ్ట్ ఇచ్చారు. ఓ హోటల్‌లో జరిగే రష్యా, ద్వైపాక్షిక భేటీకి ఇరువురూ కలిసి వెళ్లారు. మోదీ కోసం పుతిన్ దాదాపు 10 నిమిషాలు పాటు వెయిట్ చేసి.. ఆయన వచ్చిన తర్వాత కారులో ఎక్కించుకుని తీసుకెళ్లారు. ఈ సమయంలో ఇరువురి మధ్య సుమారు గంటపాటు వ్యక్తిగత సంభాషణ జరిగింది. ఇద్దరూ ఏం మాట్లాడుకున్నారనేది మాత్రం ఆసక్తికరంగా మారింది. అయితే, ఉక్రెయిన్ పరిష్కారం కోసం భారత్ శాంతికర్తగా వ్యవహరిస్తుండగా... పుతిన్‌తో 'మానవత్వం శాంతిని కోరుకుంటుంది' అని ప్రధాని మోదీ అన్నారు. డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలపై కూడా మాట్లాడినట్టు తెలుస్తోంది.

"ఇద్దరు నేతలు తమ బృంద సభ్యులు చేరాల్సిన హోటల్‌కు వెళ్లే మార్గంలో ముఖాముఖి సంభాషణను కొనసాగించారు. అయితే, హోటల్‌కు చేరుకున్న తర్వాత కూడా రష్యా అధ్యక్షుడు, మోదీలు కారు దిగలేదు.. 50 నిమిషాల పాటు సంభాషణను కొనసాగించారు" రష్యా జాతీయ రేడియో వెస్టిఎఫ్ఎంను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ నివేదించింది. ఆ తర్వాత క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ సైతం మోదీ, పుతిన్‌ల మధ్య దాదాపు గంటపాటు వ్యక్తిగత సంభాషణ సాగిందని ధ్రువీకరించారు. ఇదే సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా పుతిన్‌తో కలిసి లిమోజిన్‌లో కూర్చున్న ఫోటోను ఎక్స్‌లో షేర్ చేసి. 'ఎస్‌సీఓ సదస్సు వేదిక నుంచి హోటల్‌లో జరిగే భారత్, రష్యా ద్వైపాక్షిక సమావేశానికి పుతిన్, నేను కలిసి ప్రయాణించాం' అని తెలిపారు. అంతేకాదు, పుతిన్‌తో సంభాషణ ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటుంది అని మోదీ అన్నారు. మోదీ, పుతిన్ మధ్య సుదీర్ఘ వ్యక్తిగత చర్చను ముఖ్యమైనదిగా అభివర్ణించిన రష్యాకు చెందిన వ్యాఖ్యాతలు.. 'ఇతరుల చెవులల్లో పడకూడని సున్నితమైన అంశాలు' కూడా అందులో ఉండొచ్చని పేర్కొన్నారు. అనంతరం జరిగిన భారత్, రష్యా మధ్య అధికార చర్చల్లో ఉక్రెయిన్ యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించాలని పుతిన్‌ను ప్రధాని మోదీ కోరారు. శాశ్వత శాంతి సాధించడం మానవతా బాధ్యత అని ఆయన నొక్కిచెప్పారు. ఈ క్రమంలో రష్యా అధినేతను భారత్‌కు మోదీ ఆహ్వానించారు. డిసెంబరులో మోదీతో శిఖరాగ్ర చర్చల కోసం పుతిన్ భారత్‌కు రానున్నారు. ట్రంప్ సుంకాల బెదిరింపుల వేళ.. మోదీ, పుతిన్, జిన్‌పింగ్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.

## ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలు తగవు



**తియాన్జిన్ - నవభూమి:** ఈ ఏడాది ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని.. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్-సీవో) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ద్వంద్వ ప్రమాణాలు ఆమోదనీయం కాదన్న భారత వైఖరితో ఏకీభవించాయి. భారత ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, పలు దేశాల నాయకులతో తియాన్జిన్‌లో రెండురోజులుగా జరుగుతున్న ఎస్‌సీవో వార్షిక సదస్సు సోమవారం ముగిసింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలనే తమ దృఢ సంకల్పాన్ని ఎస్‌సీవో సభ్య దేశాలు ఈ సందర్భంగా ఒక ఉమ్మడి ప్రకటన ద్వారా వెల్లడించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద, తీవ్రవాద వ్యతిరేక పోరాటానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించాయి. అలాంటి గ్రూపులను స్వార్థ ప్రయోజనాలకు వాడుకునే ప్రయత్నాలు అంగీకారయోగ్యం కావని ఆ డిక్లరేషన్‌లో స్పష్టం చేశాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని.. దేశాల సరిహద్దులు దాటి వెళ్లే ఉగ్రవాదుల కదలికలను నిరోధించాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చాయి. అలాగే.. గాజాలో ఇజ్రాయెల్ సైనిక దాడులను, ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సైనిక దాడులను, పాక్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్ ఖుజ్దర్‌లో, జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన ఉగ్రదాడులను కూడా ఎస్‌సీవో సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇరాన్‌లోని పౌరులను, అణు కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల వల్ల ఎంతో మంది సామాన్యులు మరణించారని.. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను, ఇరాన్ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమేనని మండిపడ్డాయి. ఉగ్ర దాడుల వెనుక సూత్రధారులను, వారికి సహకరించినవారిని, దాడులకు పాల్పడినవారిని చట్టం ముందు నిలబెట్టి, కఠినంగా శిక్షించాలని ఎస్-సీవో సభ్యదేశాలు పేర్కొన్నాయి. ప్రపంచంలోని అన్ని ఉగ్రవాద గ్రూపులనూ ఉమ్మడిగా ఎదుర్కొనే విషయంలో కీలకపాత్ర ఐక్యరాజ్యసమితిదే అని తమ సంయుక్త ప్రకటనలో స్పష్టం చేశాయి.

ఎస్‌సీవో డిక్లరేషన్‌లో పహల్గాం ఉగ్రదాడి అంశం ఉండడం భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయం. ఎందుకంటే.. ఈ ఏడాది జూన్ 26న చైనాలోని చింగ్డావ్‌లో ఎస్‌సీవో సభ్యదేశాల రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఆ సమావేశానికి మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా హాజరయ్యారు. అయితే.. ఆ భేటీలో రూపొందించిన ముసాయిదా సంయుక్త ప్రకటనపై సంతకం చేయడానికి ఆయన నిరాకరించారు. బలూచ్ ప్రావిన్స్‌లో జరిగిన ఉగ్రదాడులను ఖండిస్తూ పాక్‌కు అనుకూలంగా రూపొందించిన ఆ ప్రకటనలో.. పహల్గాం ఉగ్రదాడి ప్రస్తావన లేకపోవడమే అందుకు కారణం. పహల్గాం దాడిని ఆ ప్రకటనలో చేర్చడానికి ఒక దేశం అభ్యంతరం వ్యక్తం చేసిందని.. చేర్చకపోవడంపై రాజ్‌నాథ్ ఆగ్రహం వెలిబుచ్చారని.. దీంతో ఆ ప్రకటన ఆమోదం పొందలేదని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ అప్పట్లో తెలిపారు. ఆ పరిణామం జరిగిన రెండు నెలల్లోనే.. పాకిస్థాన్, చైనా రెండూ సభ్యదేశాలుగా ఉన్న ఎస్‌సీవో పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ ఉమ్మడి ప్రకటన విడుదల చేయడం.. అంతటితో సరిపెట్టకుండా, సరిహద్దుల వద్ద ఉగ్రవాదుల కదలికలపై కన్నేసి ఉంచాలని పాకిస్థాన్‌కు పరోక్షంగా చురకలంటించే వ్యాఖ్యలు అందులో ఉండడం.. అలాంటి ప్రకటనపై పాక్‌తో పాటు, ఆ దేశంతో అంటకాగే చైనా కూడా సంతకం చేయడం.. భారత్ సాధించిన అతిపెద్ద దౌత్య విజయంగా విదేశాంగ వ్యవహారాల నిపుణులు పేర్కొంటున్నారు.

### భూకంపంతో నష్టపోయిన అఫ్గానిస్థాన్‌కు

## ఇండియా ఆపన్నహస్తం.. భారీ ఎత్తున సాయం




**అఫ్గానిస్థాన్ - నవభూమి:** అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భారీ భూకంపం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ భూకంపం వల్ల సుమారు 800 మందికి పైగా మరణించారని.. 2800 మందికి పైగా గాయపడ్డారని తెలుస్తోంది. భూకంప తాకిడికి విలవిల్లాడుతున్న అఫ్ఘానిస్థాన్‌కు భారతదేశం ఆపన్నహస్తం అందించేందుకు ముందుకు వచ్చింది. అఫ్గానిస్థాన్ భూకంప బాధితులను ఆదుకునేందుకు అత్యవసర సహాయక సామగ్రిని పంపింది. ఈమేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేసింది. భూకంపం సంభవించిన నేపథ్యంలో అఫ్గానిస్థాన్‌కు భారతదేశం మానవతా సహాయం అందిస్తోంది అని ప్రకటించింది. అలానే ఇండియా నుంచి అఫ్గాన్ పంపుతున్న సహాయక సామగ్రి ఉన్న ట్రక్కుల ఫోటోలను కూడా షేర్ చేసింది. వీటిల్లో బియ్యం బస్తాలు, ఇతర ఆహార పదార్థాలు ఉన్నాయి. ఈ కష్ట సమయంలో అఫ్గానిస్థాన్కు అండగా ఉంటామని భారతదేశం స్పష్టం చేసింది. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మోలజీ (ఎన్‌సీఎస్) ప్రకారం అఫ్గానిస్థాన్‌లో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలు మీద 6.3 నమోదైంది. పాకిస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలలో కూడా భూప్రకంపనలు సంభవించాయని తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ భూకంపం గురించి తాలిబాన్ అధికారి ఒకరు కీలక ప్రకటన చేశారు. ఇది గత దశాబ్దంలోనే అత్యంత తీవ్రమైన భూకంపం అని ప్రకటించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి అని తెలిపారు. అఫ్గానిస్థాన్‌లో భూకంపం నేపథ్యంలో.. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కీలక ప్రకటన చేశారు. విపత్తు గురించి అఫ్గాన్ విదేశాంగ మంత్రి మౌలవి అమీర్ ఖాన్ ముత్తఖితో మాట్లాడినట్లు తెలిపారు. భూకంపం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి జైశకంర్ సంతాపం తెలిపారు. అలానే అఫ్గానిస్థాన్‌కు భారత్ ఇప్పటికే సహాయక సామగ్రిని పంపిందని వెల్లడించారు. 1000 కుటుంబాలకు సరిపడా టెంట్లు, 15 టన్నుల ఆహార పదార్థాలను కాబూల్ నుండి కునార్‌కు తరలించామని చెప్పారు. భారత రాయబార కార్యాలయం ఈ సహాయక చర్యలను పర్యవేక్షిస్తోందన్నారు. ఈ మేరకు జైశంకర్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'నేడు అఫ్గానిస్థాన్ విదేశాంగ మంత్రి మౌలవి అమీర్ ఖాన్ ముత్తఖితో మాట్లాడాను. భూకంపం వల్ల ప్రాణాలు కోల్పోయిన వారికి మా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. భారతదేశం ఈరోజు కాబూల్‌లో 1000 కుటుంబాలకు సరిపడా టెంట్లు పంపింది. 15 టన్నుల ఆహార పదార్థాలను భారత మిషన్ ద్వారా కాబూల్ నుండి కునార్‌కు వెంటనే తరలిస్తున్నాము. రేపటి నుండి భారతదేశం నుండి మరింత సహాయక సామగ్రి పంపుతాము. భూకంపంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. ఈ కష్ట సమయంలో భారతదేశం అఫ్గానిస్థాన్‌కు అండగా ఉంటుంది' అంటూ జైశంకర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



## కాలిపోయే కాఫీలతో క్యాన్సర్

మనలో చాలా మందికి ఉదయాన్నే పొగలు కక్కే కాఫీ గొంతు దిగందే రోజు మొదలవ్వదు. అయితే 65 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించిన కాఫీలు, టీలతో నోరు కాలితే ఫర్వాలేదు. అత్యంత ప్రమాదకరమైన అన్నవాహిక క్యాన్సర్ ముప్పు పెరుగుతుందనే ఒక అధ్యయనం నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ అండ్ గ్లోబల్ స్టడీసలో ప్రచురితమైంది. పదే పదే అన్నవాహిక వేడి పానీయాలకు బహిర్గతమైనప్పుడు, ఇన్‌ఫ్లమేషన్ తలెత్తి, కణాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. నిజానికి వేడి పానీయాలు క్యాన్సర్ ముప్పును పెంచుతాయనే విషయం ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. కానీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గత కొన్నేళ్లుగా వేడి పానీయాలకూ, క్యాన్సర్‌కూ మధ్య ఉన్న సంబంధాన్ని అధ్యయనం చేస్తోంది. ఈ సంస్థ, 65 డిగ్రీలకు మించిన వేడి పానీయాలను క్యాన్సర్ కారకాలుగా వర్గీకరించింది. ఇక్కడ తాగే పానీయంతో సంబంధం లేదు. టీ, కాఫీ, గ్రీన్ టీ, సూప్, వేడి నీళ్లు... ఇలా 65 డిగ్రీలకు మించి వేడిగా ఉన్న ఏ పానీయాన్ని తాగినా అన్నవాహిక లోపలి పొర దెబ్బతిని, కణాల్లో మార్పులు చోటుచేసుకుని, ఆ పరిస్థితి క్యాన్సర్‌కు దారి తీస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. వేడి టీ లేదా నీళ్లు ఎక్కువగా తాగే అలవాటున్న ఇరాన్, చైనా, దక్షిణమెరికా ప్రజల్లో అత్యధికంగా అన్నవాహిక క్యాన్సర్ బయల్పడడాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ సందర్భంగా ప్రస్తావిస్తోంది. ఇలాంటప్పుడు ఎంత వేడి పానీయాలు తాగడం సురక్షితం అనే ప్రశ్న తలెత్తవచ్చు. పెదవులు కాలేంత వేడిగా ఉండే టీ లేదా కాఫీ కచ్చితంగా అన్నవాహికను కూడా కాలుస్తుందనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

## నవతార



# తొలి బధిర న్యాయవాది



కర్నాటక హైకోర్టులో ఏప్రిల్ 8న ఓ అరుదైన సంఘటన చోటుచేసుకుంది. బధిరురాలైన సారా సన్నీ అనే న్యాయవాది సంజ్ఞల (సైన్ లాంగ్వేజ్) ద్వారా తన వాదనలు వినిపించింది. సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటర్ సాయంతో సారా తన వాదనలు అద్భుతంగా వినిపించిందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ప్రశంసలు కురిపించారు. అంతేకాదు సంభాషణ, వినికిడి లోపం ఉన్న న్యాయవాది వాదనలు చోటుచేసుకున్న న్యాయస్థానంగా కర్నాటక హైకోర్టు కూడా చరిత్రలో నిలిచిపోయింది.

నిజానికి భారతదేశంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న తొలి బధిర న్యాయవాది సారా కావడం గమనార్హం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ కూడా భారతీయ న్యాయవ్యవస్థలో వివిధ నేపథ్యాలు ఉన్న మహిళల ప్రాతినిధ్యం పెరగాలని పదేపదే పేర్కొన్నారు. ఈ క్రమంలో శారీరక అవకరాలు ఉన్న భారతీయులు తమ ఆటంకాలను దాటుకొని ఏ రంగంలోనైనా రాణించవచ్చనడానికి సారా ఉదాహరణగా నిలిచిపోయింది. కేరళలోని కొట్టాయంకు చెందిన సారా బెంగళూరు సెయింట్ జోసెఫ్స్ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుకున్నది. న్యాయవాద వృత్తిని చేపట్టాలనేది ఆమె కల.

అంతేకాకుండా తనలా వినికిడి లోపం ఉన్నవాళ్లను ఈ రంగం దిశగా ప్రోత్సహించడానికి ఈ వృత్తిలోకి ప్రవేశించడం వెనక ప్రధాన ఉద్దేశం అంటారామె. ఇప్పుడామె నేషనల్ అసోసియేషన్ ఆఫ్ డఫ్ అండ్ ద హ్యూమన్ రైట్స్ లా నెట్‌వర్క్‌లో క్రియాశీలక సభ్యురాలిగా కూడా సేవలందిస్తున్నారు. 2023 సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టులో సారా తన వాదనలు అద్భుతంగా వినిపించింది. అలా సర్వోన్నత న్యాయస్థానంలో వాదించిన తొలి బధిర న్యాయవాదిగా కూడా చరిత్ర సృష్టించింది. ఈ కేసును భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వర్చువల్‌గా వినడం విశేషం. "జస్టిస్ చంద్రచూడ్ విశాల హృదయం తనలాంటి ఎంతోమందికి న్యాయవ్యవస్థలో ప్రవేశించడానికి ద్వారాలు తెరిచింది" అని సారా సంతోషం వ్యక్తం చేస్తున్నది.



## ఉదర సమస్య పోవాలంటే ఈ ధాన్యం అద్భుత ఔషదమట... !

తృణధాన్యలను తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి, ముఖ్యంగా ఒకప్పుడు అందరికీ పరిచయమైన తృణధాన్యాలను ఇప్పటి రోజుల్లో మరీ ఎక్కువగా తీసుకుంటున్నారు. బరువును తగ్గించుకునే విషయంగా చాలామంది తృణధాన్యాలను తీసుకంటున్నారు. ఈ పురాతన ధాన్యం మాటకొస్తే ఇందులో అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. పోషకాలు సవృద్ధిగా ఉన్న ఫారో తృణధాన్యం గురించి తెలుసుకుందాం.

ఫారో అంటే ఏమిటి?

1. ఇది చాలా పోషకమైనది.
2. అన్ని తృణధాన్యాల కంటే ఎక్కువ ఫైబర్ కలిగి ఉంటుంది.
3. ఇందులో అనేక రకాల ప్రయోజనకరమైన యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నాయి.
4. అనేక ఇతర మొక్కల ఆహారాలతో పోలిస్తే ఇది ప్రోటీన్ ఎక్కువగా ఉన్న ధాన్యం.
5. బరువు తగ్గడానికి ఇది ఆరోగ్యకరమైన ఆహారం

దీన్ని ఎవరు తినకూడదు?

ఫారో ఒక పురాతన ధాన్యం, ఇది వేల సంవత్సరాలుగా ప్రసిద్ధి చెందింది. ఇటీవల, దీనికి ప్రజాదరణ పెరిగింది. ఇది రుచికరమైనది మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. ఇందులో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. కూడా శుద్ధి చేసిన ధాన్యాలకు గొప్ప ప్రత్యామ్నాయం. దీనిని ఆహారంలో సులభంగా చేర్చుకోవచ్చు. బియ్యం, క్వినోవా, బుక్వీట్, బార్లీ వంటి ఇతర ప్రసిద్ధ తృణధాన్యాలకు ఇది గొప్ప ప్రత్యామ్నాయం. సలాడ్‌లు, సూప్‌ల వంటి వంటలలో తీసుకోవచ్చు. అయితే,ఫారో ధాన్యంలో సహజంగా గ్లూటెన్ కలిగి ఉంటుంది. అందువల్ల ఉదరకుహర వ్యాధి ఉన్నవారికి ఇది సరైనది కాదు. పురాతన ధాన్యాలపై జరిగిన పరిశోధనలో ఈ ఆరోగ్య సమస్య ఉన్న వారికి విషపూరితమైనవిగా తేలింది.

నాలుగు కప్పుల ధాన్యంలో
కేలరీలు: 170
కార్బోహైడ్రేట్లు: 34 గ్రాములు
కొవ్వు: 1 గ్రాములు
ఫైబర్: 5 గ్రాములుప్రోటీన్: 6 గ్రాములు
విటమిన్ (నియాసిన్): లో 20%
మెగ్నీషియం: %RDI% లో 15%
జింక్: RDI లో 15
ఇనుము: RDI% లో 4%

## విప్ప.. ఎంతో గొప్ప



విప్ప చెట్టు బెరడును మెత్తగా దంచి రసం తీసి 5 మి.లీ. చొప్పున సేవిస్తే మేహవాతం నొప్పులు, రక్తపిత్తం వాతం తగ్గిపోతాయి.

ఎండిన విప్ప పూవులను వెచ్చచేసి, కాపడం పెడితే, వృషణాల వాపు, నొప్పి తగ్గుతాయి.

విప్పనూనెను పైన రాస్తే, దురదలు, వాపు నశిస్తాయి. చిన్న పిల్లల చేతుల మీద తరుచూ వచ్చే దురదలు కూడా తగ్గిపోతాయి.

విప్ప వేరు, 10 గ్రాముల తపసి చె ట్టు వేరు, ఆముదం వేరు దంచి, 50 మి.లీ. నీటితో కలిపి వడబోసి ఆ రసాన్ని తాగిస్తే గర్భస్రావ సమస్యనుంచి బయటపడవచ్చు.

50 గ్రాముల విప్ప చెట్టు పట్టను దంచి 100 మి.లీ నీటిలో కాచి ఆ కషాయాన్ని వెర్రికుక్క కరిచిన రోజున 30 మి.లీ. చొప్పున రెండు మోతాదులు, ఆ మర్నాడు ఒక మోతాదు ఇస్తే హైడ్రోఫోబియా బారిన పడకుండా ఉంచవచ్చు.

**విప్ప నూనెను తల కుదుళ్లకు పట్టిస్తే చుండ్రు తగ్గుతుంది.**

విప్ప కాయలను నూరి లేపనంగా వేస్తే గజ్జి కురుపులు మానిపోతాయి. విప్ప బెరడును నములుతూ ఉంటే, చిగుళ్ల కణజాలం నశించిపోవడం వల్ల ఏర్పడే మచ్చలు తగ్గడమే కాకుండా, తీవ్రమైన పంటి నొప్పి కూడా తగ్గిపోతుంది. గుట్కా, జర్దా లాంటివి తినే వారికి ఇది మేలు చేస్తుంది.

మామిడి, నేరేడు, విప్ప మర్రి నీటి చిగుళ్లను ముద్దగా నూరి, 4 రెట్ల నువ్వుల నూనెలో వేసి కాచి ఆ తైలాన్ని చెవిలో వేస్తే చెవిలోని ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి.

## ఊడే జుట్టుకు టానిక్!







జుట్టు తెగ ఊడిపోతోంది.. పలుచబడిపోతోంది.. బట్టతల వచ్చేస్తుందేమో...! ఈ మధ్య ఏ ఇద్దరు కలిసినా ఇలా జుట్టు చుట్టూనే మాటలు, ముచ్చట్లు. కారణాలేవైనా కానీ కాస్త కేర్ తీసుకోకపోతే తిరిగిరాని సంపద కోల్పోవడం ఖాయం. ఆలోచనలు ఆపేసి, పోషకాహారం తినేసి, దాంతో పాటు ఇక్కడ చెప్పిన పద్ధతిని కూడా ఫాలో అయిపోండి. ఇది ఇంట్లోనే తయారుచేసుకునే హెయిర్ కేర్ టానిక్.

కావలసినవి: ఓ మాదిరి సైజు ఉల్లిపాయలు - ఐదు, పచ్చి తేనె - అర కప్పు(చిన్న కప్పు తీసుకోవాలి కొలతకు), ఎసెన్షియల్ ఆయిల్ - పది చుక్కలు (నచ్చిన ఫ్లేవర్).

తయారీ: ఉల్లిపాయల పొట్టు తీసి మిక్సీలో వేసి పట్టాలి. తరువాత ఉల్లిపాయరసాన్ని వడకట్టాలి.

ఉల్లిపాయ రసంలో తేనె వేసి బాగా కలపాలి. తేనె, ఉల్లిపాయ రసాల టెక్చర్‌లు వేరుగా ఉండడం వల్ల ఈ రెండూ కలిసేందుకు కొంచెం సమయం పడుతుంది.

అవి కలిశాక ఎసెన్షియల్ ఆయిల్‌ను వేసి కలిపితే హెయిర్ ట్రీట్‌మెంట్ టానిక్ రెడీ.

ఈ టానిక్‌ను మాడు, జుట్టుకి రాసుకుని 45 నిమిషాల పాటు మర్దనా చేయాలి. రాత్రంతా అలానే ఉంచుకుని మరుసటి రోజు ఉదయాన్నే తలస్నానం చేయాలి.

## బరువు తగ్గించే మసాలా



అల్లంలో కొవ్వును కరగించే గుణంతో పాటు, జీవ క్రియల్ని వేగవంతం చేసే శక్తి కూడా ఉంది. అల్లం దంచి రసం తీసి, పొయ్యి పైన బాగా మరిగించాలి. బాగా మరిగిన తర్వాత ఎంత రసం ఉంటే, అంతే మోతాదులో తేనె కలిపి మరికాసేపు మరిగించి దించేయాలి. చల్లారిన తర్వాత ఒక సీసాలో భద్రపరుచుకోవాలి. అందులోంచి ఒక స్పూను రసం తీసుకుని దానికి ఒక గ్లాసు వేడి నీళ్లు కలిపి, ఉదయం, సాయంత్రం తీసుకుంటే, బరువు తగ్గడంతో పాటు క్రమంగా పొట్ట కూడా కరిగిపోతుంది.

కొవ్వును కరిగించడం ద్వారా బరువు తగ్గించే మరో మసాలా దినుసు దాల్చిన చెక్క. ఇది బరువును తగ్గించడంతో పాటు రక్తంలోని చక్కెర నిలువల్ని కూడా అదుపులోకి తెస్తుంది.. బాగా మరిగిన నీళ్లల్లో అరస్పూను దాల్చిన చెక్క పొడి వేసి రెండు నిమిషాల తర్వాత దించేయాలి. ఆ రసాన్ని రోజూ రెండు సార్లు తాగితే స్థూలకాయం తగ్గుతుంది.

భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత ఒక స్పూను జీలకర్ర తినేస్తే జీర్ణక్రియ బాగా జరిగి బరువు తగ్గుతారు. జీలకర్రలో రక్తహీనత, అర్శ మొలలు, మతిమరుపు, నిద్రలేమి వంటి సమస్యల్ని తగ్గించే శక్తి కూడా ఉంది.

నల్లమిరియాల్లోని పెపరీన్‌కు కొవ్వు కరిగించే గుణం ఉంది. ఈ మిరియాలను రోజుకు రెండుసార్లు కాస్తంత బెల్లంతో తీసుకుంటే బరువు తగ్గుతారు.

## ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ షాపింగ్ చేస్తున్న మహిళల సంఖ్య..

2015 లో 1.5 కోట్లు
2020లో 7.5 కోట్లు

ఫ్యాషన్ ట్రెండ్స్ గురించి ఆన్‌లైన్‌లో షేర్ చేసుకుంటున్న మహిళల సంఖ్య గతేడాదితో పోలిస్తే 2020 నాటికి 110% పెరగనుంది.

2015లో 20%
2020లో 42%

గూగుల్‌లో సెకనుకొకరు నయా ఫ్యాషన్స్ గురించి సెర్చ్ చేస్తున్నారు.

ఆన్‌లైన్ రిటైల్ మార్కెట్‌లో ఫ్యాషన్ సెక్టార్ వాటా ఈ ఏడాది 20% ఉంటే.. వచ్చే ఏడాది నాటికి 23-25% వరకు పెరగనుంది.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ రెవెన్యూ వచ్చే ఏడాది 35-40% అధికంగా నమోదయ్యే అవకాశం ఉంది.ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులదే రాజ్యం. అయితే 2020 నాటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ కస్టమర్లలో ప్రతి ముగ్గురిలో ఒక్కరు లైఫ్‌స్టయిల్-ఫ్యాషన్ ప్రొడక్ట్స్ కొనుగోలు చేస్తారని అంచనా.



## చీరకు మల్లే జీరాడుతూ

సల్వార్, కమీజ్ అంటే కొన్నాళ్ల క్రితం వరకు కూడా కమీజ్ పొడవు మోకాళ్ల వరకో లేదో కాస్త కిందుగానో ఉండాల్సిందే. కాని ఎప్పుడూ ఒకేలాంటి డ్రస్ డిజైన్లతో విసుగెత్తిపోయి కమీజ్ పొడవును ఏకంగా పెంచేశారు డిజైనర్లు. అలా పెరిగి పెరిగి ఆ పొడవు చివరకు ఎంత వరకు వచ్చిందంటే పాదాలమీద జీరాడేవరకు. అచ్చం చీర కుచ్చుళ్లకు మల్లే. వీటికిందకు సల్వార్‌కు బదులుగా లాంగ్‌స్కర్ట్స్, లూజ్‌గా ఉండే పారలల్ ప్యాంట్ల వంటివి వేసుకుంటున్నారు. ఏ మోడల్ అయితేనేం కాని జోడీ బాగా కుదిరింది ఈ స్టయిల్‌కు.

ఆన్‌లైన్‌లో ఫ్యాషన్ మంత్ర

ఆన్‌లైన్ అలవాటయ్యాక ఫ్యాషన్ మంత్రం పఠించేవాళ్ల సంఖ్య పెరిగిపోయింది. ఒక్క క్లిక్‌తో నచ్చిన కాస్ట్యూమ్స్ వచ్చేస్తుండటంతో ఆన్..లైన్స్ ఆర్ బిజీ అయిపోతున్నాయి. ఓ కన్సల్టింగ్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆన్‌లైన్ అంగట్లో ఫ్యాషన్ పొటెన్షియల్ ఏ రేంజ్‌లో ఉందో వెల్లడైంది.









## సూచీలకు జీడీపీ జోష్




**ముంబై-నవభూమి:**గత వారం వరుసగా మూడు రోజులు నష్టాలు చవిచూసిన భారత స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మళ్లీ లాభాల బాటపట్టాయి. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 554.84 పాయింట్లు ఎగిసి 80,364.49 వద్దకు చేరగా.. నిఫ్టీ 198.20 పాయింట్ల వృద్ధితో 24,625.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.2 లక్షల కోట్లు పెరిగి రూ.448.85 లక్షల కోట్లకు (5.09 లక్షల కోట్ల డాలర్లు) చేరింది. ఐటీ, ఆటో, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో వాల్యూ బైయింగ్ మార్కెట్ ర్యాలీకి దోహదపడింది. జూన్‌తో ముగిసిన క్వార్టర్‌లో జీడీపీ వృద్ధి రేటు 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 7.8 శాతానికి వృంజుకోవడంతో పాటు ఈవారంలో జరగనున్న జీఎస్టీ మండలి సమావేశంలో ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల తగ్గింపునకు ఆమోదం లభించవచ్చని.. దీంతో ఆర్థిక వ్యవస్థలో వినియోగం మరింత పెరగనుందన్న అంచనాలు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచాయని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు.

## ఐటీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. టీసీఎస్‌లో జీతాలు పెంపు.. సెప్టెంబర్ నెల నుంచే వర్తింపు



**ముంబై-నవభూమి:**దేశీయ ఐటీ సేవల కంపెనీల్లో అతిపెద్దదైన టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తమ ఉద్యోగులకు శుభవార్త అందించింది. తమ ఉద్యోగుల వేతనాలు పెంచింది. ఉద్యోగి పని తీరు, కేటగిరీని బట్టి 4.5 శాతం నుంచి 7 శాతం వరకూ వేతనాలు పెంచినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు సంబంధించిన ఇంక్రిమెంట్ లెటర్లను తమ సిబ్బందికి సోమవారం సాయంత్రం నుంచే టీసీఎస్ పంపించడం మొదలు పెట్టినట్లు ఈ వ్యవహారానికి సంబంధం ఉన్న వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియా సంస్థలు పేర్కొన్నాయి. ఈ పెంపు సెప్టెంబర్ నెల నుంచే వర్తిస్తుందని తెలిపినట్లు వెల్లడించాయి.ఈ ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమ ఉద్యోగుల్లో 2 శాతం అంటే దాదాపు 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామని ఇటీవలే టీసీఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఐటీ, టెక్ రంగంలోని ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అయితే, లేఆఫ్స్ ప్రకటనల వేళ తమ ఉద్యోగులకు జీతాలు పెంచుతూ వెంటనే అమలులోకి తీసుకురావడం గమనార్హం. సీ3ఏ, దానికి సమానమైన గ్రేడ్లలో పని చేస్తున్న ఉద్యోగుల్లో అర్హులైన అసోసియేట్స్‌కు ఈ వేతన పెంపు ఉంటుందని ఉద్యోగులకు పంపించిన ఇంక్రిమెంట్ లెటర్లు, ఇ-మెయిల్స్‌లో టీసీఎస్ ఉన్నతాధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది.మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025- 26లో ఏకంగా 12,261 మంది సిబ్బందిని తొలగించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు టీసీఎస్ సీఈఓ కృతివాసన్ కొద్ది రోజుల క్రితమే వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా తమ ఆఫీసుల్లో పని చేస్తున్న ఉద్యోగులపై ఈ వేటు ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత 30 వేల మందికిపైగా తొలగిస్తున్నారని, కొత్త వారిని ఆన్‌బోర్డింగ్ జాప్యం చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలను ఆయన ఖండించారు. ముందుగా చెప్పినట్లుగానే 12 వేల మంది వరకు మాత్రమే ఈ తొలగింపులు ఉంటాయన్నారు.అంతర్జాతీయ అనిశ్చితులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాకేంతికతలో మార్పుల కారణంగానే ఈ తొలగింపులు చేయాల్సి వస్తున్నట్లు టీసీఎస్ సీఈఓ కృతివాసన్ తెలిపారు. ఐటీ రంగంలో అతిపెద్ద సంస్థగా కొనసాగుతున్న టీసీఎస్ లోనే ఇలా భారీ స్థాయిలో లేఆఫ్స్ జరుగుతుండడం ఇతర కంపెనీల పైనా ప్రభావం ఉంటుందని విశ్లేషకులు అంచనా వేశారు. ఇతర ఐటీ, టెక్ కంపెనీలు సైతం టీసీఎస్ దారిలోనే నడిచి భారీ ఎత్తున లేఆఫ్స్ చేపట్టవచ్చని చెబుతున్నారు. అయితే, ఇప్పటి వరకు దేశీయ కంపెనీల నుంచి లేఆఫ్స్ ప్రకటనలు రాకపోవడం ఊరట కల్పించే అంశం.

## హైదరాబాద్‌లో ఇల్లు, ఫ్లాట్ కొంటున్నారా?

### తెలంగాణ రెరా చట్టం రూల్స్ ఇవే.. కచ్చితంగా తెలుసుకోండి

TS RERA

**ముంబై-నవభూమి:** స్థిరాస్తి రంగంలో పారదర్శకత పెంచేదుకు, మోసాలను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం రెరా చట్టం అమలు చేస్తోంది. దీంతో రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు సంబంధించిన పూర్తి వివరాలు ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంటాయి. నిబంధనలు అతిక్రమించడం, మోసాలకు పాల్పడినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటారు. కొత్తగా ల్యాండ్ లేదా ఇల్లు, అపార్ట్‌మెంట్ కొనాలని ప్లాన్ చేస్తున్న వారు ముందుగా రెరా చట్టం కింద రిజిస్టర్ అయ్యిందో లేదో తెలుసుకోవాలి. తెలంగాణలో రెరా చట్టం నిబంధనలు ఎలా ఉన్నాయి? ఎలాంటి ప్రాజెక్టులకు రెరా చట్టం వర్తిస్తుంది? అనే వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**రియల్ ఎస్టేట్ డెవలపర్లు పాటించాల్సిన రూల్స్**

స్థిరాస్తి రంగ ప్రాజెక్టుల విస్తీర్ణం 500 చదరపు మీటర్లు అంత కంటే ఎక్కువ ఉండడం లేదా 8 యూనిట్ల కంటే ఎక్కువ ఉన్నప్పుడు కచ్చితంగా స్థానిక అధికారుల అనుమతి కావాలి. రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్లాట్లు లేదా అపార్ట్‌మెంట్లు విక్రయాలు, బుకింగ్స్, ప్రచార కార్యక్రమాలు చేపట్టకూడదు. రిజిస్ట్రేషన్ లేకుండా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తే చట్ట పరంగా చర్యలు ఎదుర్కోవలసి వస్తుంది.

ఇళ్లు, భూములు కొనుగోలు చేసే వారికి రక్షణ, భరోసా కల్పించేందుకు స్థిరాస్తి రంగ ప్రాజెక్టులన్నీ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, టీజీఐఐసీ సంస్థల ఆమోదం పొందాల్సి ఉంటుంది.

స్థిరాస్తి ప్రాజెక్టుల ప్రచార కార్యక్రమాలు, బ్యానర్లలో రెరా రిజిస్ట్రేషన్ నంబర్ కచ్చితంగా చూపించాలి.

రెరా చట్టం కింద రిజిస్టర్ కాని ప్రాజెక్టులు గుర్తించినట్లయితే సెక్షన్ 3(1), 4 కింద వాటికి షోకాజ్ నోటీసులు జారీ చేసి 15 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని రెరా ఆదేశిస్తుంది.

రెరా రూల్స్ ఉల్లంఘించడం, నిర్లక్ష్యం వ్యవహరించడం వంటివి గుర్తిస్తే సెక్షన్ 59 కింద పెనాల్టీ విధిస్తారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, బ్రోకర్లు, మధ్యవర్తులు సైతం రెరాలో రిజిస్టర్ అయి ఉండాలి.


రెరా రిజిస్ట్రేషన్ లేకుండా వ్యాపారాలు నిర్వహించడం అనేది నేరం. నిబంధనలు పాటించకపోతే రోజుకు రూ. 10 వేల వరకు పెనాల్టీ కట్టాలి.

రెరా అథారిటీ నోటీసులు పంపించినా పట్టించుకోకుండా ఉల్లంఘనలు కొనసాగిస్తే ప్రాజక్టు విలువలో 5 శాతం వరకు జరిమానా కట్టాల్సి వస్తుంది. అంతే కాదు కొన్నిసార్లు జైలు శిక్ష కూడా పడవచ్చు.

రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రెరా చట్టం నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తిస్తే 040-29394972 నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. 9000006301 వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. %rera-maud@telangana.gov.in,secy-rera-maud@telanagana.gov.in% మెయిల్ చేయవచ్చు. సరైన ఆధారాలు సమర్పించినట్లయితే వెంటనే చర్యలు తీసుకుంటారు.

## హోండా ఎలివేట్ కోసం హోండా కార్స్ ఇండియా నూతన ఇంటీరియర్ ఎంపికలు


### స్టైలింగ్ అప్‌గ్రేడ్‌లతో పండుగ సీజన్ అప్‌గ్రేడ్‌లను పరిచయం చేస్తోంది




**ముంబై-నవభూమి:**కొత్త –
గ్రేడ్: ఇప్పుడు సంపన్నమైన ఐవరీ, బ్లాక్ టూ-టోన్ ప్రీమియం ఇంటీరియర్‌లు, నూతన ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌తో అందుబాటులో ఉంది
V VX గ్రేడ్‌లు: కొత్త బ్లాక్ ఫాబ్రిక్ అప్‌హోల్‌స్టరీ, ఐవరీ ఇన్సర్ట్‌లు ఐచ్ఛిక ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌లితో రిఫ్రెష్ అయ్యింది
బ్లాక్ ఎడిషన్: రెండు స్టైళ్లు – క్రోమ్/సిల్వర్ యాక్సెంట్‌లు, స్టాండర్డ్ గ్రిల్‌తో బ్లాక్ ఎడిషన్, బ్లాక్-అవుట్ స్టైలింగ్ కొత్త ఐచ్ఛిక ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌తో సిగ్నేచర్ బ్లాక్ ఎడిషన్
V, VX ట్రిమ్‌ల కోసం క్రిస్టల్ బ్లాక్ పెరల్ కలర్ ఆప్షన్ అందుబాటులో ఉంది
భారతదేశం: భారతదేశంలో ప్రీమియం కార్ల తయారీలో అగ్రగామిగా ఉన్న హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ నేడు తన ప్రధాన ఎస్‌యూవీ హోండా ఎలివేట్‌కు ఉత్తేజకరమైన అప్‌డేట్లను ప్రకటించింది. నూతన అప్‌డేట్లలో తాజా ఇంటీరియర్ కలర్ ఎంపికలు, ఎక్స్‌టీరియర్ స్టైలింగ్ అంశాలు, పండుగ సీజన్ కోసం SUV ప్రీమియం ఆకర్షణ, బోల్డ్ క్యారెక్టర్‌ను పెంచే లక్ష్యంతో ప్యాకేజీలు ఉన్నాయి.ఇప్పుడు, హోండా ఎలివేట్ ZX గ్రేడ్ ఐవరీ లెథరెట్ సీట్లు, డోర్స్ లైనింగ్‌పై ఐవరీ సాఫ్ట్ టచ్ ఇన్సర్ట్‌లు, ఇన్‌స్ట్రుమెంట్ ప్యానెల్‌పై కొత్త ఐవరీ ఇంటీరియర్ థీమ్‌తో వస్తోంది. దాని ప్రీమియం అనుభూతిని పెంచుతూ, ZX గ్రేడ్ కొత్త ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌ను ఐచ్ఛిక లక్షణంగా అందిస్తోంది. ఇది మునుపటి ప్రొఫైల్‌కు మరింత కమాండింగ్, స్టైలిష్ రూపాన్ని ఇస్తుంది. వినియోగదారులు కొత్తగా ప్రవేశపెట్టిన 360ఔ సరౌండ్ విజన్ కెమెరా, రిథమిక్ 7-కలర్ యాంబియంట్ లైటింగ్‌ను అదనపు ఎంపికలుగా కూడా ఎంచుకోవచ్చు. ఐవరీ అప్‌హోల్‌స్టరీ ఎంపికను ప్రవేశపెట్టడంతో, ఎలివేట్ ‌ ఇప్పుడు మూడు విభిన్న ఇంటీరియర్ ఎంపికలతో వస్తుంది – టాన్, ఐవరీ బ్లాక్ (బ్లాక్ ఎడిషన్‌లో). 15,51,000 (ఉదా. షోరూమ్ ఢిల్లీ)

అదే విధంగా ZX VX గ్రేడ్‌ల కోసం, ఎలివేట్ ఇప్పుడు మునుపటి షాడో బీజ్ అప్‌హోల్‌స్టరీ స్థానంలో కొత్త బ్లాక్ ఫాబ్రిక్ అప్‌హోల్‌స్టరీని కలిగి ఉంది. ఈ వేరియంట్‌లు డోర్స్ లైనింగ్, డాష్‌బోర్డ్‌పై ఐవరీ సాఫ్ట్ టచ్ ఇన్సర్ట్‌లను కూడా కలిగి ఉంటుంది. ఇది డ్యూయల్-టోన్ ఇంటీరియర్ లుక్‌ను సృష్టిస్తుంది. అదనంగా, వినియోగదారులు ఈ గ్రేడ్‌లలో ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌ను యాక్సెసరీగా ఎంచుకోవచ్చు. ఇది బోల్డ్, స్పోర్టీ ఎక్స్‌టీరియర్ మెరుగుదలను అందిస్తుంది. అలాగే, క్రిస్టల్ బ్లాక్ పెర్ల్ కలర్ ఆప్షన్ V, VX గ్రేడ్‌లలో, ఇప్పటికే ఉన్న కలర్ లైనప్‌తో పాటు అందించబడుతుంది. కాగా, %V & VX% గ్రేడ్ ధరలు వరుసగా రూవరుసగా 12,39,000 రూ. 14,13,700 (ఉదా. షోరూమ్ ఢిల్లీ)..ముదురు, మరింత దూకుడుగా ఉండే లుక్‌ను ఇష్టపడే వినియోగదారుల కోసం హోండా ఎలివేట్ బ్లాక్ ఎడిషన్ రెండు విలక్షణమైన స్టైలింగ్ ఎంపికలను అందిస్తోంది. బ్లాక్ ఎడిషన్‌లో క్రోమ్ సిల్వర్ యాక్సెంట్‌లతో కూడిన బ్లాక్ ఎక్స్‌టీరియర్ ఉంటుంది. అదే సమయంలో స్టాండర్డ్ గ్రిల్‌ను నిలుపుకుంది. సిగ్నేచర్ బ్లాక్ ఎడిషన్‌లో ఇప్పుడు 7-క్లోర్ రిథమిక్ యాంబియంట్ లైట్‌ను కొత్త ఆల్ఫా-బోల్డ్ ప్లస్ గ్రిల్‌తో పాటు పూర్తి బ్లాక్-అవుట్ ఎలిమెంట్స్‌తో అందుబాటులోకి వచ్చింది. లోపలి భాగంలో, రెండు ఎడిషన్‌లు వాహనం ప్రీమియం ఆకర్షణను పెంచే అప్‌స్కేల్ ఆల్-బ్లాక్ ఇంటీరియర్ థీమ్‌ను కలిగి ఉన్నాయి. బ్లాక్ ఎడిషన్ సిగ్నేచర్ బ్లాక్ ఎడిషన్ రెండింటి ఇంటీరియర్‌లలో బ్లాక్ స్టిచింగ్‌తో బ్లాక్ లెథరెట్ సీట్లు, బ్లాక్ సాఫ్ట్ టచ్ డోర్ ప్యాడ్‌లు లెథరెట్‌తో చుట్టబడిన ఆర్మ్‌రెస్ట్‌లు డ్రైవింగ్ అనుభవాన్ని మెరుగుపరచడానికి రూపొందించిన ఆల్-బ్లాక్ డాష్‌బోర్డ్ సౌకర్యం, స్టైల్ సజావుగా కలయికతో ఉంటుంది.కొత్త ఆఫర్ల గురించి హోండా కార్స్ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ – సేల్స్ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్ల్ మాట్లాడుతూ, "హోండా ఎలివేట్ చాలా విజయవంతమైన మోడల్. దేశీయ ఎగుమతి మార్కెట్లలో దాని బహుముఖ ప్రజ్ఞకు వినియోగదారుల నుంచి పలు ప్రశంసలు అందుకుంది. అన్ని గ్రేడ్‌లలో ఐవరీ ఇంటీరియర్‌లు కొత్త మెరుగుదలలతో కొత్త ‌ గ్రేడ్‌ను ప్రవేశపెట్టడంతో, పండగ సమయంలో వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అందించడం, వారిని హోండా కుటుంబంలోకి హృదయపూర్వకంగా స్వాగతించేందుకు మేము ప్రయత్నాలు చేస్తున్నాము" అని వివరించారు.

## ఉద్యోగులకు దసరా కానుక.. డీఏ పెంపు ఫిక్స్.. భారీగా పెరగనున్న జీతాలు..!




**ముంబై-నవభూమి:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి సంవత్సరం రెండుసార్లు డీఏ సవరణ ఉంటుంది. ఈ ఏడాది జూలైకి సంబంధించిన డియర్‌నెస్ అలవెన్స్, డియర్‌నెస్ రిలీఫ్ పెంపుపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియాలు పేర్కొంటున్నాయి. 7వ వేతన సంఘం సిఫారసుల ప్రకారం ఈసారి డీఏ పెంపు 3 శాతం ఉంటుందని తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం ఉన్న 55 శాతం వద్ద ఉన్న డీఏ 58 శాతానికి పెరుగుతుంది. ఆల్ ఇండియా కన్జ్యూమర్ ప్రైస్ ఇండెక్స్ (లెక్కల ప్రకారం ఈ పెంపు ఉంటుంది. సవరించిన డీఏ జూలై 1, 2025 నుంచే అమలులోకి రానుంది. వచ్చే దసరాలోపే డీఏ పెంపుపై ప్రకటన ఉంటుందని తెలుస్తోంది.డీఏ పెంపు ప్రకటన కోసం సుమారు ఒక కోటి మంది ఉద్యోగులు, పెన్షనర్లు ఎదురుచూస్తున్నారు. పండుగల సీజన్‌లో ముఖ్యంగా సంక్రాంతి, దసరా సమయాల్లో డీఏ పెంపు ప్రకటనలు వస్తుంటాయి. జాతీయ, స్థానిక మీడియాల్లో దీనిపైనే ఎక్కువ వార్తలు వస్తుంటాయి. ప్రస్తుతం దసరా సీజన్ దగ్గర పడుతోంది. ఈ క్రమంలో డీఏ పెంపు ప్రకటన కోసం ఉద్యోగులు, పెన్షనర్లు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈసారి డీఏ పెంపు 3 శాతంగా ఖరారు చేసినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. 2025, జూలైలో విడుదలైన ఏఐసీపీఐ సూచిక గణాంకాల ప్రకారం ఈసారి డీఏ పెంపు 3 శాతంగా ఉంటుందని అంచనాలు వెలువడుతున్నాయి. జనవరి నుంచి జూన్ 2025 వరకు ఏఐసీపీఐ సూచీ క్రమంగా పెరుగుతూ రావడమే ఇందుకు కారణం. లేబర్ బ్యూరో తాజా ప్రకటన ప్రకారం ఆల్ ఇండియా సీపీఐ జూన్ 2025కి గానూ 145 వద్దకు చేరింది. అంతకు ముందు నెలతో పోలిస్తే 1 పాయింట్ పెరిగింది. ఇది జూలై 1 నుంచి డీఏ 3 శాతం పెంపును సూచిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. 2025, సెప్టెంబర్ నెల శాలరీతోనే పెంచిన డీఏ, డీఆర్ జమ చేస్తారని తెలుస్తోంది. జూలై, ఆగస్టు ఏరియర్స్ రానున్నాయి. దీంతో ఒక్కొక్కరి జీతం భారీగా పెరగనుంది. సెప్టెంబర్ నెలలో జరిగే కేబినెట్‌లోనే ఇందుకు ఆమోదం వేస్తారని తెలుస్తోంది. అయితే, ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు.

కొన్ని నివేదికలు మాత్రం 2025, అక్టోబర్ నెలలో జరిగే కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు చెబుతున్నాయి. అదే జరిగితే దీపావళికి ఉద్యోగులకు పెరిగిన జీతం పడనుంది. దీపావళి కానుకగా ప్రకటించాలని కేంద్రం భావిస్తున్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. డీఏ పెంపుపై నిర్ణయం ఆలస్యమైనా జూలై 1, 2025 నుంచే అమలు చేస్తారు. దీంతో బకాయిలు, శాలరీ కలిపి ఒకేసారి పెద్ద మొత్తంలో చేతికి శాలరీ అందుతుంది.3 శాతం డీఏ పెంపుతో ఎంత పెరుగుతుంది?

ఒక ఉద్యోగి బేసిక్ వేతనం రూ.18 వేలుగా ఉందని అనుకుందాం. ప్రస్తుతం డీఏ 55 శాతం అంటే రూ.9,900 వరకు వస్తుంది. కొత్త డీఏ 58 శాతానికి చేరితే అప్పుడు రూ.10,440 వరకు అందుతాయి. అంటే డీఏ పెంపుతో నెలకు రూ.540 చొప్పున పెరుగుతుంది. వార్షికంగా రూ.6,480 వరకు అదనంగా లభిస్తుంది. లెవెల్ 1లో గరిష్ఠ బేసిక్ వేతనం రూ.56,900 గా ఉంటే 58 శాతం డీఏతో రూ.33,000 వరకు అందుతాయి. అంటే నెలవారిగా రూ.1700 పైన పెరుగుతుంది. వార్షికంగా రూ.20 వేల వరకు అదనపు వేతనం లభిస్తుంది. వీటిపై హెచ్‌ఆర్‌ఏ, టీఏ వంటి ఇతర భత్యాలూ ఉంటాయి.

## కేంద్ర పథకం 'ఎన్‌పీఎస్'లో.. నెలకు రూ.5 వేలు జమ చేస్తే ఎంతొస్తుంది? పూర్తి లెక్కలివే



**ముంబై-నవభూమి:** కేంద్ర ప్రభుత్వం చాలా రకాల సంక్షేమ, సామాజిక భద్రత పథకాలు అందిస్తోంది. అందులో ఒకటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్). 18 సంవత్సరాలు దాటిన దేశ పౌరులు ఎవరైనా వాలంటరీ విధానంలో ఈ పథకంలో చేరవచ్చు. ఇది ఒక పొదుపు ఆధారిత రిటైర్మెంట్ ప్లాన్. ఈ పథకాన్ని 2009లో లాంచ్ చేసింది కేంద్ర ప్రభుత్వం. నెల నెలా చిన్న మొత్తాల్లో పొదుపు చేసుకుంటూ పదవీ విరమణ నాటికి పెద్ద మొత్తంలో కార్పస్ ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పిస్తోంది. మరి ఇందులో నెలకు రూ.5 వేలు పొదుపు చేస్తే 60 సంవత్సరాల వయసు వచ్చే సరికి ఎంత రావచ్చు అనేది తెలుసుకుందాం.గడిచిన దశాబ్ద కాలంలో చూసుకుంటే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేస్తున్న ఉద్యోగులతో పాటు అసంఘటిత రంగాల్లోని కార్మికులు సైతం పెద్ద సంఖ్యలో ఈ పథకాన్ని ఎంచుకున్నారు. పదవీ విరమణ ప్రణాళికకు పెరుగుతున్న ఆదరణను ఇది సూచిస్తోంది. ప్రస్తుత రోజుల్లో రిటైర్మెంట్ ప్లాన్‌కు పెద్ద పీట వేస్తున్నారు. ఉద్యోగాలు చేసే వారు తమకు స్థిరమైన, సురక్షితమైన ఆదాయం ఏర్పాటు చేసుకునేందుకే ఆలోచిస్తారు. దీని ద్వారా 60 సంవత్సరాల తర్వాత కూడా ఆర్థిక స్వతంత్రత ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం నేషనల్ పెన్షన్ సిస్టమ్ స్కీమ్ తీసుకొచ్చింది. ఇది ఒక దీర్ఘకాలిక పెట్టుబడి పథకం. ఇందులో మార్కెట్ లింక్డ్ రిటర్న్స్ రావడంతో పాటు రిటైర్మెంట్ తర్వాత గ్యారెంటీ పెన్షన్ అందిస్తుంది.ఎన్‌పీఎస్ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలకు రిటైర్మెంట్ అయిన తర్వాత చేతికి వచ్చే డబ్బుల్లో 40 శాతం యాన్యుటీ స్కీమ్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా నెల నెలా పెన్షన్ లభిస్తుంది. ఇదే సమయంలో మిగిలిన 60 శాతం ఒకేసారి చేతికి అందుతాయి. అయితే, మొత్తం కార్పస్ రూ.5 లక్షల లోపు ఉంటే మొత్తం డబ్బులు తీసుకోవచ్చు. పెన్షన్ ప్లాన్ కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. అందుకే ఎక్కువ మంది ఎన్‌పీఎస్ పథకాన్ని ఎంచుకుంటున్నట్లు చెప్పవచ్చు.నెలకు రూ.5 వేలతో ఎంతొస్తుంది?:ఉదాహరణకు ఒక వ్యక్తి 25 సంవత్సరాల వయసులో ఉద్యోగంలో చేరాడు అనుకుందాం. సదరు వ్యక్తి నేషనల్ పెన్షన్ సిస్టమ్ టైర్-1 అకౌంట్లో నెలకు రూ.5 వేలు పొదుపు చేయడం ప్రారంభించాలి. అంటే అతను మరో 35 సంవత్సరాల పాటు ఇన్వెస్ట్ చేయాలి. 60 సంవత్సరాల వయసు వచ్చే వరకు క్రమం తప్పకుండా నెలకు రూ.5 వేలు జమ చేస్తూ ఉండాలి. ఎన్‌పీఎస్ అనేది మార్కెట్ లింక్డ్ స్కీమ్. దీర్ఘకాలంలో చూసుకుంటే ఈ స్కీమ్ సగటున 8-10 శాతం రాబడులు అందించే అవకాశం ఉంటుంది. మీకు 10 శాతం వార్షిక రాబడి వస్తుందని అనుకుందాం.సదరు వ్యక్తి 35 సంవత్సరాల పాటు నెలకు రు.5 వేలు పెట్టుబడి పెట్టినట్లయితే మొత్తం పెట్టుబడి విలువ రూ.21 లక్షల వరకు అవుతుంది. దీనిపై ప్రతి ఏడాది 10 శాతం చొప్పున కాంపౌండింగ్ ఇంట్రెస్ట్ వస్తుందని అనుకుంటే అప్పుడు కార్పస్ మొత్తం రూ.1.72 కోట్లు అవుతుంది. 60 ఏళ్ల వయసు వచ్చే నాటికి కోటీశ్వరుడు అవుతాడు. ఇందులోంచి 40 శాతం అంటే రూ.68.63 లక్షలు యాన్యుటీ ప్లాన్ కొనాలి. మిగిలిన రూ.1.03 కోట్లు చేతికి వస్తాయి. యాన్యుటీ స్కీమ్ ద్వారా ఏడాదికి 6 శాతం రాబడి వస్తుందని అనుకుంటే అప్పుడు ఏడాదికి రూ.4.12 లక్షలు వస్తాయి.

## వృద్ధులే టార్గెట్.. లక్షలు కాజేస్తున్నారు..



**ముంబై-నవభూమి:** సాంకేతికత ఎంత వేగంగా దూసుకెళ్తుందో.. దాన్ని అడ్డుపెట్టుకొని జరిగే మోసాలు కూడా అంతే వేగంగా పెరిగిపోతున్నాయి. అమాయకులు, ముఖ్యంగా సీనియర్ సిటిజెన్లను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కొన్ని రోజుల కిందటి వరకు సైబర్ మోసాలు అంటే.. ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించి ఎక్కువగా జరిగేవి. ఇక్కడ ఎస్ఎంఎస్, లింక్స్ పంపించి.. వాటిని క్లిక్ చేస్తే.. డబ్బులు పోయేవి. తర్వాత ఓటీపీ, వాట్సాప్, జీమెయిల్ స్కామ్స్ ఇలా చాలానే వచ్చాయి. ఇప్పుడు మరో కొత్త రకం. అదే డీప్‌ఫేక్. ఇదే ఇప్పుడు సైబర్ నేరగాళ్ల సరికొత్త ఆయుధంగా మారింది. అచ్చం సెలబ్రిటీలు మాట్లాడినట్లుగా నకిలీ వీడియోలు సృష్టించి.. జనం నుంచి డబ్బు కాజేస్తున్నారు. ఫలానా వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తే.. తక్కువ సమయంలోనే ఎక్కువ రాబడి వస్తుందని వారు చెబుతున్నట్లుగా ఆశ చూపించి.. మంచి నీళ్లు తాగినంత సులభంగా బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవల కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కూడా తరచుగా డీప్‌ఫేక్ బారిన పడుతున్నారు.

**రూ. 66 లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి..**

ఉత్తరాఖండ్ రూర్కీలో నివసించే ఒక వ్యక్తికి ఫేస్‌బుక్‌లో ఒక వీడియో కనిపించింది. అందులో నిర్మలా సీతారామన్ ఒక నేషనల్ టీవీ ఛానెల్‌లో మాట్లాడుతున్నట్లుగా ఉంది. అందులో 'ఒక ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో కేవలం రూ. 21 వేలపెట్టుబడి పెడితే .. 7 రోజుల్లోనే రూ. 6.5 లక్షలు వస్తాయని' నిర్మలమ్మ హామీ ఇస్తున్నట్లు చూయించారు. దీనిని నమ్మిన బాధితుడు.. స్వయంగా ఆర్థిక మంత్రి చెప్పారు కదా అని ఇట్టే నమ్మి.. వీడియో కింద ఉన్న లింక్ క్లిక్ చేసి ఒక మోసపూరిత యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అంతే అక్కడ మొదలైంది అసలు సినిమా. సైబర్ నేరగాళ్ల బుట్టలో పడ్డాడు.

తర్వాత మోసగాళ్లు.. వాట్సాప్, ఇ- మెయిల్ ద్వారా ఆ వ్యక్తిని సంప్రదించారు. తాము అనే ఒక పెట్టుబడి సంస్థ ప్రతినిధులమని నమ్మించారు. క్రిప్టోలో అధిక రాబడి వస్తుందని ఆశ చూపించి.. మే 7- 29 మధ్య పలు ట్రాన్సాక్షన్ల ద్వారా రూ. 66 లక్షలు తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. డబ్బులు వచ్చాక.. వారు సదరు వ్యక్తితో కమ్యూనికేషన్ కట్ చేశారు. అప్పుడు మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు.. నిందితులు ఉపయోగించిన వారి బ్యాంక్ అకౌంట్ వివరాలు, వారు ఉపయోగించిన సాంకేతికతను మెటా సాయంతో ట్రాక్ చేసి.. నోయిడాలో ఇద్దర్ని అరెస్ట్ చేశారు. వారి దగ్గర్నుంచి 12 ఏటీఎం కార్డులు, 6 సిమ్ కార్డుల్ని స్వాధీనం చేసుకున్నారు.


**పీఐబీ ఫ్యాక్ట్ చెక్ వీడియో..**

అయితే ఈ డీప్‌ఫేక్ వీడియోపై కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఆగస్ట్ 25నే ప్రజల్ని అప్రమత్తం చేసింది. నిర్మలా సీతారామన్ మాట్లాడుతున్నట్లుగా ఉన్న ఆ వీడియోను పోస్ట్ చేసి.. ఇది డీప్ ఫేక్ వీడియో అని స్పష్టం చేసింది. ఈ స్కామ్ బారిన పడొద్దని హెచ్చరించింది. వాస్తవానికి ఇది మొదటిసారేం కాదు. గతంలో కూడా ఇలా నిర్మలా సీతారామన్ సహా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్, ఇతర రాజకీయ ప్రముఖుల పేరిట డీప్ ఫేక్ వీడియోలు సృష్టించిన సంఘటనలు చాలానే ఉన్నాయి. వీటిపై కూడా పీఐబీ ఫ్యాక్ట్ చెక్ ఎప్పటికప్పుడు క్లారిటీ ఇచ్చింది.

**అసలు డీప్‌ఫేక్ అంటే ఏంటి?**

డీప్‌ఫేక్ అంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , మెషీన్ లెర్నింగ్ టెక్నాలజీ ఉపయోగించి ఒక వ్యక్తి ముఖాన్ని, గొంతును లేదా మొత్తం వీడియోను మరో దానితో కలిపి నకిలీ వీడియో సృష్టించడం. ఈ వీడియోలు చాలా సహజంగానే కనిపిస్తాయి. ఎక్కువ శాతం వాస్తవమైనవిగానే అనిపిస్తాయి. వీటి ద్వారా ఒక వ్యక్తి చెప్పని మాటల్ని చెప్పినట్లు, చేయని పనుల్ని చేసినట్లుగా చూయించొచ్చు. గతంలో వీటిని కేవలం వినోదం కోసం ఉపయోగించగా.. ఇప్పుడు మోసాలకు కేంద్ర బిందువుగా మారింది.సెలబ్రిటీల వీడియో, ఆడియో క్లిప్స్ సేకరించి.. వాటిని మార్చి డీప్‌ఫేక్ వీడియోల్ని రూపొందిస్తారు. ఈ వీడియోలలో ఆ సెలబ్రిటీలు ఏదో ఒక యాప్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు చూయిస్తారు. లేదా బిట్ కాయిన్ వంటి క్రిప్టో ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయాలని చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని వారు చెబుతున్నట్లుగా చూయిస్తారు. ఇంకా వీటిని సామాజిక మాధ్యమాల్లో (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, యూట్యూబ్) విపరీతంగా షేర్ చేస్తారు.

## జీఎస్‌టీ వసూళ్లు రూ 1.86 లక్షల కోట్లు




**ముంబై-నవభూమి:** ఈ ఏడాది ఆగస్టులో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.5 శాతం వృద్ధితో రూ.1.86 లక్షల కోట్లు దాటాయి. దేశీయంగా వ్యాపార లావాదేవీలు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. పండగ సీజన్ కూడా ప్రారంభమవడంతో మున్ముందు నెలల్లో జీఎసటీ వసూళ్లు మరింత పెరిగే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ జూలైలో నమోదైన రూ.1.96 లక్షల కోట్ల ఆదాయంతో పోలిస్తే మాత్రం గత నెలలో వసూళ్లు కాస్త తగ్గాయి. మరిన్ని విషయాలు..ఆగస్టులో దేశీయ ఆర్థిక లావాదేవీల నుంచి వసూలైన స్థూల పన్ను ఆదాయం వార్షిక ప్రాతిపదికన 9.6 శాతం పెరిగి రూ.1.37 లక్షల కోట్లుగా నమోదైంది. దిగుమతుల నుంచి పన్ను వసూళ్లు మాత్రం 1.2 శాతం తగ్గి రూ.49,354 కోట్లకు పరిమితం అయ్యాయి.ఆగస్టులో జీఎసటీ రిఫండ్లు వార్షిక ప్రాతిపదికన 20 శాతం తగ్గి రూ.19,359 కోట్లుగా నమోదయ్యాయి. అందులో ఎగుమతులకు సంబంధించిన రిఫండ్లు రూ.8,346 కోట్లకు తగ్గడం సుంకాల ప్రభావానికి స్పష్టమైన సంకేతమని ఈవై ట్యాక్స్ పార్ట్‌నర్ సౌరభ్ అగర్వాల్ అన్నారు.రిఫండ్ల అనంతరం జీఎసటీ నికర ఆదాయం రూ.1.67 లక్షల కోట్లుగా ఉంది. 2024 ఆగస్టులో నమోదైన నికర ఆదాయంతో పోలిస్తే 10.7 శాతం అధికం ఇది.పండగ సీజన్‌లో డిమాండ్ వృద్ధి నవంబరు వరకు కొనసాగనుందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి అన్నారు. అయితే, ప్రతిపాదిత జీఎసటీ రేట్ల తగ్గింపుతో మాత్రం వసూళ్లు కాస్త తగ్గుముఖం పట్టవచ్చన్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో వసూళ్లు**

ఆగస్టు నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జీఎసటీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 21 శాతం పెరిగి రూ.3,989 కోట్లకు చేరగా.. తెలంగాణలో వసూళ్లు 12 శాతం వృద్ధితో రూ.5,103 కోట్లకు పెరిగాయి.

నవభూమి

www.navabhoomi.in

www.epaper.navabhoomi.in

12 హైదరాబాద్ | బుధవారం | 03 ၊ సెప్టెంబర్ ၊ 2025




## పెద్దన్నయ్య,చిన్నన్నయ్యలకి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన పవన్

సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బర్త్ డే సందర్భంగా ఆయనకి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అభిమానులు, ప్రముఖులు సోషల్ మీడియాలో సందేశాలతో, ప్రత్యేక పోస్టులతో వేడుక చేసుకుంటున్నారు. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి తన తమ్ముడితో దిగిన పాత ఫోటోని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ..చలనచిత్ర రంగంలో అగ్రనటుడిగా, ప్రజా జీవితంలో జనసేనాని గా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు నిరంతర సేవలందిస్తున్న కళ్యాణ్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు. ప్రజా సేవలో నువ్వు చూపుతున్న అంకితభావం చిరస్మరణీయం. ప్రజలందరి ఆశీస్సులతో, అభిమానంతో నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ప్రజలకు మార్గదర్శకుడిగా నిలవాలని ఆశీర్వదిస్తున్నాను. దీర్ఘాయుష్మాన్ భవ అంటూ స్పెషల్ పోస్ట్ చేసారు.చిరంజీవి శుభాకాంక్షలకు పవన్ కళ్యాణ్ ఇచ్చిన స్పందన ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంది. నా జీవితానికి మార్గదర్శి, తండ్రి సమానమైన అన్నయ్య, పద్మవిభూషణ్ చిరంజీవికి హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ఆశీస్సులు, ప్రేమాభిమానాలు నాకు అపారమైన ఆనందాన్ని ఇచ్చాయి. సమాజానికి సేవ చేయాలనే భావన మీరు నేర్పిన సేవా గుణం వల్లే వచ్చింది. నేడు జనసేన పార్టీ ద్వారా ప్రజలకు సేవ చేస్తూ వస్తున్నాను. మీరు ఎప్పుడూ సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, నాతోపాటు కోట్లాది మందికి మార్గదర్శకుడిగా నిలవాలని కోరుకుంటున్నా" అంటూ మెగాస్టార్‌కు పవన్ థాంక్స్ చెప్పారు.

నవచిత్ర



## పూజా హెగ్డే ఇక సర్దేసినట్టేనా..?



ఈ రెండు సినిమాలతో మళ్లీ తమిళంలో తన ఫ్యాన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యింది. బుట్ట బొమ్మ పూజా హెగ్డేకి బ్యాడ్ టైం నడుస్తూనే ఉంది. ముఖ్యంగా అమ్మడు చేస్తున్న ఏ అటెంప్ట్ కూడా వర్క్ అవుట్ అవ్వట్లేదు. సౌత్ లో మొన్నటిదాకా టాప్ హీరోయిన్ గా ఫాం కొనసాగించిన ఈ అమ్మడు ఇప్పుడు ఇక్కడ అవకాశాలు లేక కెరీర్ లో వెనకపడి ఉంది. 2023 లో కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా చేసింది. సల్మాన్ ఖాన్ సరసన నటించిన అమ్మడు ఆ సినిమాతో సక్సెస్ వస్తుందని ఆశించగా అది కాస్త మిస్ ఫైర్ అయ్యింది. ఇక ఆ షాక్ తో ఏడాది పాటు ఛాన్స్ లు రాలేదు. సూర్యతో రెట్రో మూవీ.. ఇక ఈ ఇయర్ బాలీవుడ్ లో షాహిద్ కపూర్ తో దేవ సినిమాతో ఆడియన్స్ ముందుకు రాగా అది ఫ్లాప్ అయ్యింది. సూర్యతో రెట్రో మూవీ చేయగా అది కూడా ఆశించిన స్థాయి ఫలితాన్ని అందుకోలేదు. ఇక ఈమధ్యనే సూఅప్ స్టార్ రజనీకాంత్ కూలీ సినిమాలో మోనిక సాంగ్ తో మెస్మరైజ్ చేసింది పూజా హెగ్డే. ఆ సాంగ్ హిట్ అయినా కూడా పూజా హెగ్డేకి పెద్దగా ఉపయోగపడలేదు. తెలుగులో రాధే శ్యాం తర్వాత అమ్మడికి ఛాన్స్ లు రావట్లేదు. గుంటూరు కారం నుంచి ఎగ్జిట్ అవ్వడమే అమ్మడు చేసిన పెద్ద మిస్టేక్ గా మారింది. అప్పటి నుంచి పూజా హెగ్డేకి అవకాశాలు కరువయ్యాయి. తెలుగులో సినిమాలు లేవు కానీ ప్రెజెంట్ కోలీవుడ్ లో ఛాన్స్ లు అందుకుంటుంది పూజా హెగ్డే. అల్రెడీ దళపతి విజయ్ చివరి సినిమా జన నాయగన్ లో నటిస్తుంది పూజా హెగ్డే. ఆ సినిమాతో పాటు కాంచన 4లో కూడా ఛాన్స్ అందుకుంది. హై జవాని తో ఇష్క్ హెూనా హై సినిమ.. ఈ రెండు సినిమాలతో మళ్లీ తమిళంలో తన ఫ్యాన్స్ ని అలరించాలని ఫిక్స్ అయ్యింది. ఇదే కాకుండా

## 'లోక' సినిమా వివాదం.. కర్ణాటక ప్రజలకు క్షమాపణలు తెలిపిన దుల్కర్ సల్మాన్



ఇటీవల థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న మలయాళ చిత్రం 'లోక చాప్టర్ 1 చంద్ర' తెలుగులో ఈ సినిమాను 'కొత్త లోక' పేరుతో విడుదల చేశారు. కల్యాణి ప్రియదర్శన్ నస్లేన్ ప్రధాన పాత్రల్లో నటించగా.. డామినిక్ అరుణ్ దర్శకత్వం వహించాడు. దుల్కర్ సల్మాన్ నిర్మాతగా వ్యవహారించాడు. ఆగష్టు 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్లు రాబడుతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి ఒక డైలాగ్ విషయంలో కన్నడ ప్రజలకు ఆగ్రహానికి గురయ్యారు. ఈ సినిమా క్లైమాక్స్‌లో విలన్ మాట్లాడుతూ.. ఒక ప్రాంతంకి(బెంగళూరు) చెందిన అమ్మాయిలను పెళ్లి చేసుకోను ఎందుకంటే వాళ్లు వ్యక్తిత్వం లేనివాళ్లంటూ ఒక డైలాగ్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే కాకుండా ఈ సినిమాలో దగర్‌అనే పదం వాడినట్లు తెలుస్తుంది. దీంతో ఈ వివాదం ముదురుతుండగా.. తాజాగా దీనిపై క్షమాపణలు తెలిపాడు చిత్ర నిర్మాత దుల్కర్ సల్మాన్. ఈ సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఒక ప్రెస్ నోట్ విడుదల చేశాడు.

'లోక చాప్టర్ 1 చంద్ర' సినిమాలోని ఒక డైలాగ్ కర్ణాటక ప్రజల మనోభావాలను అనుకోకుండా దెబ్బతీసిందని మా దృష్టికి వచ్చింది. ఈ విషయంలో మేము చింతిస్తున్నాము. మేము ప్రజల మనోభావాలకే అత్యంత ప్రాధాన్యత ఇస్తాము. ఎవరినీ బాధపెట్టే ఉద్దేశ్యం మాకు లేదు. ఈ సినిమాలో ఉన్న ఆ వివాదాస్పదమైన సంభాషణను వీలైనంత త్వరగా తొలగించడం లేదా మార్చడం జరుగుతుంది. మేము కలిగించిన ఈ ఇబ్బందికి మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నాము. దయచేసి మా క్షమాపణను అంగీకరించమని కోరుతున్నాము. అంటూ వేఫరర్ ఫిల్మ్స్ రాసుకొచ్చింది.

## తండ్రి హరికృష్ణ జయంతి.. ఎన్టీఆర్ భావోద్వేగ పోస్ట్



దివంగత నటుడు, రాజకీయ నాయకుడు నందమూరి హరికృష్ణ 69వ జయంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు, యంగ్ టైగర్ ఎన్టీఆర్ భావోద్వేగానికి లోనయ్యాడు. తండ్రిని తలుచుకుంటూ సోషల్ మీడియా ద్వారా ఓ భావోద్వేగపూరిత సందేశాన్ని షేర్ చేశారు. తండ్రితో తనకు ఉన్న అనుబంధాన్ని అక్షరాల్లో పంచుకుంటూ ఎన్టీఆర్ చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. "ఈ అస్తిత్వం మీరు%ఔ% ఈ వ్యక్తిత్వం మీరు" . మొక్కవోని ధైర్యంతో కొనసాగే మా ఈ ప్రస్థానానికి నేతృత్వం మీరు. ఆజన్మాంతం తలుచుకునే అశ్రు కణం మీరే అంటూ రాసుకొచ్చారు. ఈ పదాలు హరికృష్ణ పట్ల తారక్‌కు ఉన్న గాఢమైన ప్రేమను, గౌరవాన్ని ప్రతిబింబిస్తున్నాయి. అభిమానులు, నెటిజన్లు కూడా ఈ పోస్టుపై స్పందిస్తూ హరికృష్ణను స్మరించుకుంటున్నారు.2018, ఆగస్టు 30న హరికృష్ణ నల్లగొండ జిల్లా అన్నెపర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు హరికృష్ణ. నెల్లూరు జిల్లాలో ఓ అభిమాని వివాహానికి వెళ్తుండగా ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆయన అకాల మృతిని అభిమానులు ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నారు. హరికృష్ణ ఆత్మకి శాంతి చేకూరాలని పలువురు అభిమానులు కూడా ప్రార్థిస్తున్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ విషయానికి వస్తే ఇటీవల వార్ 2 చిత్రంతో ప్రేక్షకులని పలకరించాడు. ఇందులో హృతిక్ రోషన్ కూడా నటించాడు. భారీ మల్టీ స్టారర్‌గా రూపొందిన ఈ మూవీ బాక్సాఫీస్ దగ్గర తేలిపోయింది. ఎన్టీఆర్ డెబ్యూ బాలీవుడ్ మూవీ నిరాశపరిచింది.ఇదిలా ఉండగా, ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ భారీ యాక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందన్న వార్తలే వినిపిస్తున్నాయి. రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటించనుండగా, షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. వచ్చే ఏడాది ఈ సినిమాను విడుదల చేయాలని టీమ్ లక్ష్యంగా పెట్టుకుంది. చివరిగా ఎన్టీఆర్ దేవరతో ప్రేక్షకులని పలకరించాడు. ఈ సినిమా మంచి హిట్ అయింది. ఇందులో శ్రీదేవి తనయ జాన్వీ కపూర్ కథానాయికగా నటించింది.

## పెళ్లైన 13 ఏళ్లకి ప్రెగ్నెంట్.. బేబి బంప్ ఫొటోలు షేర్ చేసిన జల్సా హీరోయిన్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన సూపర్ హిట్ సినిమాల్లో జల్సా చిత్రం ఒకటి. ఈ మూవీ త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కగా ఇందులోని పవర్ ఫుల్ డైలాగ్స్ ప్రేక్షకులకి పూనకాలు తెప్పించాయి. యుద్ధంలో గెలవడమంటే శత్రువును చంపటం కాదు శత్రువును ఓడించటం అంటూ పవన్ చెప్పిన డైలాగ్స్ కి థియేటర్ హెూరెత్తిపోయింది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్‌కి జంటగా ఇలియానాతో పాటు పార్వతీ మెల్టన్ నటించింది. పార్వతి 2005లో వచ్చిన వెన్నెల అనే సినిమాతో హీరోయిన్ గా పరిచయం కాగా, ఆ తర్వాత గేమ్, అల్లరే అల్లరి,మధుమాసం సినిమాలు చేసింది. కానీ ఈ సినిమాలు ఏవి పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి.

జల్సా సినిమాలో నటించే అవకాశం రాగా, అందులో తన పాత్రతో మెప్పించింది. ఆ తర్వాత మహేష్ బాబు హీరోగా నటించిన దూకుడు సినిమాలో స్పెషల్ సాంగ్ లో మెరిసి అలరించింది. ఇక 2012లో వచ్చిన యమహెూ యమహ సినిమా తర్వాత ఈ అమ్మడు మళ్లీ వెండితెరపై కనిపించలేదు. కాగా సినిమాలకు దూరంగా ఉంటున్న పార్వతి.. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ తన క్యూట్‌నెస్‌తో అలరిస్తూ ఉంటుంది. పార్వతి మెల్టన్ 2012 లో అమెరికాలో ఉన్న బిజినెస్ మెన్ ని పెళ్లి చేసుకొని అక్కడే సెటిల్ అయింది. సినిమాలు మానేసి అక్కడ బిజినెస్‌లు చూసుకుంటూ ఉంది.తాజాగా పార్వతి మెల్టన్ తన బేబీ బంప్ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా, ఇవి చూసిన నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. బేబి బంప్‌లోను మరీ ఇంత హాట్ గా ఫొటో షూట్ చేయాలా అని అంటున్నారు. మరి కొందరు కాబోయే మామ్ కి కంగ్రాట్స్ అంటూ విషెస్ చెబుతున్నారు. ఇటీవల తన కేరీర్ పై పార్వతి ఆసక్తికర కామెంట్స్ చేసింది. తన కెరీర్ పాడవడానికి కారణం ఇద్దరు డైరెక్టర్స్ అని చెప్పుకొచ్చిన ముద్దుగుమ్మ వారి పేర్లు మాత్రం చెప్పలేదు. కాని అప్పట్లో కొంతమంది డైరెక్టర్ల పేర్లు వినిపించాయి.ఆ డైరెక్టర్లు ఎవరో సినీ ఇండస్ట్రీ గురించి తెలిసిన





## పవన్ కళ్యాణ్ బర్త్‌డే స్పెషల్.. 'ఓజీ' నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా ఆయన అభిమానులకు తీపికబురు అందింది. పవన్ నటిస్తున్న తాజా చిత్రం ఓజీ నుంచి బర్త్‌డే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. "డియర్ ఓజీ.. నిన్ను కలవాలని.. నీతో మాట్లాడాలని.. నిన్ను చంపాలని ఎదురుచూస్తున్న నీ ఓమి".. అంటూ ఇమ్రాన్ హష్మి ఓజీ బర్త్‌డే విషెస్ చెప్పినట్లు గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు రన్ రాజా రన్, సాహెూ చిత్రాలతో స్టార్ దర్శకుడిగా పేరు తెచ్చుకున్న సుజిత్ సైన్ దర్శకత్వం వహిస్తున్నాడు. జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతుండగా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



## అనుష్క శర్మను ఉద్దేశించి మృణాల్ కామెంట్స్.. మళ్లీ ట్రోల్ అవుతున్న నటి



బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ మళ్లీ ట్రోలింగ్‌కి గురవుతుంది. కొద్ది రోజుల క్రితం బిపాషా బసుపై చేసిన వ్యాఖ్యల కారణంగా మృణాల్ ట్రోలింగ్‌కు గురైన విషయం తెలిసిందే. దీంతో వ్యాఖ్యల పట్ల ఆమె క్షమాపణలు కూడా చెప్పింది. అయితే ఈ వివాదం సద్దుమణగకముందే అనుష్క శర్మను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల కారణంగా మరోసారి ట్రోలింగ్‌కు గురవుతున్నారు.ఒక ఇంటర్వ్యూలో మృణాల్ మాట్లాడుతూ.. సల్మాన్ ఖాన్ నటించిన బ్లాక్ బస్టర్ 'సుల్తాన్' సినిమా ఆఫర్ మొదటగా తనకు వచ్చిందని.. అయితే ఆ సమయంలో తాను సిద్ధంగా లేకపోవడంతో ఆ సినిమాను తిరస్కరించానని మృణాల్ వెల్లడించారు. అయితే సుల్తాన్ సినిమా సూపర్ హిట్ అవ్వడమే కాకుండా.. అందులో నటించిన నటికి స్టార్‌డమ్‌ను తెచ్చిపెట్టింది. కానీ ఆ సినిమాలో నటించిన నటి ప్రస్తుతం సినిమాలు చేయడం లేదని.. కానీ తాను మాత్రం వరుసగా సినిమాలు చేస్తూ ప్రస్తుతం బిజీగా ఉన్నానని మృణాల్ తెలిపారు. అయితే మృణాల్ ఎవరి పేరు చెప్పనప్పటికీ నెటిజన్లు ఆమె వ్యాఖ్యలు అనుష్క శర్మను ఉద్దేశించి అని భావిస్తున్నారు. ఎందుకంటే 'సుల్తాన్' సినిమాలో అనుష్క శర్మ హీరోయిన్‌గా నటించారు. ఆ సినిమా తర్వాత అనుష్క కొన్ని సంవత్సరాల పాటు సినిమాలకు విరామం తీసుకున్నారు. ఈ వ్యాఖ్యల పట్ల నెటిజన్లు మృణాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమను తాము గొప్పగా చూపించుకోవడానికి వేరే నటిని కించపరచడం సరికాదని విమర్శిస్తున్నారు.

## కప్పు కొడితే రూ 39.55 కోట్లు



**దుబాయ్-నవభూమి:** మహిళల వన్డే ప్రపంచ కప్ విజేత ప్రైజ్‌మనీని ఐసీసీ ఊహించని మొత్తానికి పెంచింది. చాంపియన్‌గా నిలిచే జట్టు ఏకంగా రూ. 39.55 కోట్లు అందుకోనుంది. గత మెగా టోర్నీలో విజేతకు రూ. 11.65 కోట్లు దక్కగా.. అంతకు మూడు రెట్లకు పైగా మొత్తం ఈసారి చాంపియన్‌కు దక్కనుంది. ఇక, రన్నర్‌పగా నిలిచే జట్టుకు రూ. 19.77 కోట్లు (గతసారి రూ. 5.30 కోట్లు) లభించనున్నాయి. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న వన్డే వరల్డ్ కప్ ఈనెల 30న ప్రారంభం కానుంది. ఎనిమిది జట్లు మెగా టోర్నమెంట్ బరిలో దిగుతున్నాయి. చాంపియన్‌షిప్ ప్రైజ్‌మనీ దాదాపు రూ. 122.5 కోట్లు కావడం విశేషం. కిందటి టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 31 కోట్ల కంటే ఇది 297 శాతం అధికం. ఇంకా.. 2023 పురుషుల వన్డే ప్రపంచ కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 88.26 కోట్లకన్నా.. మహిళల మెగా టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ ఎంతో ఎక్కువ. అలాగే పురుషుల టోర్నీ విజేత జట్టుకు దక్కింది రూ. 35.31 కోట్లే.

ప్రైజ్‌మనీ ఇలా..

విజేతకు- రూ.39.55 కోట్లు

రన్నరప్‌నకు - రూ. 19.77 కోట్లు

సెమీఫైనలిస్టలకు - రూ.9.89 కోట్లు చొప్పున

ఐదు, ఆరు స్థానాల జట్లకు - రూ.6.16 కోట్లు చొప్పున

ఏడు, ఎనిమిది స్థానాల జట్లకు - రూ. 2.46 కోట్లు చొప్పున

గ్రూప్ దశలో ఒక్కో విజయానికి - రూ. 30.29 లక్షలు

పాల్గొన్న ప్రతి జట్టుకు- అదనంగా రూ. 2.20 కోట్లు

## రిబకినాకు షాక్



**న్యూయార్క్-నవభూమి:** యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో మరో సీడెడ్ క్రీడాకారిణి ఇంటిబాట పట్టింది. వింబుల్డన్ మాజీ చాంపియన్, 9వ సీడ్ ఎలెనా రిబకినాకు నాలుగో రౌండ్లో చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి మార్కెటా వొంద్రుసోవా షాకిచ్చింది. వొంద్రుసోవా 4-6, 7-5తో రిబకినా (కజకిస్థాన్)ను కంగుతినిపించి యూఎస్ ఓపెన్‌లో రెండోసారి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇక, టాప్ సీడ్ సబలెంక (బెలారస్) 6-1, 6-4తో క్రిస్టియానా బుక్సా (స్పెయిన్)ను, రెండో సీడ్ స్వియటెక్ 6-3, 6-1తో ఎకటరీనా (రష్యా)ను ఓడించి క్వార్టర్స్ చేరారు. బార్బరా క్రెజికోవా (చెక్) 1-6, 7-6(13), 6-3తో టేలర్ టౌన్‌సెండ్‌పై అద్భుత విజయం సాధించింది.నొవాక్ 64వసారి: పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కారజ్, సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, టేలర్ ఫ్రిట్జ్ ముందంజ వేశారు. ఏడో సీడ్ జొకోవిచ్ 6-3, 6-3, 6-2తో జాన్ లెన్నార్డ్ స్ట్రఫ్ (జర్మనీ)పై వరుస గేముల్లో నెగ్గి రికార్డుస్థాయిలో 64వసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. అల్కారజ్ 7-6(3), 6-3, 6-4తో ఫ్రెంచ్ ప్లేయర్ ఆర్థర్ రెండర్‌కెచ్‌పై సునాయాసంగా నెగ్గాడు. ఈ క్రమంలో ఓపెన్ ఎరాలో 13సార్లు గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్ చేరిన పిన్నవయస్కుడిగా 22 ఏళ్ల అల్కారజ్ రికార్డులకెక్కాడు. అమెరికా ప్లేయర్ టేలర్ ఫ్రిట్జ్ 6-4, 6-3, 6-3తో 21వ సీడ్ థామస్ మచాక్ (చెక్)పై, అలెక్స్ డి మినార్ 6-3, 6-2, 6-2తో లియాంద్ర రైడీపై గెలిచారు. 15వ సీడ్ రుబ్లేవ్ 5-7, 3-6, 4-6తో ఫెలిక్స్ అగర్ అల్‌అస్సిమీ చేతిలో ఓడాడు. డబుల్స్ రెండో రౌండ్‌లో ఇండో-ఆసీస్ జోడీ యుకీ భాంబ్రి-మైకేల్ వీనస్ 6-1, 7-5తో ఎస్కోబార్-మిగ్వెల్ వరేలాను ఓడించింది.

నవక్రీడ

## 2026 ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను ఢిల్లీ ఆతిథ్యం




**పారిస్-నవభూమి:** వచ్చే ఏడాది ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిపనకు భారత్ ఆతిథ్యమివ్వ నుంది. 2026 ఆగస్టులో జరిగే ఈ మెగా టోర్నీకి వేదికగా ఢిల్లీని ఖరారు చేసినట్టు ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ప్రకటించింది. ఆదివారం ఇక్కడ ముగిసిన ప్రపంచ చాంపియన్‌షిప వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా బీడబ్ల్యూఎఫ్ చీఫ్ ఖున్ యింగ్ పటామ.. భారత్‌కు ఆతిథ్యం దక్కిన విషయాన్ని వెల్లడించారు. ఈ మెగా ఈవెంట్ భారత్‌లో జరగనుండడం ఇది రెండోసారి. తొలిసారిగా 2009లో హైదరాబాద్‌లో టోర్నీ జరిగింది.


Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**